www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



టీడీపీలోకి తీగల

చంద్రబాబుతో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే భేటీ
త్వరలో తెలుగుదేశంలో చేరతానన్న కృష్ణారెడ్డి
రాష్ట్రంలో పార్టీకి పూర్వవైభవం తెస్తానని వ్యాఖ్య
బాబును కలిసిన మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి 3
మనవరాలి పెళ్లికి ఆహ్వానించేందుకేనన్న మల్లారెడ్డి

మంగళవారం | 8-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 192 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి ఉ. 11.18 తదుపరి షష్ఠి; నక్షత్రం: జ్యేష్ఠ తె. 4.08 తదుపరి మూల; వర్జ్యం: ఉ.8.25-10.07; దుర్ముహూర్తం: ఉ.8.31-9.18, రా.9.55-10.43; అమృతఘడియలు: రా.6.42-8.25; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.10, సూర్యాస్తమయం: 5.54 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



చెరువుల్లో 386 ఎకరాలు మాయం!

హైదరాబాద్‌లో 44 నీటి వనరులు పూర్తిగా కనుమరుగు
మరో 127 చోట్ల పెద్దమొత్తం విస్తీర్ణంలో ఆక్రమణలు
పదేళ్లలో భారీగా కబ్జాలు!.. బీఆర్‌ఎస్ నేతలే అధికం!
మరికొన్నిచోట్ల ప్రతిపక్ష స్థానిక నాయకుల హస్తం
ఔటర్ వరకు 695 చెరువులున్నట్లు గుర్తింపు
ప్రభుత్వ రికార్డులు, ఉపగ్రహ చిత్రాల ద్వారా పరిశీలన

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లోని చెరువులు, కుంటల్లో అంతులేని ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. ప్రత్యేకించి గడిచిన పదేళ్లకాలంలో అత్యధికంగా చెరువులు కబ్జాకు గురయ్యాయి. ఔటర్ రింగ్ రోడ్డు వరకు మొత్తం 695 చెరువులు ఉన్నట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతుండగా.. ఇందులో 2014 నుంచి 2023 మధ్య కాలంలోనే 44 చెరువులు పూర్తిగా కబ్జాలకు గురై కనుమరుగయ్యాయి. మరో 127 చెరువుల్లో పెద్ద మొత్తం విస్తీర్ణం ఆక్రమణల పాలైంది. మొత్తంగా ఆయా

మిగతా 12వ పేజీలో...

12

మూసీ, చెరువుల ప్రక్షాళన సమాజ హితానికే

నిర్వాసితులకు న్యాయం ప్రభుత్వ బాధ్యత
మేలైన ప్యాకేజీ ఏంటో విపక్షాలు చెప్పాలి
హైదరాబాద్ అంటేనే.. రాక్స్, పార్క్స్, లేక్స్
కబ్జాలను మ్యాపులతో వివరించిన భట్టి

13

హైడ్రాకూ యాప్

చెరువులు, పార్కులు, సర్కార్ స్థలాలపై నిఘా
కబ్జాలపై ఫిర్యాదులు చేసేలా రూపకల్పన
అందుబాటులోకి రానున్న అప్లికేషన్

మూసీ నదిలోకి మురికి పోనియ్యం

రూ.17,000 కోట్లతో సీవరేజ్ ప్రాజెక్టు.. అమృత్ 2 కింద సాయం చేయండి

7,444 కిలోమీటర్ల మేర సివరేజ్‌ల నిర్మాణం
27 మునిసిపాలిటీలు కలిపి మాస్టర్ ప్లాన్
మెట్రో రెండో దశ భారం సగం భరించాలి
కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి
సివరేజ్ డీపీఆర్‌ను అందజేసిన ముఖ్యమంత్రి
వరద నష్టం పనులకు రూ.5438 కోట్లివ్వండి
ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రంభీమ్ జిల్లాల్ని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించండి
విభజన సమస్యలను పరిష్కరించండి
హోంమంత్రి అమిత్ షాకు రేవంత్ విజ్ఞప్తి



కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మూసీ ప్రక్షాళన విషయంలో దూకుడు మీదున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నగరంలోని సీవరేజ్‌ను మూసీలో కలవకుండా చూసేందుకు ఉద్దేశించిన హైదరాబాద్ సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్(సీఎస్ఎంపీ)కు కేంద్ర ప్రభుత్వం సాయం కోరారు. మాస్టర్ ప్లాన్‌ను అమృత్ 2.0లో చేర్చి ఆర్థిక సహాయం అందించాలని కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను అభ్యర్థించారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల ముఖ్యమంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీకి వచ్చిన రేవంత్‌రెడ్డి సోమవారం నిర్మాణ్ భవన్‌లో ఖట్టర్‌తో భేటీ అయ్యారు. హైదరాబాద్‌తో పాటు సమీప 27 పుర పాలక సంఘాలతో కలుపుకొని 7,444 కి.మీ మేర రూ.17,212.69 కోట్లతో సీఎస్ఎంపీకి డీపీఆర్‌ను రూపొందించినట్లు తెలిపారు. సదరు డీపీఆర్‌ను కేంద్ర మంత్రికి సీఎం అందజేశారు. ప్రపంచ స్థాయిలో హైదరాబాద్ ప్రజల జీవన ప్రమాణాలు ఉండాలనే లక్ష్యంతో నగరంతో పాటు సమీప మునిసిపాలిటీలలో 100 శాతం ద్రవరూప వ్యర్థాలను శుద్ధి చేయాలని తమ ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. హైదరాబాద్‌లో మురుగు శుద్ధి వ్యవస్థ పురాతనమైనదని, ప్రస్తుత అవసరాలకు

మిగతా 13వ పేజీలో...



గ్యారీ రువ్‌కున్, విక్టర్ ఆంబ్రోస్

మైక్రో ఆర్‌ఎన్‌ఏ ఆవిష్కరణకు వైద్య నోబెల్ 2

అమెరికా శాస్త్రవేత్తలు ఆంబ్రోస్, రువ్‌కున్‌కు అత్యున్నత పురస్కారం
జన్యు నియంత్రణలో మైక్రో ఆర్ఎన్ఏ పాత్ర విశ్లేషణకు దక్కిన గౌరవం

నేడు హరియాణా, కశ్మీర్ ఫలితాలు 2

కశ్మీర్‌లో నామినేటెడ్ ఎమ్మెల్యేలే కీలకమా?
బీజేపీ ఎత్తులపై ఎన్సీ, కాంగ్రెస్‌లో గుబులు
వీలైతే పీడీపీతో కలుస్తాం: ఫరూక్ అబ్దుల్లా



భవిష్ అగర్వాల్ ఘాటు వ్యాఖ్యలు..

ఓలా షేర్లు ఢమాల్!

కంపెనీ ఈవీల సర్వీసింగ్ బాగాలేదని స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా ట్వీట్
అది 'పెయిడ్' అంటూ భవిష్ ఆగ్రహం
'ఎక్స్' వేదికగా ఇద్దరి ట్వీట్ల యుద్ధం
భవిష్‌పై మండిపడ్డ ఓలా వినియోగదార్లు
8% పతనమైన ఓలా ఎలక్ట్రిక్ షేర్ల విలువ

ముంబై, అక్టోబరు 7: 'నోరా.. వీపునకు తేకే' అని సామెత! నోరు దురుసుగా మాట్లాడితే వీపు దెబ్బలు తినాల్సి వస్తుంది కాబట్టి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని దాని అర్థం!! ఓలా సీఈవో భవిష్ అగర్వాల్ పరిస్థితి సరిగ్గా అదే అయ్యింది! ఓలా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) సర్వీసింగ్ బాగోలేదంటూ స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా పెట్టిన ట్వీట్‌కి.. భవిష్ కొంచెం ఘాటుగా స్పందించడంతో.. ఓలా ఈవీలతో ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతున్న

మిగతా 2వ పేజీలో...



గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఆర్థిక భరోసా


పరిహారానికి ఆరు నెలల్లో దరఖాస్తు చేసుకోవాలి
కుటుంబానికి రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా
తెలంగాణకు చెందిన కార్మికుల కుటుంబాలకే..
నిరుడు డిసెంబరు 7 తర్వాత మృతి చెందినవారికే..
మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశాల్లో పనిచేసేందుకు వెళ్లి, వివిధ కారణాలతో తెలంగాణకు చెందిన కార్మికులు చనిపోతే ఆ కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను జారీచేసింది. మృతుల కుటుంబాల్లో ఎక్స్‌గ్రేషియా పొందే అర్హత గల సభ్యుల వివరాలను కూడా వెల్లడించింది. గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన కార్మికులకే ఈ ఎక్స్‌గ్రేషియా వర్తిస్తుంది. గత సంవత్సరం డిసెంబరు 7 తర్వాత మృతి చెందినవారికి దీన్ని అమలుచేస్తారు. మృతిచెందిన

మిగతా 13వ పేజీలో...

పరిశ్రమలు పెట్టని సంస్థలకు భూములెందుకు?

ఇందూ టెక్‌జోన్, బ్రాహ్మణి ఇన్‌ఫ్రాటెక్, స్టార్‌గేజ్, అనంత టెక్నాలజీస్, జేటీ హోల్డింగ్స్ పనులు చేపట్టలేదు
వాటికి భూకేటాయింపులను రద్దు చేయండి
ఆ సంస్థలపై 4 నెలల్లో చర్యలు తీసుకోవాలి
రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు
నిబంధనలు పాటించేవాళ్లపై జోక్యం చేసుకోమన్న కోర్టు



హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐటీ సంస్థలు, పరిశ్రమల ఏర్పాటుకు 2001-2006 మధ్య కాలంలో ప్రభుత్వం నుంచి విలువైన భూములను తక్కువ ధరకు పొంది ఇప్పటివరకు ఎలాంటి పరిశ్రమలను ఏర్పాటు చేయని కంపెనీల భూకేటాయింపులను రద్దు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయా కంపెనీల నుంచి భూములు వెనక్కి తీసుకోవాలని స్పష్టం చేసింది. నాలుగు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని తేల్చిచెప్పింది. ఎలాంటి పనులు చేపట్టని ఇందూ టెక్‌జోన్ ప్రైవేట్ లిమిటెడ్, బ్రాహ్మణి ఇన్‌ఫ్రాటెక్

మిగతా 12వ పేజీలో...



గుడిని బట్టి నిధి

ఆదాయం ప్రకారం సీజీఎఫ్ వసూలుకు ప్రతిపాదన!
కామన్ గుడ్ ఫండ్ కోసం ప్రజాప్రతినిధుల అభ్యర్థనలు
భారీగా సమీకరించేందుకు ఆలయాలపై అధికార్ల చూపు
కనిష్ఠంగా 7 శాతం నుంచి గరిష్ఠంగా 12 శాతం దాకా..
మఠాల నుంచి ఐదు శాతం
ఇవ్వలేమంటున్న ఈవోలు

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ ఆలయాలకు వచ్చే ఆదాయం ఆధారంగా వాటి నుంచి నిధులు అధికంగా సేకరించి.. ఆ మొత్తాన్ని కామన్ గుడ్ ఫండ్‌కు (సర్వ శ్రేయో నిధి-సీజీఎఫ్) జమచేయడంపై దేవాదాయ శాఖ అధికారులు దృష్టిసారించారు. పురాతన ఆలయాల మరమ్మతులు, కొత్త ఆలయాలు నిర్మాణం నిమిత్తం ప్రభుత్వం ఈ నిధిని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల ఆదాయం నుంచి ప్రతి నెలా 5 శాతం నిధులను ఈ సీజీఎఫ్‌కు జమచేస్తారు. సాధారణ భక్తులు, ప్రజలు, ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చే అభ్యర్థనలు, సిఫారసుల ఆధారంగా ఈ నిధులను కేటాయిస్తారు. అయితే, ఇటీవలికాలంలో ఈ నిధుల కోసం ప్రజాప్రతినిధుల

మిగతా 12వ పేజీలో...

హత్యాచారం చేసింది సంజయ్ రాయే!

కోల్‌కతా వైద్యురాలి కేసులో చార్జిషీటు
సీసీ టీవీలోనూ కదలికలు నిక్షిప్తం
బాధితురాలి గోళ్లలో నిందితుడి రక్తం, చర్మం.. పక్కాగా సాక్ష్యాధారాలు 2
గ్యాంగ్‌రేప్ ప్రస్తావన చేయని సీబీఐ



10

టీజీఈఆర్‌సీ చైర్మన్‌గా జస్టిస్ నాగార్జున్!
నియామకానికి సీఎం రేవంత్ అంగీకారం
29న బాధ్యతల స్వీకరణ

మాఫీ గారడీ

31 వేల కోట్ల రుణమాఫీ చేశామని రేవంత్ అన్నారు
మోదీకి రాసిన లేఖలో రూ.17 వేల కోట్లే చెప్పారు..
మరి ఆ రూ.14 వేల కోట్లు ఏమయ్యాయి?
లెక్కలు బయట పెట్టాలి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అంటేనే అబద్ధాల పుట్ట, అంకెల గారడీ అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డి పొంతనలేని లెక్కలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. రూ.31 వేల కోట్ల రుణాలు మాఫీ చేశామని రేవంత్ ఒక సభలో ప్రకటించారని, ప్రధానికి రాసిన లేఖలో రూ.17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశామని పేర్కొన్నారని

మిగతా 13వ పేజీలో...



అవినీతి ఐపీఎస్‌లపై కొరడా!

1 అధికార దుర్వినియోగం చేసేవారిపై ప్రభుత్వం సీరియస్
1 నిఘా విభాగం ద్వారా పలువురు ఐపీఎస్‌ల తీరుపై ఆరా
1 నివేదిక ఆధారంగా అప్రధాన పోస్టింగ్‌లు, ఇతర చర్యలు!
1 పోలీస్ శాఖ మొత్తానికీ స్పష్టమైన సంకేతం ఇచ్చే యోచన

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్న సిబ్బందిపై చర్యలు తీసుకున్న ప్రభుత్వం.. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఐపీఎస్‌ల తీరునూ తీవ్రంగా పరిగణిస్తోంది. కంచే చేను మేసిన చందంగా వ్యవహరిస్తున్న కొందరు ఐపీఎస్‌ల వ్యవహారంపై ఆరా తీస్తోంది. నిఘా విభాగం ద్వారా వారి వివరాలు తెప్పించుకొని.. వారిని అప్రధాన పోస్టింగ్‌కు పంపించడంతోపాటు ఇతర చర్యలూ తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తోంది. వాస్తవానికి ఇప్పటివరకు కానిస్టేబుల్ నుంచి డీఎస్పీల వరకు వారి పనితీరు, అవినీతి, అక్రమాలపై వచ్చే ఆరోపణలకు సంబంధించి జిల్లా ఎస్పీలు నివేదికలు సిద్ధం చేసేవారు. అయితే ఇప్పుడు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏకంగా ఐపీఎస్‌లపై నిఘా విభాగం నివేదిక సిద్ధం చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కొంత మంది ఐపీఎస్‌లు పరిధి దాటి వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. అలాంటి వారికి సంబంధించి ప్రస్తుత ప్రభుత్వం వద్ద పూర్తి సమాచారం ఉన్నట్లు

మిగతా 10వ పేజీలో...

రుణమాఫీపై సంతృప్తిగానే రైతులు

మిగతావీ మాఫీ చేస్తామని భావిస్తున్నారు
అసంతృప్తి ఉంటే వారు ఊరుకుంటారా?
మాఫీపై మోదీ మాట్లాడడమా?: తుమ్మల

13

ర్యాంకు పెరిగినా.. కన్వీనర్ కోటా దక్కింది

ఉస్మానియాలో 1.15 లక్షల ర్యాంకుకు..
ప్రైవేటులో జనరల్‌లో 1.95 లక్షలకు..
నీట్ రెండో విడత కౌన్సెలింగ్ పూర్తి

ఇజ్రాయెల్‌పై ముప్పేట దాడి 2

ఏకకాలంలో హిజ్బుల్లా, హమాస్, హౌతీల దాడి
135 రాకెట్లతో హైఫాపై విరుచుకుపడ్డ హిజ్బుల్లా
టెల్‌అవీవ్‌పై హమాస్.. యెమెన్ నుంచి హౌతీలు
ఇజ్రాయెల్‌లోని నివాళి కార్యక్రమాలే టార్గెట్

కుటుంబం ఛిద్రం

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ద్విచక్ర వాహనం
ఒకే కుటుంబంలోని నలుగురి దుర్మరణం
సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో ఘటన 3



దాడుల నుంచి రక్షణ కోసం దాక్కున్న ఇజ్రాయెల్ పౌరులు

ఇజ్రాయెల్‌పై ముప్పేట దాడి

» రాకెట్లతో విరుచుకుపడిన హిజ్బుల్లా, హమాస్, హౌతీ

టెల్ అవీవ్, గాజా, బీరుట్, అక్టోబరు 7: హమాస్ దాడికి ఏడాదైన సందర్భంగా ఎంత అప్రమత్తంగా ఉన్నా ఇజ్రాయెల్‌పై హిజ్బుల్లా, హమాస్ పెద్ద ఎత్తున రాకెట్లు ప్రయోగించాయి. హైఫా నగరంపై లెబనాన్‌నుంచి మొత్తం 135 రాకెట్లు వచ్చిపడ్డాయని ఇజ్రాయెల్ తెలిపింది. ఈ దాడుల్లో పది మంది గాయపడ్డారు. ఏడాది క్రితం నాటి హమాస్ దాడిలో మరణించినవారికి నివాళులర్పిస్తున్న కార్యక్రమాలే లక్ష్యంగా హిజ్బుల్లా, హమాస్ ఈ రాకెట్ దాడులకు పాల్పడ్డాయి. టెల్ అవీవ్‌పై రాకెట్ దాడులు చేసినట్లు హమాస్ ప్రకటించింది. అటు యెమెన్ నుంచి హౌతీలు కూడా క్షిపణులను, డ్రోన్లను ప్రయోగించారు. అయితే వాటిని తాము కూల్చివేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. మరోవైపు లెబనాన్ రాజధాని బీరుట్‌లో ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగిస్తోంది. గంట వ్యవధిలో 120 లక్ష్యాలపై దాడి చేశామని వెల్లడించింది. లెబనాన్‌లోని బరాచిత్ ప్రాంతంలో ఇజ్రాయెల్ వైమానిక దాడిలో పది మంది చనిపోయారు. వెస్ట్‌బ్యాంక్‌లో 400 మంది పాలస్తీనా మద్దతుదారులు ర్యాలీ నిర్వహించారు. ఇజ్రాయెల్ దాడుల్లో సెప్టెంబర్ 27న మరణించిన హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా ఫొటోలతో పాటు హిజ్బుల్లా, హమాస్, హౌతీల జెండాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, ఏడాది క్రితం ఇజ్రాయెల్‌పై దాడిచేసి హమాస్ అపహరించుకుపోయిన బందీలందరినీ విడిపిస్తామని, అప్పటిదాకా పోరాటం కొనసాగుతుందని అధ్యక్షుడు నెతన్యాహూ స్పష్టం చేశారు. హమాస్, హిజ్బుల్లాలను తుదముట్టిస్తామని ఆయన పునరుద్ఘాటించారు.

మైక్రో ఆర్‌ఎన్‌ఏ ఆవిష్కరణకు వైద్య నోబెల్

» అమెరికా శాస్త్రవేత్తలు ఆంబ్రోస్, రువ్‌కున్‌కు పురస్కారం

స్టాక్‌హోం, అక్టోబరు 7: వైద్య రంగంలో అందించిన విశేష సేవలకు గానూ అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రువ్‌కున్‌లను ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారం వరించింది. మైక్రో ఆర్‌ఎన్‌ఏ ఆవిష్కరణ, జన్యు నియంత్రణలో దాని పాత్రను వివరించినందుకు గానూ వారికి ఈ అవార్డు దక్కినట్టు స్వీడన్‌లోని నోబెల్ కమిటీ సోమవారం ప్రకటించింది. ప్రస్తుతం మసాచుసెట్స్ యూనివర్సిటీ మెడికల్ స్కూల్‌లో నేచురల్ సైన్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆంబ్రోస్‌కు.. హార్వర్డ్ యూనివర్సిటీలో చేసిన పరిశోధనకు గానూ ఈ బహుమతి దక్కింది. జన్యుశాస్త్ర ప్రొఫెసర్ అయిన రువ్‌కున్ మసాచుసెట్స్ యూనివర్సిటీ మెడికల్ స్కూల్, హార్వర్డ్ యూనివర్సిటీ మెడికల్ స్కూల్‌లో పరిశోధనలు చేశారని నోబెల్ అవార్డుల కమిటీ సెక్రటరీ థామస్ పెర్ల్‌మన్ తెలిపారు. కాగా, ఈ అవార్డు కింద ఆంబ్రోస్, రువ్‌కున్‌లకు సుమారు రూ.8.91 కోట్లు నగదు బహుమతి దక్కనుంది. కాగా, మంగళవారం భౌతికశాస్త్రంలో, బుధవారం రసాయనశాస్త్రంలో, గురువారం సాహిత్యంలో నోబెల్ బహుమతులు ప్రకటిస్తారు. నోబెల్ శాంతి బహుమతిని శుక్రవారం.. ఆర్థిక శాస్త్రంలో నోబెల్ పురస్కార విజేతలను ఈనెల 14న వెల్లడిస్తారు.

గోధుమపిండిలో విషం కలిపి 13 మంది హత్య

» ప్రియుడితో పెళ్లికి అడ్డుపడుతున్నారని పాక్‌లో దారుణం

సింధూ ప్రావిన్స్, అక్టోబరు 7: ప్రేమించిన అబ్బాయితో పెళ్లికి అడ్డుపడుతున్నారని సొంత కుటుంబాన్నే కడతేర్చింది ఓ బాలిక. ప్రియుడితో కలిసి తినే ఆహారంలో విషం కలిపి 13 మందిని పొట్టనబెట్టుకుంది. ఈ ఘటన పాకిస్థాన్‌లోని సింధూ ప్రావిన్స్‌లో ఆగస్టు 19న జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఖైర్పూర్‌లోని హైబత్ ఖాన్ బ్రోహి గ్రామానికి చెందిన బాలిక.. కొంత కాలంగా ఓ యువకుడిని ప్రేమిస్తోంది. పెళ్లికి కుటుంబసభ్యులు ఒప్పుకోకపోవడంతో కోపం పెంచుకుంది. వారిని అడ్డుతొలగించుకోవడానికి ప్రియుడితో కలిసి పన్నాగం పన్నింది. గోధుమ పిండిలో విషం కలిపి చపాతీలు తయారు చేసి వడ్డించింది. రాత్రి భోజనం చేసిన 13 మంది తీవ్ర అస్వస్థతకు గురికావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారని, చికిత్స పొందుతూ అందరూ మృతిచెందారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి బాలికను అదుపులోకి తీసుకున్నారు.

స్పెషల్ టూల్‌కిట్‌తో ప్రశ్నపత్రం పెట్టె తెరిచారు

» నీట్ పేపర్ కోసం 144 మంది డబ్బు చెల్లించారు: సీబీఐ

న్యూఢిల్లీ, అక్టోబరు 7: దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన నీట్ యూజీ- 2024 పేపర్ లీక్ వ్యవహారంలో సీబీఐ సోమవారం మూడో చార్జిషీటు దాఖలు చేసింది. నీట్ పేపర్ కోసం 144 మంది భారీ మొత్తంలో డబ్బులు చెల్లించినట్లు పేర్కొంది. పరీక్ష జరగడానికి కొద్ది గంటల ముందే ఝార్ఖండ్ హజారీబాగ్‌లోని ఒయాసిస్ పాఠశాల నుంచి పంకజ్ కుమార్ అనే వ్యక్తి ప్రశ్నపత్రాన్ని దొంగిలించినట్లు పేర్కొంది. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ సహకారంతో పేపర్ బయటకొచ్చినట్లు చార్జిషీటులో పేర్కొంది. పంకజ్ కుమార్ ప్రత్యేకమైన టూల్‌కిట్‌తో ప్రశ్నపత్రాల పెట్టెను తెరిచి ఒకదాన్ని ఫోటో తీసుకుని అనంతరం పెట్టెలో పెట్టి యథావిధిగా సీల్ చేశాడని తెలిపింది. బయటకు వచ్చిన తర్వాత దాన్ని ప్రధాన నిందితుడికి పంపినట్లు వెల్లడించింది. అతడు డబ్బులు చెల్లించిన వ్యక్తులకు ప్రశ్నపత్రాన్ని చేరవేసినట్లు తెలిపింది. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు 49 మందిని అదుపులోకి తీసుకున్నామని, వారిలో 40 మందిపై చార్జిషీటు దాఖలు చేశామని సీబీఐ పేర్కొంది.

నక్సలైట్లతో అంతిమ యుద్ధం

2026 మార్చి నాటికి నక్సలిజం నిర్మూలన.. త్వరలో మావోయిస్ట్ రహిత రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్

» నక్సలైట్ల ఏరివేతలో తెలంగాణ, ఏపీ సంపూర్ణ సహకారం

» సీఎంల సమావేశంలో అమిత్ షా



న్యూఢిల్లీ, అక్టోబర్ 7(ఆంధ్రజ్యోతి): నక్సలైట్లతో యుద్ధం అంతిమ దశలో ఉందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి సమాజంలోని చివరి వ్యక్తికీ చేరాలంటే నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించడం అవసరమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాల సహకారంతో 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించగమని విశ్వాసం వ్యక్తం చేశారు. గత కొద్ది సంవత్సరాల్లో 24 మంది నక్సల్ అగ్రనేతలతో పాటు ఎన్నో దళాలను మట్టుబెట్టామన్నారు. రెండు రోజుల క్రితం 31మంది మావోయిస్టుల ఏరివేతను ఆయన ప్రస్తావిస్తూ త్వరలోనే ఛత్తీస్‌గఢ్ మావోయిస్టు రహిత రాష్ట్రంగా ఆవిర్భవించబోతోందని చెప్పారు. ఈ ఏడాది 230 మంది నక్సలైట్లను మట్టుబెట్టామని, 812 మందిని అరెస్టు చేశామని, 723 మంది లొంగిపోయారని ఆయన చెప్పారు. నక్సలైట్ల ఏరివేతలో ఏపీ, తెలంగాణ, ఒడిషా, మహారాష్ట్ర, ప్రభుత్వాలు సంపూర్ణ సహకారం అందించాయన్నారు. నక్సలైట్లు అభివృద్ధికి అడ్డంకిగా మారారని, మానవ హక్కులను తీవ్రంగా అణచివేస్తున్నారని షా విమర్శించారు. నక్సలైట్ల మూలంగా మందుపాతరలు వేలి వేలాది మంది ఆదివాసీలు మరణించారని తెలిపారు. నక్సలైట్ల ఏరివేత ప్రాంతాల్లో 12 హెలికాప్టర్లు వినియోగిస్తున్నామని, ఈ కారణంగా పోలీస్ బలగాల మరణాల సంఖ్య తగ్గిందన్నారు. నక్సలైట్లు ఇప్పటికైనా ఆయుధాలను అప్పగించి లొంగిపోవాలని, జన జీవన స్రవంతిలో చేరాలని షా పిలుపునిచ్చారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో టెలీ కమ్యూనికేషన్లు, ఆరోగ్య సౌకర్యాలు, విద్య, తాగు నీరు వంటి కనీస మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్న ఆయన పదేళ్లలో 544 దుర్భేద్యమైన పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. 14,400 కిలోమీటర్ల రహదారులు నిర్మించామని, 6 వేల మొబైల్ టవర్లు, 165 ఏకలవ్య స్కూళ్లను ఏర్పాటు చేశామని షా చెప్పారు. ఆపరేషన్ కగార్ పేరిట నక్సల్స్ ఏరివేత కార్యక్రమాలు కొనసాగుతున్న తీరును ఈ సమావేశంలో సమీక్షించారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధిని, మావోయిస్టుల నిర్మూలనపై ముఖ్యమంత్రులు నెలకోసారి అయినా సమీక్షించాలని, డీజీపీలు 15 రోజులకోసారి సమీక్షించాలని షా కోరారు. డీజీపీలు పారామిలటరీ దళాల శిబిరాలకు వెళ్లి ఒక రాత్రి అక్కడే బస చేయాలని సూచించారు. ఈ సమావేశానికి మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల సీఎంలు, హోంమంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు, కేంద్ర మంత్రులు, పలు కీలక శాఖల కార్యదర్శులు, వివిధ భద్రతా విభాగాల అధినేతలు, ఇంటలిజెన్స్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ హోంమంత్రి అనిత ఈ సమావేశంలో పాల్గొన్నారు.

హత్యాచారం చేసింది సంజయ్ రాయే!



» కోల్‌కతా వైద్యురాలి కేసులో సీబీఐ చార్జిషీటు

» నిందితుడు ఒక్కడే నేరానికి పాల్పడ్డాడని వెల్లడి


కోల్‌కతా, అక్టోబరు 7 : కోల్‌కతా ఆర్జీ కార్ ఆస్పత్రి, వైద్య కళాశాల ట్రెయినీ డాక్టర్ హత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్(33)పై సీబీఐ కోల్‌కతాలోని ప్రత్యేక కోర్టులో సోమవారం 45 పేజీల చార్జిషీట్ దాఖలు చేసింది. స్థానిక పోలీసుల దగ్గర పౌర వలంటీరుగా పనిచేస్తున్న సంజయ్ రాయ్ ఆగస్టు 9న ఈ నేరానికి పాల్పడ్డాడని పేర్కొంది. ఆస్పత్రి సెమినార్ హాల్‌లో ట్రెయినీ డాక్టర్ తన బ్రేక్ సమయంలో విశ్రాంతి తీసుకుంటుండగా ఈ ఘటన జరిగినట్లు పేర్కొంది. అయితే చార్జిషీటులో గ్యాంగ్‌రేప్ గురించి ప్రస్తావించలేదు. అలాగే విచారణ ముగిసినట్లూ పేర్కొనలేదు. దాదాపు 200 మంది స్టేట్‌మెంట్లను సీబీఐ తన చార్జిషీటులో పేర్కొంది. సుమారు 100 మంది సాక్షులను విచారించింది. ఇవన్నీ రాయ్‌నే ప్రధాన నిందితుడుగా పేర్కొంటున్నాయని సీబీఐ వర్గాల సమాచారం. కేసు విచారణ ఇంకా కొనసాగుతోందని, ఇది గ్యాంగ్ రేపా..., అనుమానితులు ఇంకా ఉన్నారా? అనే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. పోస్టుమార్టమ్ సమయంలో వైద్యురాలి మృతదేహంలో ఎక్కువ పరిమాణంలో వీర్యం లభించడం గ్యాంగ్‌రేప్ అనుమానాలకు దారితీసింది. కాగా కోల్‌కతా పోలీసులు ఆగస్టు 10న సంజయ్ రాయ్‌ని అరెస్టు చేశాక తానే ఈ నేరానికి పాల్పడ్డానని తొలుత అంగీకరించాడు. తర్వాత పాలీగ్రాఫ్ పరీక్ష చేస్తుండగా తాను చేయలేదని అడ్డం తిరిగాడు. అయితే వైద్యురాలి మృతదేహం దగ్గర లభ్యమైన బ్లూటూత్ పరికరం రాయ్‌ని పట్టించింది. అలాగే సెమినార్ హాల్ ఉన్న ఆర్జీ కార్ ఆస్పత్రి మూడో ఫ్లోర్‌లో రాయ్ సంచరించడం సీసీ టీవీ ఫుటేజీలో కనిపించింది. అతడు తెల్లవారుజామున 4 గంటలకు అక్కడికి వచ్చి 40 నిమిషాల తర్వాత తిరిగి వెళ్లాడు. బాధితురాలి గోళ్లలో లభ్యమైన రక్తం, చర్మం రాయ్ డీఎన్‌ఏతో సరిపోలాయి.

భవిష్ అగర్వాల్ ఘాటు వ్యాఖ్యలు.. ఓలా షేర్లు ధమాల్!

(మొదటి పేజీ తరువాయి)

వినియోగదారులకు కోపం వచ్చింది. తాము ఎదుర్కొంటున్న సర్వీసింగ్ సమస్యల గురించి వారంతా ట్వీట్ చేయడం మొదలుపెట్టడంతో.. ఓలా షేర్ విలువ సోమవారం 8% మేర పతనమైపోయింది!! 'ఎక్స్' వేదికగా వారిద్దరి మధ్య జరిగిన వాగ్యుద్ధం ఆదివారం మొదలైంది. తొలుత కునాల్ కమ్రా.. మహారాష్ట్రలోని సోలాపూర్‌లో ఓలా సర్వీసింగ్ సెంటర్ బయట పెద్ద సంఖ్యలో, దుమ్ముకొట్టుకుపోయి ఉన్న ఓలా ఈవీల ఫొటో పెట్టి ఒక ట్వీట్ చేశారు. పరిస్థితి ఇలా ఉంటే భారతీయులు ఈవీలకు ఎలా అలవాటు పడతారంటూ.. ఈవీలను ప్రోత్సహిస్తున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ట్యాగ్ చేశారు. ఓలా ఈవీలకు సరైన సర్వీసింగ్ లేక ఇబ్బందిపడుతున్న చాలా మంది వినియోగదారులు కునాల్ వ్యాఖ్యలను సమర్థిస్తూ ట్వీట్ చేశారు. అయితే, ఓలా సీఈవో భవిష్ అగర్వాల్ మాత్రం కునాల్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో కునాల్‌కు అంత ఆందోళన ఉంటే.. వచ్చి తమకు సాయం చేయాలని.. ఈ పెయిడ్ ట్వీట్ చేసినందుకు కునాల్‌కు వచ్చినదాని కంటే ఎక్కువే చెల్లిస్తానని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. దీనికి కునాల్.. తాను పెయిడ్ ట్వీట్ చేశాననడానికి ఆధారాలుంటే చూపాలని సవాల్ చేశారు. దీనికి ప్రతిగా.. "బాధగా ఉందా? నొప్పి పుడుతోందా? సర్వీస్ సెంటర్‌కు రా. చాలా పని ఉంది. నీ ఫ్లాప్ ప్రదర్శనల ద్వారా వచ్చే డబ్బు కంటే ఎక్కువ డబ్బు నేను చెల్లిస్తా" అంటూ భవిష్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనికి కమ్రా.. "గడిచిన నాలుగు నెలల్లో మీ ఓలా ఈవీ కొన్నవారిలో ఎవరైనా తమ బైక్‌ను తిరిగిచ్చేస్తామంటే..వారికి రిఫండ్ ఇవ్వండి" అని ట్వీట్ చేశారు. కాగా.. ఈ ట్వీట్ల యుద్ధానికి ముందే..వరుసగా రెండు రోజులుగా పడిపోతూ వస్తున్న ఓలా షేర్ల విలువ సోమవారం మరింత పతనమై 8% మేర పడిపోయింది.

లోకం తీరు



బోయింగ్ 737 రడ్డర్లలో సమస్య

» అన్ని మోడళ్లలోనూ ఇబ్బంది: డీజీసీఏ

» ప్రధాని వాడే విమానం కూడా 737

న్యూఢిల్లీ, అక్టోబరు 7: భారత్‌లోని కొన్ని వైమానిక సంస్థలు వినియోగిస్తున్న బోయింగ్ 737 మోడల్ విమానాల రడ్డర్లలో సమస్య ఉందని డీజీసీఏ హెచ్చరించింది. రడ్డర్ అంటే.. విమానం వెనుక భాగంలో ఉండే ఓ నియంత్రణ వ్యవస్థ. టేకాఫ్ అయ్యేటప్పుడు దీనిని కిందకు దించుతారు. ల్యాండ్ అయ్యే సమయంలో పైకి లేపుతారు. అలాగే విమానం తోక భాగంలోనూ ఉండే రడ్డర్.. కుడి, ఎడమ వైపునకు మళ్లేందుకు ఉపయోగపడుతుంది. విమానం స్థిరంగా ఉంచేందుకు ఈ వ్యవస్థ పనిచేస్తుంది. కాగా, బోయింగ్ 737 అన్ని మోడల్స్‌లోనూ రడ్డర్ జామింగ్ ఉందని డీజీసీఏ పేర్కొంది. భద్రతా ప్రమాణాల పరీక్షలు చేయించాలని వైమానిక సంస్థలకు సూచించింది. భారత్‌లో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్ జెట్, ఆకాశ్ ఎయిర్‌లు బోయింగ్ 737 సిరీస్ విమానాలను వాడుతున్నాయి. అంతేకాక.. ప్రధాని వినియోగించేది కూడా ఇదే సిరీస్‌లోనిదే. వాయుసేన, ప్రముఖుల స్క్వాడ్రన్‌లోనూ ఈ విమానాలున్నాయి.

చైనా గూఢచారి బెలూన్లను కూల్చే సత్తా భారత్‌కు..!

న్యూఢిల్లీ, అక్టోబరు 7: ఇతర దేశాలపై నిఘా వేయడానికి చైనా వినియోగిస్తున్న గూఢచారి బెలూన్లను కూల్చడంపై భారత వాయుసేన శిక్షణ పొందినట్లు సమాచారం. తాజాగా తూర్పు ఎయిర్ కమాండ్‌లో 55వేల అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఎగురుతున్న చైనా తరహా గూఢచారి బెలూన్‌ను రఫెల్ జెట్‌ను ఉపయోగించి భారత వాయుసేన కూల్చిందని ఓ ఆంగ్ల పత్రిక పేర్కొంది. దీంతో గగనతలంలో నిదానంగా కదిలే భారీ టార్గెట్లను కూడా కూల్చేసే సత్తా భారత్‌కు ఉన్నట్లు తేలింది. 2023లో చైనా బెలూన్ అమెరికా దక్షిణ కరోలినా గగనతలంలో కనిపించగా ఎఫ్-22 యుద్ధ విమానంతో కూల్చేశారు.

హరియాణా, జమ్మూ కశ్మీర్ ఫలితాలు నేడు



న్యూఢిల్లీ, అక్టోబరు 7: జమ్మూ కశ్మీర్, హరియాణా అసెంబ్లీ ఎన్నిల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. హరియాణాలో కాంగ్రెస్ ఘన విజయం సాధించనుందని.. జమ్మూ కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమికి అత్యధిక స్థానాలు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ఇవే నిజమైతే బీజేపీకి ఈ ఫలితాలు అతిపెద్ద షాక్ కానున్నాయి. ఈ క్రమంలో మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. హరియాణాలో 90 అసెంబ్లీ సీట్లు ఉండగా ఈనెల 5న జరిగిన పోలింగ్‌లో 65.65శాతం ఓటింగ్ నమోదైంది. జమ్మూ కశ్మీర్‌లో 90 అసెంబ్లీ స్థానాలకు సెప్టెంబరు 18, 25, అక్టోబరు 1.. ఇలా మూడు దశల్లో పోలింగ్ జరిగింది. కౌటింగ్ నేపథ్యంలో ప్రత్యేకించి జమ్మూ కశ్మీర్‌లో పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా జమ్మూ కశ్మీర్‌లో అత్యధిక స్థానాలు నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమిదేనని.. హంగ్ ఖాయమని అంచనాలు వ్యక్తమవుతున్న తరుణంలో ఆ 'ఐదుగురు నామినేటెడ్ ఎమ్మెల్యేల'లు కీలకం కానున్నారు. జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్.. ఐదుగురు ఎమ్మెల్యేలను అసెంబ్లీకి నామినేట్ చేయనున్నారు. ఫలితంగా సభ్యుల సంఖ్య 95కు చేరనుంది.

పీడీపీతో పొత్తుకు సిద్ధమే

శ్రీనగర్, అక్టోబరు 7: జమ్మూకశ్మీర్‌లో హంగ్ తప్పదన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాల నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) సీనియర్ నేత ఫరూక్ అబ్దుల్లా కీలక ప్రకటన చేశారు. మెహబూబా ముఫ్తీ నేతృత్వంలోని పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ(పీడీపీ)తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి తాము సిద్ధమేనన్నారు. దీనికి కాంగ్రెస్ కూడా అభ్యంతరం చెప్పబోదని తాను భావిస్తున్నట్లు చెప్పారు. బీజేపీని అధికారంలోకి రానివ్వబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఏర్పాటులో ఇండిపెండెంట్లు కలిసి వచ్చినా స్వాగతిస్తామని, కానీ వారిని బ్రతిమిలాడబోనని చెప్పారు.

మాల్దీవుల పర్యటనకు రండి!

భారతీయులకు ముయిజ్జు విజ్ఞప్తి.. మాల్దీవుల్లో రూపే కార్డు సేవలు ప్రారంభం



న్యూఢిల్లీ, అక్టోబరు 7: తమ దేశంలో పర్యటనకు రావాలని మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు భారతీయులకు విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీపై మాల్దీవుల మంత్రుల వివాదాస్పద వ్యాఖ్యలు, భారత్‌తో విభేదాలతో తమ పర్యాటక ఆదాయం పడిపోయిన నేపథ్యంలో ఆయన ఈ పిలుపునిచ్చారు. ఐదు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం భారత్‌కు వచ్చేసిన ముయిజ్జు, సాజిదా దంపతులు సోమవారం రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. అంతకుముందు వారికి రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ ఘనస్వాగతం పలికారు. తర్వాత ప్రధాని మోదీతో ముయిజ్జు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరు దేశాలూ పలు ఒప్పందాలు చేసుకున్నాయి. అనంతరం మోదీతో సంయుక్త విలేకరుల సమావేశంలో ముయిజ్జు మాట్లాడుతూ ప్రస్తుతం తాము ఎదుర్కొంటున్న విదేశీ మారక సమస్యలను అధిగమించేందుకు భారత్ అందిస్తున్న సహాయసహకారాలు చాలా కీలకంగా మారనున్నాయంటూ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఆపన్న హస్తం అందించడంలో భారత్ ఎల్లప్పుడూ ముందుంటుందని మోదీ స్పష్టం చేశారు. విదేశాంగ విధానంలో పొరుగువారికే తొలి ప్రాధాన్యం ఇస్తామని నొక్కి చెప్పారు. మాల్దీవులను 'సన్నిహిత మిత్రుడి'గా అభివర్ణించారు. ఆ దేశానికి ఎదురైన అత్యవసర పరిస్థితుల్లోనూ, కొవిడ్ వ్యాక్సిన్ సరఫరా విషయంలోనే ముందుగా స్పందించినది భారతదేశమేనని గుర్తుచేశారు. భారత సాయంతో మాల్దీవుల్లో చేపట్టిన హనిమదూ అంతర్జాతీయ విమానాశ్రయ ఆధునికీకరణ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన నూతన రన్‌వేను ఇరువురు నేతలు ఈ సందర్భంగా వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతోపాటు మాల్దీవుల్లో రూపేకార్డు ద్వారా చెల్లింపులు జరిపే ప్రక్రియనూ ప్రారంభించారు. తద్వారా భారత పర్యాటకులు మాల్దీవులలో నగదు రహిత చెల్లింపులు చేయడం సులభం కానుంది. విదేశీ మారక నిల్వల సమస్యను మాల్దీవులు అధిగమించేలా రూ.3,359 కోట్లు(400 మిలియన్ డాలర్లు), మరో రూ.3 వేల కోట్ల కరెన్సీ స్వాప్ ఒప్పందాన్ని కూడా ఈ సందర్భంగా ప్రకటించారు.

బహుజన హక్కులు కాపాడతాం

» ప్రతి ఒక్కరూ సోదర భావంతో ఉన్నప్పుడే అందరికీ సమాన హక్కులు : రాహుల్

» దళిత కుటుంబంతో కలిసి వంట చేసిన వీడియోను పంచుకున్న నేత



దళితుల ఇంట్లో వంట చేస్తున్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, అక్టోబరు 7: భారత రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ పరిరక్షిస్తుందని, రాజ్యాంగం ద్వారా బహుజనులకు లభించిన హక్కులను కాపాడుతుందని ఆ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ ఉద్ఘాటించారు. అయితే, సమాజంలోని ప్రతి ఒక్కరూ సోదరభావ స్ఫూర్తితో మెలిగినప్పుడే రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వం, హక్కులు ప్రతి ఒక్కరికీ లభిస్తాయని తెలిపారు. రాహుల్‌గాంధీ ఇటీవల దళిత కుటుంబంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారితో కలిసి వంట చేశారు. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని సోమవారం సోషల్ మీడియాలో ఆయన వీడియోను పంచుకున్నారు. "దళితుల వంటిల్లు ఎలా ఉంటుందనేది ఇప్పటికీ చాలా తక్కువ మందికే తెలుసు. దళితులు ఏం తింటారో ఎవరికీ తెలియదు. అసలు వారేం తింటారో? ఏం వండుకుంటారో? సామాజిక, రాజకీయ కోణంలో చూసినప్పుడు చాలా ఆసక్తిగా ఉంది. ఒక రోజు మధ్యాహ్నం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఉన్న అజయ్ తుకారాం సనాదే, అంజనా తుకారాం సనాదేలతో గడిపాను. ఆ సమయంలో వారుచేస్తున్న వంటలో సాయం చేశాను. అందరం కలిసి శనగలతో కూర చేశాం. వంకాయ, ఆకుకూరలతో పప్పు చేశాం" అని రాహుల్ తన వీడియోలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆ కుటుంబంతో అనేక విషయాలు పంచుకున్నానని తెలిపారు. అంజనా తుకారం కుటుంబం చెప్పిన దానిని బట్టి వారు ఇప్పటికీ కుల, సామాజిక వివక్షకు గురవుతూనే ఉన్నారని తెలిసిందన్నారు. కాగా, ఈ వీడియోలో దళిత కుటుంబంతో కలిసి రాహుల్ గాంధీ వంట చేయడంతోపాటు, వారితో కలిసి భోజనం చేస్తున్న దృశ్యాలు ఉన్నాయి.

అధికారిక భవనం ఖాళీ చేస్తూ ఫర్నీచర్ ఎత్తుకెళ్లారు

» తేజస్వీయాదవ్‌పై బీజేపీ ఆరోపణ

పాట్నా, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ జనతాదళ్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ తన అధికార భవనాన్ని ఖాళీ చేస్తూ అందులోని విలువైన ఫర్నీచర్ అంతా ఎత్తుకుపోయారని బీజేపీ ఆరోపించింది. సోఫాలు, ఏసీలు, హైడ్రాలిక్ పరుపులు, వాష్ బేసిన్లు, నల్లాలు, లైట్లు, బ్యాడ్మింటన్ కోర్ట్ మ్యాట్, కంప్యూటర్, ఫ్రిడ్జ్ తదితర వస్తువులన్నీ దొంగతనం అయ్యాయని బీజేపీ మీడియా ఇంచార్జ్ డానిష్ ఇక్బాల్ ఆరోపించారు. విజయదశమిలోగా ఇదే భవనంలోకి రావాలని ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరి నిర్ణయించుకోవడంతో తేజస్వీ యాదవ్ తన అధికార భవనాన్ని ఖాళీ చేసిన సందర్భంగా విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఆరోపణలపై ఆర్జేడీ తీవ్రంగా స్పందించింది. కనిపించకుండా పోయిన సామాగ్రి జాబితాను భవన నిర్మాణ విభాగం ద్వారా విడుదల చేయాలని సూచించింది. లేనిపక్షంలో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది.

సన్నగిల్లుతున్న శ్రమ'శక్తి'

తీర నగరాల్లో ఉత్పాదకత తిరోగమనం.. ఆరుబయట పనిచేసే కార్మికులపై వాతావరణ మార్పుల ప్రభావం

» 2050నాటికి 40% తగ్గనున్న సామర్థ్యం

» తీర నగరాల్లో వేడి వాతావరణ ప్రభావంపై జాతీయ స్థాయి నిపుణుల అధ్యయనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



వాతావరణ మార్పులు.. ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న కీలక విషయం. ఈ ప్రభావం దేశంలోని తీర ప్రాంత నగరాలపై ఎక్కువగా ఉందని తాజాగా జరిగిన జాతీయ స్థాయి అధ్యయనం ఒకటి వెల్లడించింది. వాతావరణ మార్పుల ప్రభావంతో శ్రామిక శక్తి సన్నగిల్లుతోందని పేర్కొంది. తీర ప్రాంతాల్లోని నగరాల్లో ఆరు బయట పనిచేసే శ్రామికుల శక్తిపై వాతావరణ మార్పుల ప్రభావం ఎక్కువగా ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో కూలీలు, కార్మికుల పనివేళల్లో మార్పులు చేయాలని అధ్యయనం సూచించింది. 'తీర నగరాల్లో పెరిగిన వేడి, ఉక్కపోత-శ్రామిక శక్తిపై ప్రభావం' అన్న అంశంపై ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం పర్యావరణ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టీవీ లక్ష్మీకుమార్, జాతీయ వాతావరణ కేంద్రం శాస్త్రవేత్త కె.కోటేశ్వరరావు తదితరులు ఈ అధ్యయనం చేశారు. ఈ పరిశోధన వ్యాసం అంతర్జాతీయ వాతావరణ జర్నల్‌లో ప్రచురితమైంది. దేశంలోని తీర నగరాలపై వాతావరణ మార్పులతో అన్ని వర్గాలు, ప్రధానంగా ఆరుబయట పనులు చేసే శ్రామికులు తీవ్ర ప్రభావానికి గురవుతున్నారని లక్ష్మీకుమార్ విశ్లేషించారు. వాతావరణ మార్పులకు ప్రకృతిలో వచ్చిన మార్పులతోపాటు మానవ జోక్యం ఎక్కువగా ఉందని నిపుణులు పేర్కొన్నారు. "ప్రకృతిలో వచ్చిన మార్పులతో గత వందేళ్లలో ఉష్ణోగ్రత ప్రపంచ సగటుకంటే 0.04 డిగ్రీలు పెరగాలి. కానీ మానవ జోక్యం అంటే పారిశ్రామిక విప్లవం, నిర్మాణాలు, కాలుష్యం ప్రభావంతో 1.1డిగ్రీలు పెరిగింది. వాహనాలు, నిర్మాణాలు, పరిశ్రమల కాలుష్యం తగ్గకుంటే 2050కల్లా సగటు ఉష్ణోగ్రతకంటే 3డిగ్రీలు, 2100కల్లా 5డిగ్రీలు పెరుగుతుంది" అని అధ్యయనం అంచనా వేసింది.

సముద్రాలు వేడెక్కడంతో...

వాతావరణ మార్పుల కారణంగా అరేబియా సముద్రం, బంగాళాఖాతం వేడెక్కుతున్నాయి. ఆ ప్రభావం తీర నగరాలపై పడుతోంది. తూర్పుతీరంలో భువనేశ్వర్, విశాఖపట్నం, నెల్లూరు, చెన్నై, పుదుచ్చేరిలో అధిక ఉష్ణోగ్రతలు, పశ్చిమ తీరంలో కొచ్చిన్, మంగళూరు, ముంబైలో గాలి తేమశాతం పెరగడంతో ఉక్కపోత అధికమైంది. దీంతో ఆయా నగరాల్లో ఆరుబయట పనిచేసే కార్మికులు, కూలీల పనిశక్తిపై తీవ్ర ప్రభావం పడింది. చల్లని వాతావరణంలో చేసే పనికంటే నిప్పుల కొలిమిలా ఉండే వాతావరణంలో చేసే పనితో ఉత్పాదకత తగ్గుతూ వస్తోంది. ఆ వాతావరణంలో కార్మికులు, కూలీలతో పని చేయిస్తే వారి ఆరోగ్యాలు క్షీణిస్తాయని నిపుణులు పేర్కొన్నారు. దీనివల్ల సామాజిక, ఆర్థిక వ్యవస్థలపై ఒత్తిడి పెరుగుతాయన్నారు.

2050 నాటికి పరిస్థితి ఇదీ..

తీర నగరాల్లో అధ్యయనం కోసం 'స్టడ్‌మన్ హీట్ స్ట్రెస్ ఇండెక్స్' ఫార్ములాను నిపుణులు వినియోగించారు. దీనికి గాను 1981 నుంచి 2020 వరకు తూర్పుతీరంలో భువనేశ్వర్ నుంచి చెన్నై, పశ్చిమ తీరంలో కొచ్చిన్ నుంచి సూరత్ వరకు ఉష్ణోగ్రత, గాలిలో తేమ వివరాలను విశ్లేషించారు. భవిష్యత్తులో వేడి పెరిగితే 2050కల్లా కార్మికుల నుంచి ఉత్పాదకత విలువ 35-39 శాతం వరకు క్షీణిస్తుందని అధ్యయనం పేర్కొంది. తిరువనంతపురం, కొచ్చిన్, మంగళూరుల్లో ఈ క్షీణత 40శాతం వరకు ఉంటుందని నిపుణులు అంచనా.

విశ్రాంతి-విరామం

తీర ప్రాంత నగరాల్లో ఆరుబయట పనిచేసే సమయంలో కార్మికులకు ప్రతి గంటకు కనీసం 20నిమిషాల వరకు విశ్రాంతి ఇవ్వాల్సి ఉంటుందని నిపుణులు సూచించారు. భువనేశ్వర్, విశాఖపట్నం, నెల్లూరు, చెన్నై, పుదుచ్చేరి, కొచ్చిన్, తిరువనంతపురం, మంగళూరుల్లో కార్మికులు చేసే మధ్యస్థ పనులకు ప్రతి గంటకు 25%, భారీ పనులకు 50%, అత్యంత భారీ, కష్టమైన పనులకు 75% విశ్రాంతి ఇవ్వాల్సి ఉంటుందని.. లేకుంటే వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. జీర్ణక్రియ దెబ్బతినడం, చర్మ వ్యాధులు, శరీరం పొడిబారడం వంటి రుగ్మతలకు గురవుతారని నిపుణులు తెలిపారు.

ఏసీబీకి చిక్కిన మేడ్చల్ ఏఎస్ఐ

- బెయిల్ కోసం రూ.2 లక్షల డిమాండ్
- రూ.50 వేలు తీసుకుంటూ చిక్కిన వైనం


మధుసూదన్ రావు

మేడ్చల్ టౌన్, హైదరాబాద్ సిటీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ. 50 వేలు లంచం తీసుకుంటూ మేడ్చల్ ఏఎస్ఐ మధుసూదన్ రావు ఏసీబీ అధికారులకు చిక్కారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా గుండ్ల పోచంపల్లి మునిసిపాలిటీ పరిధిలో శర్మ అనే వ్యక్తి తను కొత్తగా నిర్మించుకుంటున్న ఇంటి ఇంటీరియర్ పనులకు సరూర్‌నగర్‌కు చెందిన విశ్వనాథ్ అనే కాంట్రాక్టర్‌తో రూ.8 లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. విశ్వనాథ్ మొదట రూ.4 లక్షలు తీసుకొని ఆమేరకు పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులకు డబ్బులు ఇవ్వాలని శర్మను కోరగా ఇరువురి మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తి ఇంటి పనులు ఆగిపోయాయి. దాంతో శర్మ రెండు నెలల క్రితం మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో విశ్వనాథ్‌పై ఫిర్యాదు చేశారు. విశ్వనాథ్‌ను నాలుగు రోజుల క్రితం ఏఎస్ఐ మధుసూదన్ రావు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదయింది కాబట్టి స్టేషన్ బెయిల్ కావాలంటే రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో విశ్వనాథ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు సోమవారం రూ.50 వేలు ఇస్తానని, మిగిలిన డబ్బు బెయిల్ ఇచ్చాక ఇస్తానని ఏఎస్ఐకు విశ్వనాథ్ చెప్పారు. ఒప్పుకున్న ఏఎస్ఐ సోమవారం సాయంత్రం పోలీసు స్టేషన్‌లో రూ.50 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

తిరుమల మాడవీధుల్లో మాధురి హల్‌చల్

తిరుమల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌తో పాటు శ్రీవారి దర్శనానికి వచ్చిన యూట్యూబర్ మాధురి తిరుమల ఆలయ మాడవీధుల్లో హల్‌చల్ చేశారు. ఇద్దరు అసిస్టెంట్లను పెట్టుకుని మరీ వీడియోలు తీయించుకుంటూ సందడి చేశారు. ఇప్పటికే ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్‌తోపాటు ఇటీవల ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తో సన్నిహితంగా ఉంటున్న విషయంలో మాధురి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ క్రమంలో ఆమె సోమవారం దువ్వాడతో కలిసి శ్రీవారి దర్శనానికి వచ్చారు. దర్శనానంతరం దువ్వాడ మహద్వారం నుంచి వెలుపలికి రాగా, మాధురి మాత్రం బయోమెట్రిక్ పక్కనే ఉన్న మార్గం నుంచి వెలుపలకు వచ్చారు.


ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు తన కుమార్తె వివాహ పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

త్వరలో టీడీపీలోకి తీగల

చంద్రబాబుతో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి భేటీ

- రాష్ట్రంలో పార్టీకి పూర్వవైభవం తెస్తానని వ్యాఖ్య
- బాబును కలిసిన ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి)/మేడ్చల్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి), అక్టోబరు 7: తాను త్వరలో టీడీపీలో చేరబోతున్నానని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ప్రకటించారు. టీడీపీకి పూర్వ వైభవం కోసమే చంద్రబాబుతో భేటీ అయ్యానని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో చంద్రబాబును కలిశారు. జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసంలో సుమారు అరగంట పాటు భేటీ అయ్యారు. అనంతరం మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డితో కలిసి కృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు హయాంలోనే హైదరాబాద్, సికింద్రాబాద్, హుస్సేన్‌సాగర్ అభివృద్ధి చెందాయని అన్నారు. సైబరాబాద్‌ను ఏర్పాటు చేసిన ఘనత ఆయనదేనని స్పష్టం చేశారు. ఎన్టీఆర్, చంద్రబాబులతోనే తన రాజకీయ ప్రస్థానం ఆరంభమైందని తెలిపారు. తెలంగాణలో కూడా ఎన్టీఆర్ పాలన రావాలని ఆకాంక్షిస్తున్నానని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ అభిమానులు ఉన్నారని పేర్కొంటూ, వారందరినీ ఏకతాటిపైకి తీసుకువస్తామన్నారు. మరోసారి తమను పిలిచి మాట్లాడతానని చంద్రబాబు చెప్పారని ఆయన వివరించారు.

ఆసక్తికరంగా మల్లారెడ్డి భేటీ..

బీఆర్ఎస్ నుంచి మేడ్చల్ ఎమ్మెల్యేగా గెలిచిన మల్లారెడ్డి టీడీపీలో చేరబోతున్నారా? అన్నది రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. సోమవారం మల్లారెడ్డితో పాటు ఆయన అల్లుడు, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చంద్రబాబుతో భేటీ అయ్యారు.తీగల కృష్ణారెడ్డి, మల్లారెడ్డి బంధువులు. తాను టీడీపీలో చేరబోతున్నానని తీగల ప్రకటించిన నేపథ్యంలో మల్లారెడ్డి కూడా ఆయన బాటలోనే వెళతారన్న చర్చ రాజకీయవర్గాల్లో ఉంది. అయితే, టీడీపీలో తన చేరికపై మల్లారెడ్డి, సమాధానాన్ని దాటవేశారు. తన మనవరాలు (మర్రి రాజశేఖర్‌రెడ్డి కుమార్తె) పెళ్లి ఆహ్వాన పత్రికను అందజేసేందుకే వచ్చానని చెప్పారు. కాగా, ఈ నెల 27న తన మనవరాలి వివాహం ఉందని.. అప్పటి వరకు కోర్టు పరిధిలో ఉన్న బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల విషయంలోనూ ఏదో ఒకటి తేలుతుందని.. ఆ తర్వాత తాను కూడా టీడీపీలో చేరతానని మల్లారెడ్డి సన్నిహితులతో అన్నట్లు విశ్వసనీయ సమాచారం.

డీఏలు, సప్లిమెంటరీ బిల్లులు విడుదల చేయండి

- డిప్యూటీ సీఎం భట్టికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, యూటీఎఫ్ నేతల విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం బకాయిపడిన 4 కరువు భత్యాల(డీఏ)ను, సప్లిమెంటరీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవిలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం భట్టికి వారు వినతిపత్రం ఇచ్చారు. గత ప్రభుత్వం 3 డీఏలు బకాయిపడిందని, ప్రస్తుతం మరో డీఏ వాటికి జత కలిసిందని వివరించారు. డీఏలతో పాటు జీపీఎఫ్, బీమా, సరెండర్ లీవ్స్, గత పీఆర్సీ బకాయిల సప్లిమెంటరీ బిల్లులు పెద్ద మొత్తంలో పేరుకుపోయాయని వారు తెలిపారు. మార్చి తర్వాత పదవీ విరమణ పొందిన పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పదవీవిరమణానంతర ప్రయోజనాలు కూడా రావడం లేదని వివరించారు. 010 హెడ్ ద్వారా వేతనాలు పొందుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రతినెలా మొదటి తారీఖున వేతనాలు చెల్లిస్తున్నారని, కానీ గురుకులాలు, మోడల్ స్కూళ్లు, ఎయిడెడ్ స్కూళ్లు, కేజీబీవీలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఒకటో తేదీన ఇవ్వడం లేదని తెలిపారు.

ఏమరుపాటుతో కుటుంబమే ఛిద్రమై..

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్.. నలుగురి దుర్మరణం
- సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో ఘటన

న్యాల్‌కల్, అక్టోబరు 7: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల పరిధిలోని హుసెల్లి చౌరస్తా వద్ద సోమవారం సాయంత్రం వద్ద ఘోర ప్రమాదం సంభవించింది. చౌరస్తాను దాటే క్రమంలో రోడ్డుకు ఇరువైపులా ఏమైనా వాహనాలొస్తున్నాయా? అనేది చూసుకోకపోవడం ఓ కుటుంబాన్నే ఛిద్రం చేసింది. రోడ్డు దాటుతున్న క్రమంలో నలుగురు ప్రయాణిస్తున్న బైక్, ప్రధాన రోడ్డు మీద దూసుకెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ మీద ప్రయాణిస్తున్న నలుగురూ ఎగిరి దూరంగా పడ్డారు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారు. న్యాల్‌కల్ మండల పరిధి గణేశ్‌పూర్‌కు చెందిన బిరాదార్ జగన్నాథ్(40), ఆయన భార్య రేణుక (30), వీరి కుమారుడు వినయ్‌కుమార్(14), జగన్నాథ్ మామయ్య గూనెల్లి సిద్ధిరామప్ప (70)సోమవారం ఉదయం సాగు పనులకోసం హుసెల్లి వైపు ఉన్న తమ పొలానికి వెళ్లారు. సాయంత్రం పనులను ముగించుకుని అక్కడి నుంచి నలుగురూ ఒకే బైక్ మీద గణేశ్‌పూర్‌కు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న బైక్ హుసెల్లి చౌరస్తా వద్ద రోడ్డును దాటుతుండగా హైదరాబాద్ నుంచి ఔరాద్‌కు వెళుతున్న కర్ణాటక డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న నలుగురు ఎగిరి రోడ్డు మీద పడి అక్కడికక్కడే ప్రాణాలొదిలారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. జగన్నాథ్, రేణుక దంపతులకు నలుగురు సంతానం. బాబు వినయ్, ముగ్గురు ఆడపిల్లలున్నారు. తల్లిదండ్రులు జగన్నాథ్, రేణుక, సోదరుడు వినయ్ మృతితో ముగ్గురు బాలికలు అనాథలయ్యారు.

బీఆర్ఎస్‌కు 1,500 కోట్లు ఎలా వచ్చాయి?

- ప్రజలకు చెప్పాలి : మంత్రి కొండా సురేఖ
- ఇంకా నాలుగేళ్ల పాలన ఉంది.. కేటీఆర్ గద్దెనెలా ఎక్కుతావంటూ ప్రశ్న

అచ్చంపేట, అక్టోబరు 7: బీఆర్ఎస్ పార్టీకి రూ.1,500 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు చెప్పాలని మంత్రి కొండా సురేఖ డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు గత పాలకులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రతి కార్యకర్త ఎన్నికల ముందు పని చేస్తున్నట్టుగా ఇప్పుడూ పనిచేయాలని కోరారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ ప్రజల మధ్యకు రాలేదని, ఇప్పుడూ ప్రజల మధ్యకు రావడం లేదన్నారు. తాను మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్నానని, ఆయన నియోజకవర్గం గజ్వేల్‌లో కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేయాలంటే ఆయన సంతకం కావాలని, ఆయన సంతకం చేయడం లేదన్నారు. ఇలాంటప్పుడు ప్రజలకు సంక్షేమ పథకాలు ఎలా అందుతాయన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధి రంగాపూర్ గ్రామ సమీపంలోని ఉమామహేశ్వర క్షేత్ర పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి, క్రీడాప్రాధికార సంస్థ ఛైర్మన్ శివసేనా రెడ్డిలతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్‌లా నియంత పాలన తాము చేయడం లేదని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలోని పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, అన్ని పథకాలను ఒకేసారి అమలు చేయడం ఆ దేవుడి వల్ల కూడా కాదని మంత్రి పేర్కొన్నారు. ఇంకా నాలుగేళ్లపాలన ఉందని, కేటీఆర్ నువ్వు గద్దెనెలా ఎక్కుతావో ఆలోచించు అని ఆమె ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి రోజుకు 18గంటలు ప్రజల కోసం పని చేస్తున్నారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి, విద్య, వైద్యం, ఆరు గ్యారెంటీల అమలు కోసం కృషి చేస్తున్నారన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని, రైతులకు లక్ష రుణమాఫీ చేయలేదని.. ఏడాది కూడా నిండని కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలపై రోడ్డెక్కుతున్నారని మంత్రి మండిపడ్డారు.

మేడిగడ్డ ముంపుపై రీసర్వే చేయాలి

- మహారాష్ట్రలో రైతుల రిలే దీక్షలు
- నష్ట పరిహారంపై స్పష్టతనివ్వాలని డిమాండ్

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 7: మేడిగడ్డ బ్యారేజీతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములను రీసర్వే చేసి పరిహారం అందించాలని ఆ రాష్ట్ర రైతులు డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా సిరొంచాలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం రిలే దీక్షలు ప్రారంభించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముంపునకు గురయ్యే భూములను తక్కువగా చూపిస్తూ పరిహారం చెల్లించాలని యత్నించిందని విమర్శించారు. భూములను రీసర్వే చేయాలని సంవత్సరం క్రితం తాము రిలే దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. అప్పుడున్న తెలంగాణ ప్రభుత్వం తమ నిరసనను పట్టించుకోకపోవడంతో మహారాష్ట్ర ప్రభుత్వమే 138 హెక్టార్లకు పరిహారం చెల్లించిందని, ముంపునకు గురయ్యే మరో 400 ఎకరాల భూములను రీసర్వే చేయించేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఒప్పిస్తామని హామీ ఇచ్చిందని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా బ్యారేజీ వల్ల ముంపునకు గురయ్యే భూములను రీసర్వే చేయించి పరిహారం ఇప్పించాలని కోరారు. ముంపు సర్వేతో పాటు నష్టపరిహారంపై స్పష్టతనిచ్చే వరకు దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విస్తరిస్తున్న యుద్ధం!

ఇజ్రాయెల్ మీద హమాస్ అమానుషకృత్యానికి అక్టోబర్ 7న ఏడాది పూర్తయిన సందర్భంలో, అటు ఇజ్రాయెల్, ఇటు హమాస్ పరస్పరం దాడులు చేసుకున్నాయి. పన్నెండువందలమంది ఇజ్రాయెలీలను హమాస్ ఊచకోతకోసిన దారుణాన్ని సంస్మరించుకుంటూ, వారికి నివాళులర్పిస్తూ ఇజ్రాయెల్ అంతటా కార్యక్రమాలు జరిగాయి. హమాస్ ఘాతుకానికి ప్రతీకారంగా మరో ఇరవైరోజుల్లో ఇజ్రాయెల్ ఆరంభించిన గాజా యుద్ధంలో అధికారికంగానే యాభైవేలమంది మరణించి, లక్షలాదిమంది నిరాశ్రయులైన అంశాన్ని ప్రపంచం అంతగా స్మరించుకున్నట్టు లేదు. అమెరికా అధ్యక్ష ఉపాధ్యక్షులు ఏకగొంతుతో హమాస్ దుర్మార్గాన్ని చీల్చిచెండాడుతూ, ఇజ్రాయెలీ మృతులకు ఘననివాళులు అర్పిస్తూ, గాజా బాధితులను ఓ మాటగా తలుచుకున్నందుకు సంతోషించాలి. అదేచేత్తో ఇజ్రాయెల్‌కు ఎటువంటి ఆంక్షలూ నియమాలూ నిబంధనలూ లేని ఆర్థిక, ఆయుధ మద్దతును కూడా నెతన్యాహూకు బైడెన్ పునరుద్ఘాటించారు.

గాజా యుద్ధానికి ఏడాది దగ్గరపడుతున్న తరుణంలో, నెతన్యాహూ ఎంతో తెలివిగా యుద్ధక్షేత్రాన్ని మరింత విస్తరించాడు. గాజాను నేలమట్టం చేసి, సామాన్యులను ఆకలితోనూ, అనారోగ్యంతోనూ చంపివేసినా కూడా ఆయన మనసు శాంతించలేదు. మరోపక్క, ఇజ్రాయెల్ పైకి చెబుతున్నంతగా హమాస్ దెబ్బతినలేదన్నది ఆయనకూ, అమెరికాకు తెలుసు. హమాస్ వద్ద బందీలుగా మిగిలిపోయిన తమవారిని విడిపించలేదన్న కోపం ఆ కుటుంబీకులకూ, మిగతా ఇజ్రాయెలీలకు ఎంతో ఉంది. దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు మిన్నంటిన దృశ్యాలు అనేకం చూశాం. ఈ నేపథ్యంలో, కాలు వెనక్కుతీసుకోవడం కంటే యుద్ధాన్ని విస్తరించడం రాజకీయంగా తనకు క్షేమమని నెతన్యాహూ భావించినట్టు ఉంది. హిజ్బొల్లావైపు ఇజ్రాయెల్ అడుగులు పడగానే ఆయన ఇరాన్‌మీదకు గురిపెడుతున్నాడని అందరికీ అర్థమైంది. తన అద్భుతమైన సాంకేతిక సామర్థ్యంతో పేజర్లు, వాకీటాకీల పేల్చివేతవంటి అనైతిక విధానాల్లో హిజ్బొల్లా బలాన్నీ బలగాన్నీ తీవ్రంగా దెబ్బతీసిన తరువాత, ఆ సంస్థ అధినాయకుడు హసన్ నస్రల్లాను అంతం చేయడంలో ఇజ్రాయెల్ విజయం సాధించింది. వైమానికదాడులతో లెబనాన్‌ను నాశనం చేయడమే కాక, లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ యుద్ధట్యాంకర్లు చొరబడుతున్న తరుణంలో, పాతకక్షలన్నీ కట్టకట్టి ఆర్నెల్ల తరువాత మరోమారు ఇరాన్ ఇజ్రాయెల్ మీదకు క్షిపణులను ప్రయోగించింది. హమాస్, హిజ్బొల్లాల తరువాత, ఇరాన్ పాలకుల పనిపట్టడమే తన లక్ష్యమని నెతన్యాహూ అంతర్జాతీయ వేదికల మీద వీరంగం వేస్తుంటే ఇరాన్ సహనంగా ఉండటం అసాధ్యం.

ఇదే ఇజ్రాయెల్ ఆఖరుయుద్ధం, శత్రుశేషం మిగలనివ్వను అంటూ నెతన్యాహూ సరిహద్దులన్నీ అతిక్రమిస్తుంటే, అమెరికా ఆయుధసాయంతో వంతపాడుతోంది, ఇరాన్ మీద ప్రతీకారానికి సైతం ఎగదోస్తోంది. చమురు క్షేత్రాలు తగలబెట్టుకోకానీ, అణుస్థావరాల జోలికిపోవద్దు అని హితవుచెబుతోందట. ఇరాన్ అణుస్థావరాలను నాశనం చేయగల సమర్థత ఇజ్రాయెల్‌కు ఉన్నదా లేదా అన్నది అటుంచితే, వాటిజోలికిపోతే ఏమవుతుందన్న విషయం అమెరికాకు తెలుసు. ఇజ్రాయెల్ సైనికస్థావరాలమీదా, మొసాద్ కార్యాలయంమీదా క్షిపణులు ప్రయోగించిన తరువాత ఇక చాలు అన్న అర్థంలో ఇరాన్ ఓ ప్రకటన చేసింది. కానీ, హిజ్బొల్లా అండదండలు దూరమైన ప్రస్తుతస్థితిలో ఇరాన్‌ను దెబ్బతీయడం లక్ష్యంగా నెతన్యాహూ అడుగులు పడుతున్నాయి.

ఉక్రెయిన్ యుద్ధం ఆరంభమై, కొనసాగుతున్న కొత్తల్లో అమెరికా, దాని మిత్రదేశాలు చేసిన వ్యాఖ్యలు, చెప్పిన హితవులు చాలామందికి గుర్తుకొస్తున్నాయి. దేశాలు, సార్వభౌమత్వం, సరిహద్దులు, చొరబాట్లు వంటి మాటలు అనేకం బైడెన్ నోట విన్నాం. ఒక ఆస్పత్రిమీద రష్యాదాడి జరిగి, కొందరు పిల్లలు చనిపోయినందుకు ఉక్రెయిన్ అధినేత యావత్ ప్రపంచాన్ని తిట్టిపోశాడు. కానీ, కేవలం సామాన్యులు, అధికంగా మహిళలు, మూడోవంతుమంది పిల్లలు నిర్దాక్షిణ్యంగా ఊచకోతకు గురైన గాజాయుద్ధం మాత్రం అమెరికాకు అమానవీయంగా కనిపించలేదు. గాజాను స్వాధీనం చేసుకొని, లెబనాన్‌ను కూడా గాజాలాగా మార్చడానికి ఉత్సాహపడుతున్న ఇజ్రాయెల్‌కు అమెరికా వెన్నంటి నిలిచింది. ఇరాన్‌మీద క్షిపణులు కురిపించడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆత్మరక్షణహక్కు పేరిట ఇజ్రాయెల్ సాగిస్తున్న ఈ ఊచకోత ఇప్పట్లో ఆగేది కాదు. చిచ్చు వేగంగా విస్తరిస్తూ ప్రాంతీయ యుద్ధం పరిధిని దాటిపోయే ప్రమాదం సమీపంలోనే కనిపిస్తోంది.



ఒక్క ఎస్.సి వర్గీకరణ పట్లనే కాదు, మొత్తం సమాజం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిపై లోతైన అవగాహన ఏర్పరచుకోవడంతో పాటు వాటి పరిష్కార దిశగా సమాజానికి తాను చెప్పదలచుకున్న ప్రతి విషయంలోను బాలగోపాల్ కచ్చితత్వాన్ని అవలంబించారు. ఆ వైఖరి కారణంగా వ్యక్తిగతంగా ఎన్నో సమస్యలు, సవాళ్లు ఎదురైనా రాజీలేని దృఢ సంకల్పాన్ని ప్రదర్శించారు. ఆయనలో గానీ, ఆయన రచనల్లో గానీ ఎక్కడా మనం ఊగిసలాట, ద్వంద్వ వైఖరి చూడలేమంటే అది ఆయనలో ఉన్న నిజాయితీ, నిబద్ధతలకు బలమైన సాక్ష్యం.

సామాజిక న్యాయ సాధనకు మేధో వనరు

నేను, మా గ్రామానికి చెందిన కొందరు మాదిగ యువత 1982–83 మధ్యకాలంలో బాలగోపాల్ గారిని మొదటిసారి కలిశాం. మా స్వగ్రామమైన న్యూ శాయంపేట (హంటర్ రోడ్, శాయంపేట)లో దళితులపై అమలవుతున్న వివక్ష, అంటరానితనంపై మేం గట్టిగా పోరాడుతున్న సమయమది. మాల మాదిగలపై ఆధిపత్యం కొనసాగాలని మా గ్రామంలో ఒక వర్గం, వారి ఆధిపత్యం నశించాలని మేము పోరాడుతున్నాం. సహజంగానే మాపై దాడులు పెరిగాయి. మా ఇండ్లపై దౌర్జన్యాలు జరిగాయి. వాటిని మేం తీవ్రంగా ప్రతిఘటించాం. ఆ సమయంలో మొదటిసారి హన్మకొండలోని వేయి స్తంభాల గుడి రోడ్డులో ఉన్న చిన్న గదిలో బాలగోపాల్ గారిని మేము కలిసాం. నిజనిర్ధారణ చేయడానికి ఆయన మా గ్రామానికి వచ్చారు. జరిగిన విషయాల గురించి ప్రతి వ్యక్తితో మాట్లాడారు. పౌరహక్కుల సంఘం నాయకుడిగా మాకు ఎంతో మనోధైర్యాన్ని ఇవ్వడమే కాకుండా మేం చేస్తున్న పోరాటానికి అన్ని విధాలా అండగా నిలబడ్డారు. ఆనాటి నుండి బాలగోపాల్ గారు అంటే నాకు ఎంతో అభిమానం.

ఇక ఎస్.సి రిజర్వేషన్ల వర్గీకరణ విషయానికి వస్తే తప్పును తప్పు, ఒప్పును ఒప్పు అనడంలో మాదిగేతర మేధావులు, రచయితలు ఇచ్చిన మద్దతు, చూపిన చొరవ విస్మరించలేనిది. ఆ పరంపరను కొనసాగించిన వారిలో బాలగోపాల్ గారు ఒకడుగు ముందు ఉంటారు. తాను జీవించిన కాలంలో రాజ్యాంగ పరిధిలో పరిష్కారం చూపగలిగిన ప్రతి అంశంపైనా నిక్కచ్చిగా తన అభిప్రాయాన్ని చెప్పేందుకు ఆయన ఎప్పుడూ వెనుకాడలేదు. న్యాయాన్ని సమర్థిస్తూ రాసేందుకు ఉన్న ఏ ఒక్క అవకాశాన్నీ ఆయన విడిచిపెట్టలేదు. ఎం.ఆర్.పి.ఎస్ ఉద్యమాన్ని మొదటి నుండి గట్టిగా సమర్థించారు. దళితులలో సైతం సామాజిక అంతరాలు, ముఖ్యంగా విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో హెచ్చు స్థాయిలో ఉన్నాయని నిర్మొహమాటంగా చెప్పారు. ఆయనలో నిబిడీకృతమై ఉన్న సామాజిక న్యాయ స్పృహ ఎవరూ ఆమోదించకుండా ఉండలేనిది. అంత విశాలమైన దృక్పథం కలిగిన మేధావి బాలగోపాల్ గారు. సద్భావనతో కూడిన న్యాయం జరగాలని కోరే న్యాయవాది ఆయన. ఆయన రాసిన ఈ వ్యాసాలు చదువుతున్నంత సేపు బాలగోపాల్ గారు ఒక దండోరా ఉద్యమకారుడుగానే కనిపిస్తారు. దండోరా ఉద్యమాన్ని పరిశీలించిన తీరు ఆయనలోని దార్శనికతను ఎత్తి చూపుతుంది.



బాలగోపాల్ గారు తన రచనల ద్వారా ఎస్.సి రిజర్వేషన్ల వర్గీకరణ అంశాన్ని ఎంతో సహేతుకంగా మూల్యాంకనం చేశారు. సత్యదూరం అయిన ఏ మాటనూ ఆయన చెప్పలేదు. తనకు అర్థమైనదీ, తను అర్థం చేయించదల్చుకున్నదీ సామాజిక న్యాయం మాత్రమే. ఆయన చూడదల్చిందీ, సమాజానికి చెప్పదల్చిందీ కూడా సామాజిక న్యాయం గురించే. ఆయన కోరుకున్నది సమసమాజం, సామాజిక అంతరాల నిర్మూలన అనే సత్యం ఆయన ఏ వ్యాసం చదివినా మనకు అర్థం అవుతుంది. ఎస్.సి రిజర్వేషన్ల వర్గీకరణ సమస్య సున్నితమైన అంశం అని సోకాల్డ్ మేధావులు, రచయితలు మిన్నకుండిపోయిన సమయంలో వారు తమ వైఖరి మార్చుకోవాలని, కుల నిర్మూలనకు రిజర్వేషన్ల పంపిణీ సూత్రం ఏ మాత్రం అడ్డంకి కాదని ఆయన నిక్కచ్చిగా చెప్పారు. ఎస్.సి వర్గీకరణ జరిగితేనే అట్టడుగు వర్గం వారికి మరింత బలం చేకూరి వారు అన్ని రంగాల్లోనూ పురోగతిని సాధించగలరనే సత్యాన్ని ఆయన పదే పదే చెప్పారు. ఇదే బాలగోపాల్ గారి ప్రత్యేకత.

మాల మేధావుల మౌనం లేదా అరకొర మద్దతు కారణంగానే వర్గీకరణ అంశం దళిత కులాల మధ్య అంతర్యుద్ధంగా మారిందనేది బాలగోపాల్ గారి రచనల నుండి కూడా అర్థం చేసుకోవచ్చు. బాలగోపాల్ గారి లాంటి మేధావులు తమ మేధస్సును మా సమాజానికి బాసటగా అందిస్తున్నప్పుడు, వర్గీకరణ అమలు కావాలని గట్టిగా చెబుతున్నపుడు మా డిమాండ్ ఎంత న్యాయమైనదనేది అందరికీ అర్థం అయి ఉండాలి. ఇది ఎం.ఆర్.పి.ఎస్ ఉద్యమానికి ఎంతో బలాన్ని చేకూర్చిన అంశం. మా ఉద్యమం స్వచ్ఛమైన ఆలోచనాపరుల్ని తప్పనిసరిగా కదిలిస్తుందనడానికి బాలగోపాల్ గారే గొప్ప ఉదాహరణ. వర్గీకరణ పట్ల వారికి ఉన్న స్పష్టమైన అవగాహన స్ఫూర్తిదాయకమైనది. ఎం.ఆర్.పి.ఎస్ ఉద్యమం మీద ఆయన రాసిన ఈ అమూల్యమైన వ్యాసాలు, ఆయన ప్రకటించిన అద్వితీయమైన మద్దతు రాబోయే రోజుల్లో జరగబోయే సామాజిక న్యాయ ఉద్యమాలన్నిటికీ బలం చేకూరుస్తుందనడంలో నాకెలాంటి సందేహం లేదు.

ఒక్క ఎస్.సి వర్గీకరణ పట్లనే కాదు, మొత్తం సమాజం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిపై లోతైన అవగాహన ఏర్పరచుకోవడంతో పాటు వాటి పరిష్కార దిశగా సమాజానికి తాను చెప్పదలచుకున్న ప్రతి విషయంలోను ఖచ్చితత్వాన్ని అవలంబించారు. ఆ వైఖరి కారణంగా వ్యక్తిగతంగా ఎన్నో సమస్యలు, సవాళ్లు ఎదురైనా రాజీలేని దృఢ సంకల్పాన్ని ప్రదర్శించారు. ఆయనలో గానీ, ఆయన రచనల్లో గానీ ఎక్కడా మనం ఊగిసలాట, ద్వంద్వ వైఖరి చూడలేమంటే అది ఆయనలో ఉన్న నిజాయితీ, నిబద్ధతలకు బలమైన సాక్ష్యం.

ఎస్.సి రిజర్వేషన్ల వర్గీకరణ మీద తొలినాళ్ల నుంచి ఆయన రాసిన రచనల్ని, చేసిన ప్రసంగాలను, వెలువరించిన కరపత్రాలను, ఇచ్చిన ప్రకటనలను ఒక దగ్గర చేర్చి పుస్తకం రూపంలో తీసుకొస్తున్నందుకు మానవహక్కుల వేదికకు అభినందనలు. జరిగిన విషయాలన్నీ అందరికీ తెలిసేలా సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ పుస్తకం రావడం ఆహ్వానించదగినది. ఈ పుస్తకం దండోరా ఉద్యమానికి మరింతగా ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను.



○ మంద కృష్ణ మాదిగ
MRPS వ్యవస్థాపక అధ్యక్షులు

(నేడు బాలగోపాల్ 15వ వర్ధంతి. ఆయన రాసిన తెలుగు, ఇంగ్లిష్ వ్యాసాల సంకలనం 'రిజర్వేషన్ల వర్గీకరణ– ప్రజాస్వామిక దృక్పథం'కు మంద కృష్ణమాదిగ ముందుమాట ఇది)

వికసిత భారతానికి ఉన్నత విద్యా బాట

సమాజంలో మార్పులు ఐదు దశాబ్దాల క్రితం కంటే మరింత శీఘ్రగతిన చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుత వినూత్న నాల్గవ పారిశ్రామిక విప్లవం మరింత క్రియాశీలమైనది, విజ్ఞాన కేంద్రితమైనది; అనేక విద్యా విభాగాల పరిశోధనా ఫలితాలు నైపుణ్యాలపై పెద్ద ఎత్తున ఆధారపడిన నిర్విరామమైన విప్లవమది. అది అధునాతన సాంకేతిక పురోగతిని సాధిస్తోంది. ఆ అభివృద్ధి నుంచి లబ్ధి పొందలేని పక్షంలో ప్రపంచంలో మనం బాగా వెనుకబడిపోతాం. అలా జరగకుండా ఉండాలంటే విద్యా వ్యవస్థలో మౌలిక మార్పులు రావాల్సి ఉన్నది. దురదృష్టవశాత్తు సమాజాభ్యుదయానికి అవసరమైన వాటికి అనుగుణంగా మన విద్యా విధానంలో తగినంత మార్పులేదు.

మార్పు ప్రాముఖ్యత ఉపాధ్యాయులకు తెలుసు. అయితే విద్యా విధానాలలో మౌలిక మార్పులు వచ్చేందుకు వారు మార్గదర్శకత్వం వహించడం లేదు. పైగా మార్పును ప్రతిఘటించడం ఒక హక్కుగా ఉన్నది! మార్పుల పట్ల వ్యతిరేకత వర్తమాన తరం ఉపాధ్యాయులకు లబ్ధిని చేకూర్చవచ్చు గానీ అభ్యాసకులకు మేలు చేయదుగాక చేయదు. అంతర్జాతీయ స్థాయిలో మనం దీటుగా పోటీపడాలంటే విద్యా పాలన వ్యవహారాల నిర్వహణలో పెను మార్పులు రావాల్సి ఉన్నది. అందుకు అనుగుణమైన పరివర్తనను సాధించగలమా? ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో రిజిస్ట్రార్, రెక్టార్, ప్రో వైస్ ఛాన్సలర్, వైస్ ఛాన్సలర్ మొదలైన ఉన్నతస్థాయి ఉద్యోగాలకు అధ్యాపకులు, ఆచార్యులు ఆరాటపడుతున్నారు. వారు తమ పదవీ కాలంలో మౌలిక మార్పులు సాధించేందుకు వ్యవస్థ వారిని అనుమతించడం లేదు. ప్రగతిశీల విద్యా పరిపాలకులకు సహకరించవలసిన వారు సహకరించడం లేదు. ఈ కారణంగా తమ ఉద్యోగ కాలంలో నిశ్చింతగా ఉండిపోతున్నారు. ఎటువంటి సమస్యలు కొనితెచ్చుకునేందుకు విద్యాపాలన బాధ్యతల్లో ఉన్న ఉపాధ్యాయులు ఎంత మాత్రం సుముఖత చూపడం లేదు. ప్రతిష్ఠాత్మక ఐఐఎస్‌సి, ఐఐటీలు, ఐఐఎమ్‌లు, ఎన్ఐటీలు మొదలైనవి బోధన– అభ్యాసం ప్రక్రియలు, పద్ధతులలో క్రమబద్ధమైన మార్పులను అనుమతిస్తున్నాయి. తత్ఫలితంగానే అవి జాతీయ ప్రాధాన్యమున్న ఉన్నత విద్యా సంస్థలుగా వర్ధిల్లుతున్నాయి. ఉపాధ్యాయ–విద్యాపాలకులు తమ తమ బాధ్యతలకు న్యాయం చేయదలుచుకుంటే ఆ ఆదర్శప్రాయ పద్ధతుల గురించి ఆలోచించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి అభివృద్ధి చెందిన దేశాలలో అగ్రగామిగా ఉండాలని భారత్ ఆకాంక్షిస్తోంది. అత్యాధునిక సాంకేతికతల స్రష్టలైన ఆపిల్, గూగుల్, మైక్రోసాఫ్ట్ మొదలైన కంపెనీల వార్షిక ఆదాయం మన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)తో ఇంచుమించు సరిసమానంగా ఉంది. ఈ పరిస్థితిని అధిగమించాలంటే 48 కోట్ల దేశ యువ జనాభా ప్రతిభాపాటవాలను సద్వినియోగం చేసుకోవాలి. ఇందుకు మన విద్యా వ్యవస్థలో ప్రయోజనకరమైన మార్పులను తక్షణమే ప్రవేశపెట్టాలి. లేనిపక్షంలో మన అమూల్యమైన యువశక్తి వ్యర్థమైపోతుంది. దేశ ఆర్థిక వ్యవస్థను వినూత్నరీతిలో ముందుకు తీసుకువెళ్లే అవకాశాలను యువజనులకు సమృద్ధిగా కల్పించాలి. లేనిపక్షంలో ప్రస్తుత జనాభా లబ్ధికి సమీప భవిష్యత్తులోనే మనం వృద్ధ జనాభాకు మెరుగైన జీవనప్రమాణాలు కల్పించడం మొదలైన వాటి విషయంలో భారీ మూల్యం చెల్లించుకోవల్సి వస్తుంది.



ఉన్నత విద్యా కోర్సుల్లో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో 2001లో 11 శాతం నుంచి 2024లో 28 శాతానికి పెరిగింది. వచ్చే దశాబ్దంలో ఈ జీఇఆర్ 50 శాతంగా నమోదు అయ్యేట్టుగా లక్ష్యం నిర్దేశించుకున్నాం. 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు పెరుగుతున్నందున ఆ లక్ష్య సాధన కష్టమేమీ కాదు. అయితే 'పరిమాణం'తో పాటు 'నాణ్యత' కూడా ఇతోధికంగా పెరగడం ఉన్నత విద్యా వ్యవస్థ విస్తరణలో అంతర్భాగంగా ఉండితీరాలి.

ఉత్కృష్ట ప్రమాణాలతో కూడిన విద్య కనీసం మూడు అంశాలకు ప్రాధాన్యమివ్వాలి. యువ భారతీయులు సొంతంగా, సాహసోపేతంగా ఆలోచించగలిగేలా చేయాలి; సమస్యల పట్ల సమగ్ర విశ్లేషణాత్మక దృక్పథాన్ని అనుసరించేలా శిక్షణ ఇవ్వాలి; స్థానిక, ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు సమకూర్చే మేధో సామర్థ్యాలను వారిలో అభివృద్ధిపరచాలి. మరీ ముఖ్యంగా బాధ్యతాయుత, సుస్థిరమైన రీతిలో వ్యవహరించేలా వారిని తీర్చిదిద్దాలి. అధునాతన సాంకేతికతలను సమర్థంగా ఉపయోగించుకునేందుకు కొత్త నైపుణ్యాలు అలవర్చుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది. కార్మిక శ్రేణులే కాకుండా శిక్షణలో ఉన్న యువజనులు సైతం ఈ వాస్తవాన్ని విస్మరించకూడదు. కొత్త కౌశలాలను సముపార్జించుకోని పక్షంలో వ్యవస్థలో అనావశ్యకమైపోతారు. కనుక అభ్యాస ప్రక్రియ నిరంతరం కొత్త రీతుల్లో సాగేలా ఉండాలి. నేర్చుకున్నది మరచిపోకుండా ఉండాలి. విద్యాభ్యాసానికి ఇప్పుడు వయస్సు ఒక అర్హత కానేకాదు. అనేకమైన ప్రభుత్వ, ప్రైవేట్, ఆన్‌లైన్ అభ్యాస వేదికలు అన్ని వయసుల వారికి విజ్ఞానాన్ని సమకూరుస్తున్నాయి, నవీన నైపుణ్యాలను నేర్పుతున్నాయి.

విద్యార్థి కేంద్రిత అభ్యసన పద్ధతులు చాలా అవసరం. మెరుగైన అభ్యసన వాతావరణానికి ఉపాధ్యాయ కేంద్రిత అభ్యసన ప్రక్రియలను నవీకరించాలి. కొత్త సాంకేతికతలకు అనుగుణంగా వాటిలో మార్పులు రావాలి. (ఐఐటీలు, ఐఐఎమ్‌లు, ఎన్ఐటీలు, బిట్స్ పిలాని, కొన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో అనుసరిస్తున్న పద్ధతులను ఆచరించాలి.) నిజానికి ఇటువంటి వినూత్న మార్పునే జాతీయ విద్యా విధానం–2020 ఆకాంక్షించింది, నిర్దేశించింది. బట్టీ చదువుల స్థానంలో అనుభవాత్మక అభ్యాసం చోటుచేసుకోవాలి. అభ్యాసకులకు వివిధ ప్రత్యామ్నాయాలను కల్పించాలి. ఉన్నత విద్యారంగంలో పరిశోధన, అభివృద్ధి ఆధారిత కార్యకలాపాలకు అగ్ర ప్రాధాన్యమివ్వాలి. అలా చేసినట్టయితే మన దేశంలో ఉన్నత విద్యారంగం పరిస్థితులు పూర్తిగా మారిపోతాయి. ఈ మేధాశక్తిని సమగ్రంగా ఉపయోగించుకుని 2047 నాటికి 'వికసిత్ భారత్' ప్రభవించేందుకు ఉన్నత విద్యాసంస్థలు మౌలిక రీతుల్లో మారాలి.



ఉన్నత విద్యా వ్యవస్థ ప్రాథమిక వాస్తవాలు పెను సవాళ్లను విసురుతున్నాయి. సంప్రదాయ వివేకం ఏమిటంటే ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యారంగం, ముఖ్యంగా ఉన్నత విద్యారంగ సంస్థలు అయిన ఐఐటీలు, ఐఐఎమ్‌లు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో కేంద్ర ప్రభుత్వం భారీ పెట్టుబడులు పెడుతున్నది. అయితే నాలుగు కోట్ల యువజనులలో కేవలం ఒక శాతం కంటే తక్కువ మందిని మాత్రమే అవి తీర్చిదిద్దుతున్నాయి. ఏఐసిటిఇ ఆమోదించిన 4500 కళాశాలలతో సహా 46,000 ఇంజనీరింగ్ కళాశాలలు, యూజీసీ ఆమోదించిన 40,000 కళాశాలలు, యూజీసీ ఆమోదించిన 1100 ప్రభుత్వ, ప్రైవేట్, భావిత(డీమ్డ్) విశ్వవిద్యాలయాలు మిగతా 99శాతం మంది విద్యార్థుల అవసరాలను తీర్చాలి. ఇందుకు ఆయా ఉన్నత విద్యా సంస్థలకు, విశ్వవిద్యాలయాలకు అవసరమైన మౌలిక వసతులను సమకూర్చినప్పుడే ఉన్నత విద్యారంగం పురోగమించగలదు.

వివిధ ఉన్నత విద్యాసంస్థలకు అందిస్తున్న ఆర్థిక సహాయం విభిన్న రీతుల్లో ఉన్నప్పటికీ ఉన్నత విద్యా కోర్సుల్లో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఇఆర్) 2001లో 11 శాతం నుంచి 2024లో 28 శాతానికి పెరిగింది. ఉన్నత స్థాయికి చేరాలని ప్రగాఢంగా కోరుకుంటున్న, జనాభా అంతకంతకూ పెరుగుతోన్న భారత్ లాంటి దేశంలో జీఇఆర్ ఈ విధంగా పెరగడం ఒక గణనీయమైన విజయమే. వచ్చే దశాబ్దంలో ఉన్నత విద్యా వ్యవస్థలో జీఇఆర్ 50 శాతంగా నమోదు అయ్యేట్టుగా లక్ష్యం నిర్దేశించుకున్నాం. 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ప్రభుత్వ ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు పెరుగుతున్నందున ఆ లక్ష్య సాధన కష్టమేమీ కాదు. అయితే 'పరిమాణం'తో పాటు 'నాణ్యత' కూడా ఇతోధికంగా పెరగడం ఉన్నత విద్యా వ్యవస్థ విస్తరణలో అంతర్భాగంగా ఉండితీరాలి.

కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు గ్రామీణ విద్యార్థులను సరైన సంఖ్యలో చేర్చుకోలేకపోతున్నాయి. ఒకవేళ చేర్చుకున్నా కోర్సు పూర్తయ్యేంతవరకు వారిని విద్యాభ్యాసంలో నిలుపుకోవడం కూడా కష్టమే అవుతుంది కారణమేమిటి? సరైన విద్యాబోధన వసతులు, మంచి శిక్షణ పొందిన అధ్యాపకులు లేకపోవడమే చాలావరకు కారణంగా చెప్పితీరాలి. 2035 సంవత్సరం నాటికే 50 శాతం జీఇఆర్ లక్ష్యాన్ని సాధించవచ్చు. అయితే ఆ మానవ వనరుల నాణ్యత అంత మేలురకంగా ఉండబోదు. ఇప్పుడు ఆ నాణ్యత అంత మెరుగ్గా లేనందునే 28 శాతం జీఇఆర్ మాత్రమే నమోదవుతున్న పరిస్థితుల్లో కూడా మానవ వనరుల నాణ్యత ఏమంత మెరుగ్గా ఉండడం లేదు. ఈ పరిస్థితిని ఎలా అధిగమించాలి? అత్యాధునిక ఎఆర్, విఆర్ సాంకేతికతలను ఉపయోగించుకుని ఉత్కృష్ట ఆన్‌లైన్ విద్యా కోర్సులను రూపొందించుకోవాలి. ఈ ఆన్‌లైన్ కోర్సులు సంవత్సరం పొడుగునా ప్రతి రోజూ రేయింబవళ్లు అభ్యాసకులకు అందుబాటులో ఉండాలి. అలా ఉన్నందునే భారత ప్రభుత్వ ఆన్‌లైన్ విద్యా వేదిక అయిన 'స్వయం'లో నాలుగు కోట్ల మంది అభ్యాసకులు చేరారు. మొత్తం 10 వేల కోర్సులను వారు అభ్యసిస్తున్నారు.

తరగతి గదుల్లో బోధనకు ఇప్పటికీ ఎనలేని ప్రాధాన్యం లభిస్తోంది. తరగతి గదుల్లో బోధనకు ప్రాధాన్యమిస్తున్న విద్యాసంస్థలు విద్యార్థుల హాజరుపై శ్రద్ధ చూపాలి. కోర్సుల వేళలు, పరీక్షలు మొదలైన వాటిని విద్యార్థులను ఆకట్టుకునేలా చేయాలి. తమ సమయానుకూలంగా మాత్రమే విద్యాభ్యాసం చేసేందుకు ఎంతో మంది విద్యార్థులు శ్రద్ధ చూపుతున్నారన్నది విస్మరించలేని వాస్తవం. ఐఐటీలు, ఐఐఎమ్‌లు ఈ విషయంలో మెరుగ్గా ఉన్నాయి. టీచర్/స్టూడెంట్ నిష్పత్తి ఇరువురికీ సానుకూలంగా ఉంటుంది. నాణ్యమైన విద్యాబోధన వసతులు ఉన్నాయి. శిక్షణ పొందిన ఉపాధ్యాయులూ అక్కడ అధికంగానే ఉన్నారు 46,000 కళాశాలల్లో 99 శాతం మంది యువజనులకు సమర్థమైన శిక్షణ ఇచ్చేందుకు ఐఐటీలు, ఐఐఎమ్‌లలో అనుసరిస్తున్న పద్ధతులను ఆదర్శంగా తీసుకోవాలి. ఆ ఉన్నత విద్యాసంస్థలు పదే పదే తమ ఉత్కృష్ట ప్రమాణాలను నిరూపించుకోవడం లేదూ?

■ ప్రొఫెసర్ పొదిలి అప్పారావు
మాజీ వీసీ, హెచ్‌సీయూ

నీతిగల్ల రైతులు.. నీతిమాలిన ప్రభుత్వం

"అమాయకుల విశ్వాసమే మోసగాళ్లకు పెట్టుబడి" అని ఒక అమెరికన్ తత్వవేత్త చెప్పినదాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాగా వంటబట్టించుకున్నాడు. రోగి కోరింది పెరుగన్నమే, వైద్యుడు కోరిందీ పెరుగన్నమే అన్నట్టు ప్రజలు మా చేత మోసపోవాలనుకుంటారు. మేము ప్రజల్ని మోసగిస్తుంటాం. అనే ఫిలాసఫీని ఆయన గతంలో మీడియా సాక్షిగా ప్రకటించాడు. ప్రస్తుతం అదే అమలు చేస్తున్నాడు. సందర్భం ఏదైనా దబాయింపుల, బుకాయింపుల, అబద్ధాల అల్లికతో రేవంత్‌రెడ్డి ఉపన్యాసాలు కొనసాగుతున్నాయి. అబద్ధమే ప్రధానంగా, మోసమే విధానంగా పది నెలల సోకాల్డ్ ప్రజాపాలన వర్ధిల్లుతున్నది. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతైనా, కాకా వెంకటస్వామి జయంతైనా ముఖ్యమంత్రి ఉపన్యాసం ఎప్పుడూ అబద్ధాల చుట్టూ తిరిగే కథే. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగితే మొత్తం కాళేశ్వరమే కూలిందని ఒక అబద్ధం. 94వేల కోట్ల ఖర్చుతో నిర్మించిన ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని రెండో అబద్ధం. రాష్ట్రంలోని రైతులకు సంపూర్ణంగా రుణమాఫీ జరిగిందని ముచ్చటగా మూడో అబద్ధం.

రైతు రుణమాఫీ జరిగిపోయిందనే అబద్ధాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదే పదే పునరావృతం చేస్తున్నాడు. ఈ అబద్ధాలు విని వినీ ప్రజలకు అలుపొస్తున్నది కానీ, చెప్పడానికి ముఖ్యమంత్రికి మాత్రం అలుపు రావడం లేదు. అబద్ధాల పునాది మీద ఏర్పడి, అబద్ధాలతోనే మనుగడ కొనసాగిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం.

రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిది ప్రజా వేదికలపై ఒకమాట, ప్రతిపక్షంతో ఇంకొక మాట, ప్రధాన మంత్రితో వేరొకమాట. రుణమాఫీ పూర్తిగా జరిగిపోయిందని ప్రతిపక్షాన్ని సవాల్ చేస్తాడు. సాంకేతిక కారణాలతో కొంత మందికి జరగలేదని, కలెక్టర్‌ను కలుస్తే పరిష్కారం చేసుకోవచ్చని రైతులతో చెబుతాడు. రెండు లక్షల లోపు ఉన్న రుణాలన్నీ మాఫీ చేశామని, రెండు లక్షల పైనున్నవి చేయడానికి సిద్ధంగా ఉన్నామని అంటూ 42లక్షల్లో మరో 20లక్షల మందికి కానేలేదని ప్రధానమంత్రికి ఉత్తరం రాస్తాడు. అసలు విషయం ఏమిటంటే ఈ మూడూ అబద్ధాలే. సమాచార హక్కు చట్టం కింద నేను ఎస్‌బిఐ ద్వారా సేకరించిన సమాచారాన్ని అనుసరించి, రెండు లక్షల లోపు రుణమున్న రైతుల్లో 50శాతం మందికి కూడా రుణమాఫీ కాలేదన్నది అసలు వాస్తవం. మిగతా బ్యాంకుల్లోనూ దగ్గర దగ్గరగా ఇదే పరిస్థితి. దీన్ని బట్టి తెలుస్తున్నది ఏమిటంటే ఊసరవెల్లి రంగులు మార్చిన దానికన్నా వేగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు మార్చగలడన్నది అసలు నిజం.

కాంగ్రెస్ కారుమబ్బులు కమ్ముకున్న తర్వాత వెలుగు జిలుగుల తెలంగాణ వెలవెలబోతున్నది. రైతన్న నెత్తిన రుణభారం దిగలేదు. పంటకు పెట్టుబడి సాయం అందలేదు. 500 రూపాయల బోనస్ ఎండమావేనని తేలిపోయింది. పదేళ్లు పండుగోలె సాగిన వ్యవసాయం ఈ పది నెలల్లో పట్టుతప్పిపోయింది. ఇది కేవలం రాజకీయం వైఫల్యం మాత్రమే కాదు. ఇది నైతిక వైఫల్యం. ఇది విశ్వాసఘాతుకం. ఇందిరమ్మ రాజ్యం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటదనే రైతుల విశ్వాసం ముక్కలు చెక్కలైంది. దేవుడి మీద ఒట్టు పెట్టి మరీ మోసం చేస్తారని రైతులు కలలో కూడా ఊహించలేదు. ఆగస్టు 15 నాడు జాతీయ పతాకంతో పాటు తమ గుండెల్లో సంతోషాల పతాకం ఎగురుతుందని ఆశించారు. దేశానికి విముక్తి లభించిన రోజున, తమకు రుణ విముక్తి లభిస్తుందని సంబురపడ్డారు. కానీ, రైతన్నలు పెట్టుకున్న నమ్మకం మీద కాంగ్రెస్ ప్రభుత్వం దోసెడు మన్ను బోసింది. నమ్మక ద్రోహం చేసి అన్నదాతల ఆత్మగౌరవం మీద దాడి చేసింది. తీరని రుణ భారంకన్నా నమ్మి మోసపోయామన్న బాధనే తెలంగాణ రైతుల గుండెలను ఎక్కువ మెలిపెడుతున్నది.

క్షేత్రస్థాయిలో వాస్తవం ఇట్లుంటే ముఖ్యమంత్రి మాత్రం అలవోకగా అబద్ధం మీద అబద్ధం చెబుతూ పోతున్నాడు. రైతుల గుండెల్లో గునపాలు దించుతున్నాడు. ఆ గాయాల మీద కారం చల్లుతూనే ఉన్నాడు. ఆగస్టు 15నాడు ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ జరిగిపోయిందన్నాడు. అక్కడితో ఊరుకోకుండా నన్ను రాజీనామా చెయ్యమన్నాడు. చెయ్యిలేకపోతే ఏట్లో దుంకి చావమన్నాడు. ఇంకా చెప్పరాని మాటలెన్నో ప్రయోగిస్తూ, తనదైన దౌర్భాగ్య భాషలో సవాళ్లు విసిరాడు. ముఖ్యమంత్రి ప్రకటనలోని డొల్లతనం తెల్లవారి నుంచే బయటపడటం మొదలైంది. అనేక మంది రైతులు తమకు రుణమాఫీ జరగలేదని బ్యాంకుల వద్దకు, అధికారుల వద్దకు వచ్చి ఆందోళన చేయడం మొదలైంది. అప్పుడు ముఖ్యమంత్రి సన్నాయి నొక్కులు నొక్కుతూ– సాంకేతిక కారణాల వల్ల కొంతమందికి జరుగకపోవచ్చు, 20 రోజుల్లో ఆ కారణాలు పరిష్కరిస్తామన్నాడు. తన అమ్ములపొది లోంచి మరో అబద్ధాన్ని అస్త్రంగా విసిరాడు. కాలం గడుస్తున్నా కొద్దీ రుణమాఫీ జరగలేదనే వాస్తవం బలంగా ముందుకు వస్తున్నది. ఎవరు ఏట్లో దూకాలో, ఎవరు రాజీనామా చేయాలో ప్రజల ముందు స్పష్టంగా తేలిపోయింది. అయినా ముఖ్యమంత్రి బుకాయింపులు మానలేదు. ఇదిట్ల ఉంటే వ్యవసాయ శాఖ మంత్రి రుణమాఫీ పాక్షికంగా జరిగిందని స్వయంగా ఒప్పుకున్నాడు. ఈ మధ్యనే చేసిన తాజా ప్రకటనలో రాష్ట్రంలో ఇంకా 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ జరగలేదని కుండబద్దలు కొట్టినట్లు ప్రకటించాడు. అయినా మనిషి మారలేదు అన్నట్లు ముఖ్యమంత్రి తీరు మారలేదు.

రెండు లక్షల లోపు ఉన్న రుణాలు మాఫీ చేశామని ముఖ్యమంత్రి డంకా భజాయించి మరీ చెబుతున్నాడు. వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఏ జిల్లాకు పోయినా, ఏ నియోజకవర్గానికి పోయినా రైతన్నలు ఎదురొచ్చి రెండు లక్షల లోపే ఉన్నప్పటికీ తమకు రుణం మాఫీ కాలేదని మొరపెట్టుకుంటున్నారు. కట్టలకొద్దీ దరఖాస్తు పత్రాలు మా చేతుల్లో పెడుతున్నారు. ఒక్కో రైతుది ఒక్కో కథ. రుణం తీరని వ్యథ. ఒకరికి రేషన్ కార్డు లేదని, ఒకరికి ఆధార్ కార్డు లేదని, ఒకరికి పెళ్లి కాలేదని, చనిపోయిన భర్తకో భార్యకో ఆధార్ కార్డు లేదని ఇలా సుమారు 31 కారణాల వల్ల లక్షలాది మంది రైతులకు రుణమాఫీ జరగలేదనే సత్యం స్ఫటిక సదృశంగా కళ్ల ముందు కనిపిస్తున్నది. ఏ ఊరికి పోయినా, రైతన్నల దుఃఖమే వినిపిస్తున్నది.

బోడిగుండుకు మోకాలుకు ముడేసినట్లు రుణమాఫీని రేషన్ కార్డుతో ముడిపెట్టారు. ఈ నిబంధన కుటుంబ కలహాలకు దారి తీస్తున్నది. మేడ్చల్ సురేందర్ రెడ్డి, మహబూబాబాద్ రవి ఆత్మహత్యలకు కారణమైంది. ఇవి ముమ్మాటికీ ముఖ్యమంత్రి తన అబద్ధాలతో చేసిన హత్యలు. అబద్ధాలాడటం ముఖ్యమంత్రికి సౌకర్యంగానే ఉంది. అయితే పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణసంకటం అన్నట్లు ముఖ్యమంత్రి అబద్ధాలు రైతుల పాలిట యమపాశాలుగా మారుతున్నాయి. ముఖ్యమంత్రికి బాకాలు ఊదే మీడియాలో అబద్ధాలు పతాక శీర్షికలు కావొచ్చు, కానీ అవి రైతుల కన్నీరు తుడవలేవు కదా, రైతుల అనుభవాలను ఏమార్చలేవు కదా. రెండు లక్షల లోపే రుణం ఉన్నప్పటికీ మాఫీ కాని రైతుల వివరాలు ప్రభుత్వం ముందుంచడానికి బీఆర్ఎస్ సిద్ధంగా ఉంది. స్వీకరించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందా? సత్యం, సమర్థత లేని ప్రభుత్వం నుంచి రైతుల జీవితాల పట్ల బాధ్యతను ఆశించలేం. కాంగ్రెస్ రుణమాఫీ కథ దీనికి నిదర్శనంగా నిలుస్తున్నది.



రెండు లక్షల లోపు రుణమున్న రైతులది ఒక కథ అయితే, 2 లక్షల పైన రుణమున్న రైతులది మరో వ్యథ. రెండు లక్షల పైనున్న మొత్తాన్ని కట్టిన మరుక్షణమే మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటిస్తే, అందుకు భిన్నంగా మీరు పై మొత్తం కట్టినా మేము రెండు లక్షలు ఇప్పుడే మాఫీ చేయలేమని, తొందరపడి కట్టొద్దని వ్యవసాయ మంత్రి ప్రకటిస్తాడు. రైతులు ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మొద్దో అర్థం కాని అయోమయం. పాపం ముఖ్యమంత్రి మాటలు నమ్మిన రైతులు నిండా మునిగారు. మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్టు బ్యాంకు రుణం తీరకపోగా, కొత్త అప్పు మీద పడ్డది. రెండు, మూడు రూపాయల మిత్తికి అప్పు తెచ్చుకొని 2లక్షల రుణం పైనున్న మొత్తాన్ని బ్యాంకులకు చెల్లించారు. నీతి గల రైతులు చెల్లించారు కానీ, నీతి మాలిన ప్రభుత్వం రుణమాఫీ చేయలేదు. ఇటీవల తొర్రూరులో జరిగిన రైతు ధర్నాలో నేను ప్రసంగిస్తూ ఈ ప్రస్తావన తెచ్చినప్పుడు కొంతమంది రైతులు నా దగ్గరకు వచ్చి తాము రెండు లక్షలకు పైనున్న మొత్తం చెల్లించామని, బ్యాంకు రసీదులు చూపించారు. అయినా తమకు రుణం మాఫీ కాలేదని కన్నీటి పర్యంతమయ్యారు.

మీడియా వేదికగా బహిరంగ చర్చకు ముఖ్యమంత్రి సిద్ధమా? నేను సిద్ధంగా ఉన్నాను. రైతుల కన్నీటితో తడిసిన కాగితాల కట్టలు పట్టుకొని నేనొస్తాను. రైతులు తమ నెత్తిన మోస్తున్న రుణభారం వివరాలను ముఖ్యమంత్రి ముందుంచుతాను. అవి అబద్ధమైతే ప్రజలు వేసే ఏ శిక్షకైనా నేను సిద్ధం. ఒకవేళ ముఖ్యమంత్రి చెబుతున్నదే అబద్ధమని తేలితే ఆయన ఏం చేస్తారు? తాను ఇన్నాళ్లూ రైతుల ఉసురు పోసుకున్నందుకు క్షమాపణలు వేడుకుంటారా?



మీడియా వేదికగా బహిరంగ చర్చకు ముఖ్యమంత్రి సిద్ధమా? నేను సిద్ధంగా ఉన్నాను. రైతుల కన్నీటితో తడిసిన కాగితాల కట్టలు పట్టుకొని నేనొస్తాను. వారు తమ నెత్తిన మోస్తున్న రుణభారం వివరాలను ముఖ్యమంత్రి ముందుంచుతాను. అవి అబద్ధమైతే ప్రజలు వేసే ఏ శిక్షకైనా నేను సిద్ధం. ఒకవేళ ముఖ్యమంత్రి చెబుతున్నదే అబద్ధమని తేలితే ఆయన ఏం చేస్తారు? తాను ఇన్నాళ్లూ రైతుల ఉసురు పోసుకున్నందుకు క్షమాపణలు వేడుకుంటారా? దసరా లోగా సంపూర్ణ రుణమాఫీ చేసి, వారు చెబుతున్న లెక్కల ప్రకారమే సుమారు 22 లక్షల మంది రైతులకు నిజమైన దసరాను జరుపుకునే అవకాశం కలిగిస్తారా? లేక అబద్ధాల పరంపరనే నమ్ముకుంటారా? తేల్చాల్సింది వారే.

నిజం చెప్పులు తొడుక్కునే లోపు, అబద్ధం ప్రపంచాన్ని చుట్టివస్తుందనే నానుడిని ముఖ్యమంత్రి నమ్మి ఉండవచ్చు. అబద్ధాలకు వేగమెక్కువైతే సత్యానికి బలమెక్కువ అని ముఖ్యమంత్రి గ్రహించాలి. అబద్ధాలు ఎక్కువ కాలం నిలబడవు. సత్యాలు ఎంత మలిపేసినా మలిగిపోవు. చెరిపేసినా చెరిగిపోవు. నిజం అనే విత్తనం భూమిని చీల్చుకొని మొలకెత్తుతుంది. రైతుల గుండెల్లో ఆవేశం నాటుకుంటుంది. అన్నదాతల ఆగ్రహం మీ ప్రభుత్వాన్ని చుట్టుముట్టినప్పుడు మీ అబద్ధాల కవచాలు పటాపంచలై పోతాయి.

• టి. హరీశ్‌రావు
ఎమ్మెల్యే, సిద్దిపేట

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

రాజరాజేశ్వరి మహా త్రిపుర సుందరిగా భద్రకాళి


రాజరాజేశ్వరి లలిత మహా త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు

- ఐదో రోజుకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 7: దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా సోమవారం భద్రకాళి దేవస్థానంలో అమ్మవారిని రాజరాజేశ్వరి లలిత మహా త్రిపుర సుందరిగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం స్కందమాత క్రమంలో పల్లకీపై ఉదయం అమ్మవారిని ఊరేగించారు. సాయంత్రం శేష వాహనంపై ఊరేగించారు. అమ్మవారిని దర్శించుకున్న వారికి సమస్త భోగాలు కలుగుతాయని, యోగా సిద్ది కలుగుతుందని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక హోమాల పూజలో పాల్గొన్నారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. భద్రకాళి సేవా సమితి కన్వీనర్ ఐతా గోపీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి మహా పూజ అనంతరం ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, కూచన హరినాథ్, శ్యామ్ సుందర్, అశోక్ పాల్గొన్నారు.


ప్రత్యేక హోమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


లాంగ్‌జంప్‌లో పాల్గొన్న క్రీడాకారిణి

అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ప్రారంభం

- పోటీలను ప్రారంభించిన స్పోర్ట్స్ ఓఎస్‌డీ రవీందర్ రెడ్డి
- కొత్తక్రీడా పాలసీ తెచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని వెల్లడి



వివరాలు : 7లో..


గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని

ప్రజావాణి ఫిర్యాదులపై
జాప్యం తగదు

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- బల్దియా గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 7 : ప్రజావాణి ఫిర్యాదులు చాలా రోజులుగా పెండింగ్‌లో ఉంటున్నాయని, తరుచుగా వస్తున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను హెచ్చరించారు. సోమవారం వరంగల్ బల్దియా కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి (గ్రీవెన్స్ సెల్) కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్ల ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కమిషనర్ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించిన తర్వాత వెంటనే ఆయా విభాగాల అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 70 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే వెల్లడించారు. ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, డీసీపీలు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, టీపీఆర్‌వో కోళ రాజేశ్‌కుమార్, టీవో బిర్రు శ్రీనివాస్‌లతో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు పాల్గొన్నారు. ఇంజనీరింగ్ విభాగానికి 17, హెల్త్, శానిటేషన్ - 9, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 8, టౌన్‌ప్లానింగ్ - 33, హార్టికల్చర్ - 2 మొత్తం 70 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

- కాశిబుగ్గ మధురానగర్‌లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంలో వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.
- వరంగల్ పుప్పాలగుట్ట ప్రాంతంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.
- వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో చేపలు విక్రయించే చోట చేపల మార్కెట్‌లు ఏర్పాటు చేసి వ్యాపారులకు సహకరించాలని తెలంగాణ మత్స్య సంఘం జిల్లా నాయకులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ చింతగట్టు గ్రామంలో శ్మశాన వాటిక లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

తొలిమెట్టు.. తడబాటు

తూతూ మంత్రంగా అమలు



- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులతో బ్రేక్
- ఈ యేడు ఇప్పటి వరకు ఇవ్వని శిక్షణ
- కరోనా అనంతరం పిల్లల్లో తగ్గిన విద్యా సామర్థ్యాలు
- మెరుగుపరచడమే లక్ష్యంగా తొలిమెట్టు
- పట్టింపులేక నీరుగారుతున్న లక్ష్యం

హనుమకొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కరోనా కాలంలో చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉద్దేశించి విద్యాశాఖ ప్రవేశ పెట్టిన తొలిమెట్టు కార్యక్రమం ఉమ్మడి వరంగల్ జిల్లాలో తూతూ మంత్రంగా అమలవుతోంది. కొన్ని పాఠశాలల్లో అది కూడా లేదు. దీనితో కార్యక్రమం లక్ష్యం నీరుగారి పోతోంది. కరోనా ప్రభావం విద్యా రంగంలో తీవ్ర ప్రభావం చూపింది. కొవిడ్ ప్రజల ఆరోగ్యాన్ని ఎంత సంక్షోభంలోకి నెట్టిందో అంతకన్నా ఎక్కువ నష్టాన్ని పాఠశాల విద్యకు కలిగించింది. పాఠశాల విద్యలో ప్రాథమిక దశలోని విద్యార్థులు వారివారి తరగతులకు చెందిన సామర్థ్యాలను సాధించగలిగినప్పుడే నాణ్యమైన విద్య సాకరమవుతుంది. కరోనా కాలంలో ఆన్‌లైన్ తరగతుల ద్వారా ఇంట్లోనే ఉండి విద్యార్థులు చదుకోవలసిన పరిస్థితి వచ్చింది. కరోనా తగ్గి పరిస్థితులు సానుకూలించి పాఠశాల విద్య తిరిగి గాడిలో పడిన తర్వాత చిన్నారుల్లో విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తే దారుణంగా పడిపోయినట్టు గుర్తించారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం. అక్షరాలను గుర్తించడం లెక్కలు చేయడం రానివారు అనేక మంది ఉన్నట్టు ఒక అధ్యయనంలో తేలింది. దీనిని గుర్తించిన విద్యాశాఖ అటువంటి విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంచాలని నిర్ణయించుకున్నది. ఇందులో భాగంగా 2022-23 విద్యా సంవత్సరం నుంచి తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్-ఫౌండేషన్,లిటరజీ, న్యూమరసీ) పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. గత ఏడాది ఈ కార్యక్రమాన్ని పగడ్బందీగా అమలు చేయడంతో పిల్లల్లో విద్యా సామర్థ్యాలు కొంత మేరకు మెరుగయ్యాయి.

ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు..

ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు తొలిమెట్టు కార్యక్రమం అమలు చేస్తారు. మౌలిక భాష, గణిత సామర్థ్యాల సాధనకు అవసరమైనట్టుగా వారంలో ఐదు రోజుల పాటు బోధన చేయడం, ఒక రోజు పరీక్ష నిర్వహించాలి. బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించి విద్యార్థులను విభ జించి కృత్యాల బోధన చేయడం, పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు, స్లిప్‌టెస్ట్, రాత పనులు అంతర్భాగంగా నిర్వహిం చాలి. యాప్‌లో వివవరాలను నమోదు చేయాలి. కానీ ఇదేమీ ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల్లో సంపూర్ణంగా జరగడం లేదు. అంతా తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత బడులు	
హనుమకొండ	492
జనగామ	508
జయశంకర్ భూపాలపల్లి	432
మహబూబాబాద్	898
ములుగు	353
వరంగల్	645

తొలిమెట్టు అమలు ఇలా..

విద్యాసంవత్సరంలో 220 రోజుల పనిదినాలు ఉండగా, 140 రోజులు బోధనాభ్యాసన ప్రక్రియ నిర్వహించాలి. వారానికి ఐదురోజులు బోధనాభ్యాసం, ఒక రోజు మూల్యాంకనం, పునరభ్యాసం, చేయించాలి. విద్యార్థులంతా భాగస్వాములు అయ్యేలా వార్షిక, పాఠ్య, వారపు, రోజువారి కాలాంశం లేదా పీరియడ్ ప్రణాళిక రూపొందించాలి. 1వ తరగతిలో విద్యార్థులు నిమిషానికి 20 పదాలను, 2వ తరగతిలో 25 పదాలను, 3వ తరగతిలో 30 పదాలను, 4వ తరగతిలో 40 పదాలను, 5వ తరగతిలో 50 పదాలను ధారాళంగా చదవాలి. 3,4,5 తరగతుల్లోని విద్యార్థులు ఇచ్చిన పేరాను లేదా గేయాన్ని లేదా పద్యాన్ని చదివి అర్థం చేసుకోగలగాలి. దీనిని పరీక్షించడానికి 5 ప్రశ్నిలిస్తే వాటిల్లో 4 చేయగలగాలి. 1వ తరగతి పిల్లలు సరళపదాలు గుణింత పదాలు, 2వ తరగతి వారు ఒత్తుల పదాలు, 3 నుంచి 5వ తరగతి పిల్లలు 4 లేదా 5 వ్యాక్యాలతో కూడిన పేరాలను రాయగలగాలి. 5పదాల్లో కనీసం 4 పదాలను తప్పుల్లేకుండా రాయాలి. ఉపాధ్యాయులు ప్రతీ పీరియడ్‌కు పాఠ్య ప్రణాళికలు తయారు చేసి దాని ప్రకారమే బోధించాలి. విద్యార్థులు సాధించాల్సిన లక్ష్యాలను ముందే అంచనా వేసి లక్ష్యాలను సాధించేలా చేయాలి. ఒక్కో పాఠ్యాంశాన్ని రెండు మూడు భాగాలుగా విభజించి విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధించాలి. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ లాంటి బాషల బోధనలోనూ టీచర్లు బోధన ఉపకరణాలను విరివిగా ఉపయోగించాలి. బోధన ఉపకర ణాల తయారీని ప్రోత్సహించేందుకు టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ మేళాలు నిర్వహించాలి.

నాలుగంచెల్లో నిర్వహణ..

తొలిమెట్టు పర్యవేక్షణ బాధ్యత జిల్లా విద్యాశాఖాధికారి నుంచి కాంప్లెక్స్ జీహెచ్ఎంలు నాలుగు స్థాయిలో ఉంటుంది. కాంప్లెక్స్ హెచ్ఎం వారి కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలను నెలకోసారి పర్యవేక్షించాలి. ఎంఎన్‌వో (మండల నోడల్ అధికారి)లు ప్రతీ ఆదివారం రెండు రోజుల పాటు పరిశీలించాలి.

ఎంఈవోలు నెలలో 50శాతం పాఠశాలలు పరిశీలించాలి. సెక్టోరల్ అధికారులు వారికి కేటాయించిన మండలాల్లో నెలకు పది పాఠశాలలు, జిల్లా విద్యాశాఖాధికారి నెలకు అయిదు పాఠశాలలు పరిశీ లించాల్సి ఉంటుంది. అలాగే ప్రతీ నెలా మండల స్థాయి, జిల్లా స్థాయి సమీక్షలు చేపట్టాలి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. బృందాల పరిశీలన లేదు. జిల్లాలో సగం మంది ఉద్యోగోన్నతులు వచ్చిన జీహెచ్ఎంలున్నారు. వీరికి శిక్షణ ఇవ్వలేదు. కొన్ని చోట్ల ఉపాధ్యాయుల కొరత కూడా నెలకొనడంతో అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీని ఫలితంగా విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలపై ప్రభావం పడుతోంది.

దృష్టి సారించని యంత్రాంగం

ప్రస్తుత విద్యాసంవత్సరం ఉమ్మడి జిల్లాలో విద్యాశాఖాధికారులు తొలిమెట్టుపై దృష్టిసారించలేదు. బడులు ప్రారంభమైన మూడు నెలలు గడుస్తున్నా.. చాలా పాఠశాలల్లో తొలిమెట్టు నామమాత్రంగానే అమలవుతోంది. అనేక ఆటంకాల మధ్య ఈ కార్యక్రమం కుంటినడక నడుస్తోంది. ఉపాధ్యాయుల బదిలీలతో తొలిమెట్టుకు దాదాపు బ్రేక్‌పడింది. ఉద్యోగుల పదోన్నతులతో అమలు పర్యవేక్షణ కొరవడింది. వాస్తవంగా ఈ ఏడాది తొలిమెట్టు అమలుపై ఉపాధ్యాయులకు శిక్షణే ఇవ్వలేదు. దీనితో చదవడం, రాయడం, లెక్కలు చేయడంలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించే ప్రక్రియ అటకెక్కినట్టయింది.

ప్రగతిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములే

- రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించడం అభినందనీయం
- డీసీసీ బ్యాంకు సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు


కేక్ కట్ చేస్తున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, అక్టోబరు 7 : డీసీసీ బ్యాంకు రూ. 2 వేల కోట్ల టర్నోవర్‌ను సాధించడం అభినందనీయమని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పేర్కొన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సీఈవో, మేనేజర్ల సమావేశం జరిగింది. రూ. 2 వేల కోట్ల టర్నోవర్ సాధించడాన్ని పురస్కరించుకొని రవీందర్‌రావు కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. టర్నోవర్ లక్ష్యాన్ని ముందుగానే నిర్దేశించుకొని ఆ మేరకు సాధించినట్లు వెల్లడించారు. ఈ విజయంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది, సహకార సంఘాలు, ఖాతాదారులు ఇలా ప్రతీ ఒక్కరు భాగస్వాములే అన్నారు. లక్ష్య సాధనలో ఎవరి పాత్రను వారు పోషించి బ్యాంకు పేరు ఉన్నత స్థాయికి తీసుకెళ్లారన్నారు. రుణమాఫీ పొందిన రైతులకు తిరిగి కొత్త రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు అధికారులకు సూచించారు. బ్యాంకింగ్ సేవల్లో ఎలాంటి జాప్యం ఉండరాదన్నారు. రుణమాఫీలో ఆధార్ కార్డు, ఇతరాత్ర తప్పుల సవరణలను పరిశీలించి అర్హులైన రైతులకు త్వరగా లబ్ది చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హుల జాబితాలను ప్రభుత్వానికి సమర్పించడంలో జాప్యం చేసిన సంఘాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వివిధ రకాల రుణాలు, రికవరీ, డిపాజిట్లు తదితర అంశాలపై రవీందర్‌రావు అధికారులతో సమీక్ష జరిపి దిశా, నిర్దేశం చేశారు. సమావేశంలో సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉషా, డీజీఎం అశోక్, ఏజీఎం మధు, స్రవంతి, కృష్ణమోహన్, రాజు నాయక్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ టౌన్, అక్టోబరు 7 : ప్రజా వాణికి వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్) లో బాధితుల నుంచి కలెక్టర్ ప్రావీణ్య వినతులు స్వీకరించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సోమవారం నాటి ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 79 దరఖా స్తులు వచ్చాయి. ఇందులో ఎక్కువగా వ్యవసాయ శాఖ కార్యాలయానికి 8 వినతులు రాగా హనుమకొండ ఆర్డీవో కార్యాలయానికి 7, పరకాల ఆర్డీవో కార్యాలయానికి 6, కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి 6 వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి విచారణ జరిపి వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్‌వో వై.వి గణేష్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లాత్ బ్యాగులను వినియోగించాలి

- ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు
- కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండటౌన్, అక్టోబరు 7 : పర్యావరణ హితానికి ప్రతీ ఒక్కరు క్లాత్‌బ్యాగులను వినియోగిం చాలని కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో తయారు చేసిన పర్యావరణ హిత క్లాత్ బ్యాగులను కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం కలెక్టర్ ప్రావీణ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మా ట్లాడుతూ... ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు కలుగుతుందని, అందువల్ల పర్యావరణ హితానికి క్లాత్ బ్యాగులనే వినియోగించాలన్నారు. పర్యావరణ పరిర క్షణలో భాగంగా కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ బాటిళ్ల నియం త్రణకు చర్యలు చేపట్టామని తెలిపారు. దీంతో ప్లాస్టిక్ రహిత ప్రాంగణంలో కలెక్టరేట్ ఉండేట్లు చర్యలు తీసుకుం టున్నామన్నారు. అందరు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో తగ్గించుకుని పర్యావరణ హిత బ్యాగులు, ఇతర వస్తువులనే వినియోగించాలన్నారు. పర్యావరణ హిత కోసం మెప్మా ఆధ్వర్యంలో క్లాత్ బ్యాగ్‌లను తయారుచేసి అందుబాటు ధరలలో తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్‌వో వై.వి గణేష్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

బీసీలంతా ఏకతాటిపైకి రావాలి

- ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య
- మాస్టర్జి కళాశాలలో ధూంధాం సన్నాహక సమావేశం
- బీసీ జేఏసీ చైర్మన్‌గా సుందర్‌రాజ్ ఏకగ్రీవ ఎన్నిక


సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న సారయ్య

రాంనగర్, అక్టోబరు 7 : రాజ్యాధికారం కోసం బీసీలంతా ఏకతాటిపైకి రావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలోని మాస్టర్జీ కళాశాలలో బీసీ జేఏసీ కన్వీనర్, మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ అధ్యక్షతన బీసీ ధూందాం సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో 14 మండలాలకు చెందిన బీసీ ప్రతినిధులు హాజరయ్యారు. సంగంరెడ్డి సుందర్ రాజ్‌ను బీసీ జేఏసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ.. రాజ్యాధికారం కోసం బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అగ్రవర్ణాలు బీసీలను చీల్చి వారి పీఠాలు పదిలం చేసుకుంటున్నారని ఆరోపించారు. అగ్రవర్ణాల కుట్రలు ఇప్పటికైనా అర్థం చేసుకుని ఏకం కావాలన్నారు. బీసీలకు రాజ్యాధికారం కావాలంటే కులగణన ఏకైక పరిష్కార మార్గమని సారయ్య తెలిపారు. బీసీ జేఏసీ చైర్మన్‌గా ఎన్నికైన సుందర్‌రాజ్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా బీసీ కులగణన చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు సాధించాలంటే గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీసీ సంఘాలు ఏకం కావాలన్నారు. బీసీ ఉద్యమం బలోపేతం కావాలంటే స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.

వార్డు సభ్యుడి నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ వరకు బీసీలు విజయం సాధించేలా శ్రమిద్దామన్నారు. అగ్రవర్ణాల పునాదులను గ్రామ స్థాయి నుంచి పెకిలిద్దామని సుందర్‌రాజ్ సూచించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, డా.కాశీప్రసాద్, వేణు మాధవ్‌గౌడ్, పులి రజనీకాంత్, నరేడ్ల శ్రీధర్, మునిగాల సమ్మయ్య, కావటి స్వామి, ఆకారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

"DAAVUDI" SONG HAS BEEN ADDED IN THEATERS WATCH @ENJOY

విజయవంతమైన 2వ వారం

DEVARA THANDAVAM



సుదర్శన్ 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.15,9.45

SVC సంగీత 70 - ఆర్.సి.పురం 11.00,2.30,6.00,9.30
SVC శ్రీలక్ష్మి/ఇంద్ర నాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.15,2.45,6.15,10.00
SVC ఈశ్వర్ 70 - అత్తాపూర్ 11.00,2.30,6.00,9.30
SVC శివశక్తి 70ఎంఎం - కాప్రా 11.00,2.30,6.00,9.30
శ్రీసాయిరాం 70 - మల్కాజ్‌గిరి 11.15,2.45,6.30,10.15

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 10.00,11.30,1.10,1.30,4.20,5.15,7.30,10.20,10.40 4DX: 2.20,8.10
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 9.05,10.20,12.25,12.50,3.50,4.10,6.50,7.10,10.30,10.40
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.00,11.15,2.50,6.25,7.25,10.00,11.00
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 9.00,10.05,12.35,1.00,1.40,3.30,4.10,7.05,7.25,7.45,10.40,11.00,11.20 4DX: 9.50,7.10
PVR ఆర్.కె. - బంజారాహిల్స్ 9.35,12.15,3.50,7.25,11.00
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 9.30,10.20,1.05,4.25,4.45,7.10,7.25,10.40,11.00
PVR గలేరియా - పంజాగుట్ట 9.45,10.15,12.45,1.20,4.10,4.55,7.10,7.35,10.45,11.10
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ 9.25,12.40,1.00,4.15,7.05,10.40,11.00
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 9.35,1.10,2.25,3.25,4.30,7.00,7.25,11.00 4DX: 9.40,10.00
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ 9.10,12.45,7.15,7.25,4.35,10.40,11.00
PVR ప్రెస్టేజ్ మాల్ - గచ్చిబౌలి 9.00,12.35,4.15,7.05,7.25,10.40
PVR అట్రియమ్ - గచ్చిబౌలి 10.05,12.15,1.40,3.50,4.20,7.45,10.35,11.20
PVR ప్రిస్మ్ మాల్ - గచ్చిబౌలి 9.00,12.35,4.15,7.05,7.25,11.00
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 11.15,11.55,2.50,3.30,6.25,7.05,10.00,10.40
INOX ఎం.పి మాల్ - కాచిగూడ 10.45,11.45,2.20,5.55,6.55,9.30
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ 10.45,11.15,12.15,2.20,2.50,3.50,5.55,6.25,7.25,9.30,10.00,11.00
INOX నెక్లెస్ సత్వ - కవాడిగూడ 11.15,12.05,2.50,3.40,6.25,7.15,10.00,10.50
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 10.55,11.45,2.20,3.20,5.55,6.55,9.30,10.30
సినీపోలిస్ మంజీరామాల్ - కూకట్‌పల్లి 9.30,12.45,1.15,4.10,7.35,11.00,11.20
సినీపోలిస్ సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 10.30,9.30,12.55,4.20,7.45,10.35,11.10
సినీపోలిస్ మంత్రామాల్ - అత్తాపూర్ 9.30,12.45,4.10,7.35,11.00
సినీపోలిస్ సుధా - శాలిబండ 9.50,1.05,4.30,7.55,11.20
సినీపోలిస్ డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 9.30,10.00,12.45,1.15,4.50,7.35,7.55,11.00,11.20
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 9.45,12.30,3.45,7.10,7.25,10.40
ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 10.05,1.25,4.30,7.00,7.30,10.45
సినీ ప్లానెట్ - కొంపల్లి 10.00,1.25,4.25,7.10,10.35
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 10.05,1.25,4.00,4.30,7.30,10.45
ఏషియన్ రాధిక - కాప్రా 10.15,1.00,4.15,7.30,10.30
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 10.15,1.00,4.15,7.30,10.30
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 10.05,1.25,4.30,7.30,10.45
మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 9.30,1.00,4.10,7.00,7.40,11.10
మిరాజ్ సినిమాస్ - బాలానగర్ 9.30,1.00,4.10,7.10,7.40,11.10
మిరాజ్ సినిమాస్ - చందానగర్ 9.30,1.00,4.10,7.10,7.40,11.10
సినీటౌన్ - మియాపూర్ 10.00,12.00,3.30,7.00,10.30
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 11.00,12.30,2.30,6.00,9.30,10.30
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి 9.20,12.45,4.10,7.35,11.00
మూవీటైమ్ - అమీర్‌పేట 9.00,10.30,12.15,3.30,6.45,10.00
ఎస్.ఎల్.ఎస్ - గచ్చిబౌలి 8.00,9.00,11.00,12.00,3.30,6.45,10.00
స్కై మాల్ - సనత్‌నగర్ 10.00,1.00,4.30,7.00,10.30
టివోలి - సికింద్రాబాద్ 9.00,12.20,3.50,7.20,10.50
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 11.00,1.40,4.00,7.25,9.20,10.50
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00
షా షహెన్‌షా - చింతల్ 11.15,2.15,6.15,9.30
లక్ష్మీకళ - మూసాపేట్ 11.15,2.15,6.15,9.30
మూవీమ్యాక్స్ - మౌలాలి 9.30,11.00,12.00,1.00,3.30,4.30,6.00,7.00,8.00,9.30,10.30,11.00
జె.పి.సినిమాస్ - చందానగర్ 10.05,1.15,1.25,4.30,7.30,10.45
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల 9.00,10.10,10.15,12.30,1.35,4.10,4.25,7.10,7.30,7.45,10.35,10.55,11.15

తారకరామ 70 - కాచిగూడ 11.00,2.15,6.00,9.15
వెంకటరమణ పద్మావతి - కాచిగూడ 10.30,11.30,2.15,6.00,9.45
విశ్వనాథ్ ఎ/సి - కూకట్‌పల్లి 11.15,2.45,6.15,9.45
భ్రమరాంబ ఎ/సి - కూకట్‌పల్లి 11.00,2.30,6.15,9.45
కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.30,6.00,9.30
రామకృష్ణ 35ఎంఎం - ఆబిడ్స్ 11.00,2.30,6.00,9.30
శ్రీరాములు ఎ/సి - మూసాపేట్ 11.30,2.45,6.30,10.00
మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.00,11.05,2.45,2.50,6.30,6.35,10.10,10.15
ప్రశాంత్ ఎ/సి - సికింద్రాబాద్ 10.45,2.30,6.00,9.30
తాక్కూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్ 10.45,2.00,5.45,9.15
సుష్మ 70 ఎ/సి - వనస్థలిపురం 10.45,2.15,5.45,9.15
రంగ 70ఎంఎం - జీడిమెట్ల 11.00,2.15,6.00,9.30
సెన్సేషన్ సస్పెన్స్ - ఖైరతాబాద్ 11.00,2.30,6.00,9.30
గోకుల్ 70ఎంఎం - ఎర్రగడ్డ 11.00,2.30,6.00,9.30
శ్రీదేవి ఎ/సి - చిలకలగూడ 11.00,2.30,6.00,9.30
జ్యోతి 70 ఎ/సి - ఆర్‌సిపురం 11.00,2.30,6.00,9.30
ఆరాధన 70 ఎ/సి - తార్నాక 11.00,2.15,6.00,9.15
నర్తకి 70 ఎ/సి - అల్వాల్ 10.45,2.30,6.15,10.00
వైజయంతి 70 ఎ/సి - నాచారం 10.45,2.00,5.45,9.15
సాయిరంగ 70 - మియాపూర్ 11.00,2.15,6.00,9.15
అలంకార్ (ప్రతాప్) - లంగర్‌హౌస్ 10.45,2.00,5.45,9.00
BR హైటెక్ - మాదాపూర్ 10.45,2.30,6.15,10.00
విజేత 70 ఎ/సి - బోరబండ 11.00,2.20,6.00,9.20
సూపర్ 70 ఎ/సి - బాలాపూర్ 11.00,2.30,6.00,9.30
విమల్ 70 ఎ/సి - బాలానగర్ 11.20,3.00,6.40,10.20
శ్రీకృష్ణ 70ఎంఎం - ఉప్పల్ 11.00,2.15,6.00,9.15
జగదాంబ 70ఎంఎం - ఘట్‌కేసర్ 11.20,3.00,6.40,10.20
మెట్రో 70 ఎ/సి - బహదూర్‌పుర 11.30,2.30,6.00,9.00
శ్రీసాయిపూజా 70 - సూరారం 11.15,2.45,6.00,9.15
శ్రీ ప్రేమ 70 ఎ/సి - తుక్కుగూడ 11.00,2.00,6.00,9.00
స్వప్న 70 ఎ/సి - కాటేదాన్ 11.00,2.15,6.00,9.30
శ్రీ కృష్ణ 70 ఎంఎం - అలియాబాద్ 11.00,2.00,6.00,9.00
శ్రీరమణ 70ఎంఎం - అంబర్‌పేట 10.45,2.15,5.45,9.15
సంతోష్ 70 - ఇబ్రహీంపట్నం 11.15,2.15,6.15,9.15
గణేష్ 70 ఎ/సి - శంషాబాద్ 10.45,2.15,6.00,9.45
రాఘవేంద్ర 70 - బీబీనగర్ 11.30,2.30,6.30,9.30
వెంకటేశ్వర 70 - గుమ్మడిదల 11.00,2.00,6.00,9.00
ముకుంద్ 70 - మేడ్చల్ 11.00,2.30,6.00,9.30

హిందీ వర్షన్
వెంకటరమణపద్మావతి - కాచిగూడ 6.30,10.15
రామకృష్ణ 70 - ఆబిడ్స్ 11.15,2.30,6.00,9.15
సెన్సేషన్ సస్పెన్స్ 70 - ఖైరతాబాద్ 3.00pm
సాయిరాజ - ముషీరాబాద్ 11.00,2.30,6.00,9.30
PVR పివిఆర్ - ముసారాంబాగ్ 4.20pm
INOX నెక్లెస్ సత్వ - కవాడిగూడ 10.40,6.10
INOX ఎం.పి మాల్ - కాచిగూడ 3.20,10.30
సినీపోలిస్ మంత్రామాల్ - అత్తాపూర్ 9.45,1.00,4.25,7.50,11.15
సుధా - శాలిబండ 9.45,1.00,4.25,7.50,11.15
మూవీటైమ్ - అమీర్‌పేట 4.00pm
ఎస్.ఎల్.ఎస్ - గచ్చిబౌలి 4.30pm

"DAAVUDI" SONG HAS BEEN ADDED IN THEATERS WATCH @ENJOY

విజయవంతమైన 2వ వారం



వరంగల్
రాధిక ఎ/సి - వరంగల్
జెమిని కాంప్లెక్స్ - వరంగల్
ఎస్2 ఎ/సి - వరంగల్
అమృత 70 - హన్మకొండ
శ్రీదేవి - హన్మకొండ
SVC సూర్య క.మం. - మహబూబాబాద్
SVC దేవి 70 - జనగాం
భవాని 70 - కాజీపేట్
జయశ్రీ - నర్సంపేట్
ఊర్వశి - భూపాలపల్లి
రామకృష్ణ - తొర్రూర్
లక్ష్మి ఎ/సి - మరిపెడ
తిరుమల ఎ/సి - ములుగు
విబికె మూవీమ్యాక్స్ - చేర్యాల
సూర్య క.మం. - నెక్కొండ
తిరుమల 70 - పాలకుర్తి
నారాయణ 70 - హసన్‌పర్తి
మహాలక్ష్మి - స్టేషన్‌ఘన్‌పూర్
మోహన్ ఎ/సి - కె.సముద్రం
జయ డీలక్స్ - పరకాల
భారతీయ - వర్ధన్నపేట్
వెంకటేశ్వర - ఏటూరినగరం

ఖమ్మం
SVC శ్రీతిరుమల - ఖమ్మం
SVC పూర్ణ - కొత్తగూడెం
ఉదయ్‌భాస్కర్ - భద్రాచలం
సాయిబాలాజీ - సత్తుపల్లి
వెంకటేశ్వర - పాల్వంచ
సత్యభాస్కర్ - మణుగూరు
కళాంజలి - ఇల్లందు
లక్ష్మీశ్రీనివాస 70 - మధిర
లక్ష్మీశ్రీనివాస - అశ్వరావుపేట
రఘు పి.పా - చెర్ల
వాసవి 70 - వైరా
బాలాజీ - దమ్మపేట్
శ్రీదుర్గ 70 - బోనకల్
వెంకటరమణ - తల్లాడ
లక్ష్మి సినీప్లెక్స్ - కల్లూరు
సాయిబాలాజీ - నేలకొండపల్లి

కరీంనగర్
మమత - కరీంనగర్
SVC ప్రతిమ - కరీంనగర్
శ్రీనివాస - కరీంనగర్
శ్రీనివాస - గోదావరిఖని
బాలాజీ - జగిత్యాల
విమల్ ఎ/సి - సిరిసిల్ల
సంగీత ఎ/సి - పెద్దపల్లి
లక్ష్మి ఎ/సి - కోరుట్ల
శ్రీరామ సినిమాస్ - సుల్తానాబాద్
SR శ్రీనివాస - మంథని
లక్ష్మి 70ఎంఎం - మెట్‌పల్లి
అన్నపూర్ణ - హుజూరాబాద్
అన్నపూర్ణ 70 - జమ్మికుంట

శివరామకృష్ణ - వేములవాడ
VKM మూవీమ్యాక్స్ - హుస్నాబాద్
శ్రీనివాస - చొప్పదండి
రాజశ్రీ సినిమా - రాయికల్

నిజామాబాద్
లలిత మహల్ - నిజామాబాద్
గీత - నిజామాబాద్
వేణు - నిజామాబాద్
సినిమాస్ - ఆర్మూర్
వి.శాంతి - కామారెడ్డి
వెంకటేశ్వర - బోధన్
మహేశ్వరి - బాన్సువాడ
బృందావన్ - ఆర్మూర్
పరమేశ్వర - బిచుకుంద
సుదర్శన్ - భీంగల్
వెంకటేశ్వర - పిట్లం
లక్ష్మి 70 - ఎల్లారెడ్డి
వెంకటేశ్వర - దర్పల్లి
కృష్ణ టాకీస్ - నందిపేట
రాంప్రతాప్ - నాగిరెడ్డిపేట్

మహబూబ్‌నగర్
తిరుమల - మహబూబ్‌నగర్
వెంకటేశ్వర - మహబూబ్‌నగర్
SVC రామకృష్ణ - షాద్‌నగర్
శ్రీనివాస 70 - వనపర్తి
SVC మల్టీప్లెక్స్ - గద్వాల్
మనోహర్ - నారాయణపేట్
శ్రీనివాస 70 - జడ్చర్ల
శ్రీసాయిరాం - అచ్చంపేట్
రవి 70 - నాగర్‌కర్నూలు
పరమేశ్వరి - కొత్తకోట
పార్థసారథి - కల్వకుర్తి
శివసాయి ఎ/సి - ఐజా
వెంకటరామ - మక్తల్
వెంకటేశ్వర - పెబ్బేరు
వెంకటేశ్వర - కొల్లాపూర్
రాఘవేంద్ర - దేవరకద్ర
SVC వెంకటేశ్వర - ఆమనగల్
శ్రీనివాస - కడ్తాల్
వనయాంబ - ముక్తిపాడ్

నల్గొండ
SVC నటరాజ్ - నల్గొండ
రాఘవ - మిర్యాలగూడ
విట్రోస్ సినీప్లెక్స్ - మిర్యాలగూడ
శ్రీనివాస - కోదాడ
GHR కాంప్లెక్స్ - కోదాడ
విష్ణురాం సినిమాస్ - కోదాడ
సత్య ఎ/సి - సూర్యాపేట
తిరుమల - సూర్యాపేట
వసుంధర - భువనగిరి
వెంకటేశ్వర - నకిరేకల్
సాయిబాబా - హుజూర్‌నగర్
మనోజ్ - దేవరకొండ

శ్రీనివాస - చౌటుప్పల్
అచ్చిరెడ్డి 70 - హాలియా
వెంకటేశ్వర - తిరుమలగిరి
సుజన 70 - చిట్యాల
వెంకటేశ్వర - వలిగొండ
లక్ష్మి - యాదగిరిగుట్ట
లక్ష్మి 70ఎంఎం - మాల్
వెంకటరమణ - నేరేడుచర్ల
MRR సాయిరాం - పోచంపల్లి
సత్యనారాయణ - చండూర్
పద్మావతి పి.పా - దామరచర్ల
తారా సినిమా - మోత్కూర్

ఆదిలాబాద్
నటరాజ్ - ఆదిలాబాద్
SVC జెమిని - మంచిర్యాల
శ్రీనివాస - మంచిర్యాల
తిరుమల - నిర్మల్
బాలాజీ - బెల్లంపల్లి
మహానంది - లక్సెట్టిపేట
రాఘవేంద్ర - జైన్నూరం
శ్రీనివాస్ - చెన్నూర్
పిక్చర్‌హౌస్ - ఆసిఫాబాద్

మెదక్
సినీమ్యాక్స్ 70 - మెదక్
బాలాజీ - సిద్దిపేట
సితార 70 - సంగారెడ్డి
మహేశ్వరి - సదాశివపేట్
మహేశ్వరి - జహీరాబాద్
సంతోష్ ఎ/సి - గజ్వేల్
సాయి డీలక్స్ - నర్సాపూర్
వెంకటేశ్వర - నారాయణఖేడ్
వెంకటేశ్వర - తూప్రాన్
శ్రీనివాస ఎ/సి - దుబ్బాక

రంగారెడ్డి
SVC తిరుమల - తాండూరు
సినీమ్యాక్స్ - వికారాబాద్
శ్రీ భవాని - పరిగి
వెంకటేశ్వర - చేవెళ్ళ
సాయిబాబా 70 - శంకర్‌పల్లి

రాయచూర్
పద్మనాభ - రాయచూర్
మిరజ్ సినిమాస్ - రాయచూర్
చంద్రహాస్ - గంగావతి
కూడలి సంగమేశ్వర - సింధనూర్
శివే 70 ఎ/సి - కొప్పల్
లక్ష్మి 70ఎంఎం - కర్టగి
లక్ష్మి పి.పా - దేశాయిక్యాంప్
భరత్ ఎ/సి - దేవదుర్గ్
విజయ్ ఎ/సి - మస్కి
మారుతి ఎ/సి - కుస్టిగి
అపర్ణ 70 - మాన్వి
ఎంపైర్ థియేటర్ - లింగసూర్

విజయదశమి శుభాకాంక్షలతో
ఈనెల 10న బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

మల్లిఖార్జున - కూకట్‌పల్లి (ఒక రోజు మాత్రమే)
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్
ఇంద్ర నాగేంద్ర కాంప్లెక్స్ - కర్మన్‌ఘాట్
తారకరామ ఎ/సి - కాచిగూడ
అర్జున్ 70ఎంఎం - కూకట్‌పల్లి
శ్రీసాయిరాం 70 - మల్కాజ్‌గిరి
SVC శ్రీలక్ష్మి 70 - కర్మన్‌ఘాట్
మహాలక్ష్మి ఎ/సి - కొత్తపేట

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి
PVR ఆర్.కె. - బంజారాహిల్స్
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
PVR గలేరియా - పంజాగుట్ట
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్
PVR ప్రెస్టేజ్ మాల్ - గచ్చిబౌలి
PVR అట్రియమ్ - గచ్చిబౌలి
PVR ప్రిస్మ్ మాల్ - గచ్చిబౌలి
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్
INOX ఎం.పి మాల్ - కాచిగూడ
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ
INOX నెక్లెస్ సత్వ - కవాడిగూడ
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి
మంత్రామాల్ - అత్తాపూర్
సుధా - శాలిబండ
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
సినీ ప్లానెట్ - కొంపల్లి
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఏషియన్ రాధిక - కాప్రా
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
మిరాజ్ సినిమాస్ - బాలానగర్
మిరాజ్ సినిమాస్ - చందానగర్
సినీటౌన్ - మియాపూర్
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
మూవీటైమ్ - అమీర్‌పేట
ఎస్.ఎల్.ఎస్ - గచ్చిబౌలి
స్కై మాల్ - సనత్‌నగర్
టివోలి - సికింద్రాబాద్
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
షా షహెన్‌షా - చింతల్
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
మూవీమ్యాక్స్ - మౌలాలి
జె.పి.సినిమాస్ - చందానగర్
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల

మెగా 70 - దిల్‌సుఖ్‌నగర్
వెంకటరమణ పద్మావతి - కాచిగూడ
రామకృష్ణ 35 ఎ/సి - ఆబిడ్స్
తాక్కూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్
సంపూర్ణ 70 - వనస్థలిపురం
భుజంగ 70 ఎ/సి - జీడిమెట్ల
రాజ్యలక్ష్మి 70 ఎ/సి - ఉప్పల్
శ్రీలక్ష్మి క.మం 70 - అల్వాల్
శ్రీసాయిపూజా 70 - సూరారం
స్వప్న కాంప్లెక్స్ ఎ/సి - కాటేదాన్
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట
లక్ష్మి 70ఎంఎం - శంషాబాద్

GLOBAL CINEMAS RELEASE

విజయదశమి శుభాకాంక్షలతో
ఈనెల 12న బ్రహ్మాండమైన విడుదల



దేవి 70ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

భ్రమరాంబ/మల్లిఖార్జున కాంప్లెక్స్ - కూకట్‌పల్లి
మెగా 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి
PVR ఆర్.కె. - బంజారాహిల్స్
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
PVR గలేరియా - పంజాగుట్ట
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్
PVR ప్రెస్టేజ్ మాల్ - గచ్చిబౌలి
PVR అట్రియమ్ - గచ్చిబౌలి
PVR ఎస్2 సోమ - మల్లాపూర్
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్
INOX ఎం.పి మాల్ - కాచిగూడ
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ
INOX నెక్లెస్ సత్వ - కవాడిగూడ
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి
మంత్రామాల్ - అత్తాపూర్
సుధా - శాలిబండ
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
సినీ ప్లానెట్ - కొంపల్లి
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఏషియన్ రాధిక - కాప్రా
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
మిరాజ్ సినిమాస్ - బాలానగర్
మిరాజ్ సినిమాస్ - చందానగర్
సినీటౌన్ - మియాపూర్
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
మూవీటైమ్ - అమీర్‌పేట
ఎస్.ఎల్.ఎస్ - గచ్చిబౌలి
స్కై మాల్ - సనత్‌నగర్
టివోలి - సికింద్రాబాద్
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
షా షహెన్‌షా - చింతల్
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
మూవీమ్యాక్స్ - మౌలాలి
జె.పి.సినిమాస్ - చందానగర్
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల

జెమిని కాంప్లెక్స్ - వరంగల్
వినోద 70 ఎంఎం - ఖమ్మం
SVC ప్రతిమ - కరీంనగర్
రాజా డీలక్స్ - కరీంనగర్
తిరుమల - మహబూబ్‌నగర్
వేణుమాల్ - నిజామాబాద్
తిరుమల - సూర్యాపేట
శ్రీదేవి 70 - హన్మకొండ
విష్ణురాం సినిమాస్ - కోదాడ
విట్రోస్ సినీప్లెక్స్ - మిర్యాలగూడ
SVC జెమిని - మంచిర్యాల
SVC మల్టీప్లెక్స్ - గద్వాల్
PVR సినిమాస్ - ఆర్మూరు
మిరజ్ సినిమాస్ - రాయచూర్
మరియు మీ అభిమాన థియేటర్లలో

విజయదశమి శుభాకాంక్షలతో
ఈనెల 11న బ్రహ్మాండమైన విడుదల



ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి
PVR ఆర్.కె. - బంజారాహిల్స్
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
PVR గలేరియా - పంజాగుట్ట
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్
PVR ప్రెస్టేజ్ మాల్ - గచ్చిబౌలి
PVR అట్రియమ్ - గచ్చిబౌలి
PVR ప్రిస్మ్ మాల్ - గచ్చిబౌలి
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్
INOX ఎం.పి మాల్ - కాచిగూడ
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ
INOX నెక్లెస్ సత్వ - కవాడిగూడ
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి
మంత్రామాల్ - అత్తాపూర్
సుధా - శాలిబండ
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
సినీ ప్లానెట్ - కొంపల్లి
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఏషియన్ రాధిక - కాప్రా
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
మిరాజ్ సినిమాస్ - బాలానగర్
మిరాజ్ సినిమాస్ - చందానగర్
సినీటౌన్ - మియాపూర్
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
మూవీటైమ్ - అమీర్‌పేట
ఎస్.ఎల్.ఎస్ - గచ్చిబౌలి
స్కై మాల్ - సనత్‌నగర్
టివోలి - సికింద్రాబాద్
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
షా షహెన్‌షా - చింతల్
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
మూవీమ్యాక్స్ - మౌలాలి
జె.పి.సినిమాస్ - చందానగర్
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల

జెమిని కాంప్లెక్స్ - వరంగల్
శ్రీదేవి - హన్మకొండ
కృష్ణ క.మం - జనగాం
సాయిరాం - ఖమ్మం
సాయికృష్ణ - కరీంనగర్
SVC ప్రతిమ - కరీంనగర్
శ్రీనివాస - కరీంనగర్
దుర్గ 70 - జగిత్యాల
ఎస్ఆర్ శ్రీనివాస - మంథని
శ్రీరామ్ శ్రీనివాస - సుల్తానాబాద్
నటరాజ్ 70 - నిజామాబాద్
గీత - నిజామాబాద్
వేణు - నిజామాబాద్
సినిమాస్ - ఆర్మూర్
బృందావన్ 70 - ఆర్మూర్
ప్రియా 70 - కామారెడ్డి
తిరుమల - మహబూబ్‌నగర్
SVC జెమిని - మంచిర్యాల
SVC మల్టీప్లెక్స్ - గద్వాల్
పరమేశ్వరి - షాద్‌నగర్
హరిహర - జమ్మికుంట
వెంకటరమణ - జడ్చర్ల
భువనేశ్వరి 70 - ఐజా
సీతారామ 70 - ఇల్లందు
వెంకటేశ్వర - మిర్యాలగూడ
విట్రోస్ సినీప్లెక్స్ - మిర్యాలగూడ
విష్ణురాం సినిమాస్ - కోదాడ
తిరుమల - సూర్యాపేట
మిరజ్ సినిమాస్ - రాయచూర్
మరియు మీ అభిమాన థియేటర్లలో

SUPER HIT నేడే చూడండి



సంధ్య 35ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.00

PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.00am
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 1.40pm
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 10.10am
PVR పివిఆర్ - ముసారాంబాగ్ 10.35am
INOX జిఎస్ఎమ్ - మదీనాగూడ 4.35pm
INOX నెక్లెస్ సత్వ - కావాడిగూడ 9.45pm
ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 7.20pm
ఏషియన్ సినీ ప్లానెట్ - కొంపల్లి 4.35pm
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 7.20pm
ఏషియన్ రాధిక - కాప్రా 10.45am
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 2.00pm
మీరజ్ సినిమాస్ - బాలానగర్ 1.10pm
మీరజ్ సినిమాస్ - చందానగర్ 10.20am
టివోలి - సికింద్రాబాద్ 4.35pm
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 6.25pm
జె.పి.సినిమాస్ - చందానగర్ 10.30pm

PVR ఎస్2 - వరంగల్
శ్రీదేవి - హన్మకొండ
శ్రీనివాస - కరీంనగర్
గీతా - నిజామాబాద్
వేణుమాల్ - నిజామాబాద్
పివిఎస్ 70 - నల్గొండ
GHR కాంప్లెక్స్ - కోదాడ
PVR సినిమాస్ - ఆర్మూర్
తిరుమల - మహబూబ్‌నగర్
సాయికృష్ణ - కరీంనగర్
తిరుమల - మహబూబ్‌నగర్
అలంకార్ - సూర్యాపేట్
దుర్గ క.మం - జగిత్యాల
సాయికృష్ణ - మెట్‌పల్లి
ముకుంద్ - మహబూబాబాద్
మహేశ్వరి కాంప్లెక్స్ - నారాయణపేట్
నేషనల్ థియేటర్ - కల్వకుర్తి
శ్రీదేవి 70 - కొత్తకోట
శ్రీరమణ 35 - నాగర్‌కర్నూల్
భువనేశ్వరి 70 - ఐజా
పూర్ణిమ - రాయచూర్
కనకదుర్గ - గంగావతి

BGM STUDIO RELEASE

వంద కొట్టు.. పొట్టేలు పట్టు


అప్పల్‌రావుపేటలో దసరా లక్కీ ధమాకా



దసరా అంటనే మాంసం, మద్యం ప్రియులకు ఎంతో ప్రియమైన పండుగ. ఇలాంటి సమయంలో విజయదశమి కానుక లంటూ నెక్కొండ మండలంలోని అప్పల్‌రావుపేట గ్రామంలో పంచుతున్న కరపత్రాలు చర్చనీయాంశమయ్యాయి. రూ.100తో ఇచ్చి కూపన్ తీసుకుని లక్కీడ్రాలో గొర్రెపోతు గెలుచుకోవచ్చని, కానీ 250 కూపన్లు మాత్రమే ఉన్నాయని కొందరు వ్యక్తులు ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడిది సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మొదటి బహుమతి పొట్టేలు కాగా మద్యం, శీతల పానీయాలు, వంట నూనె ప్యాకెట్లు, గోధుమపిండి తదితర పలురకాల వస్తువులు మొత్తం 20 బహుమతులున్నట్టు కరపత్రాల్లో పేర్కొన్నారు. పండుగ ముందు రోజు ఈ నెల 11 న లక్కీడ్రా తీయనున్నట్టు ప్రకటించడంతో అప్పల్‌రావుపేట పరిసర గ్రామాల ప్రజలు కూపన్ల కోసం ఎగబడుతున్నారు.

- నెక్కొండ

ఆరునెలలవుతున్నా.. అందలే..



- బెనిఫిట్స్ కోసం రిటైర్డ్ ఉద్యోగుల ఎదురుచూపు
- ఉమ్మడి జిల్లాలో గత ఆరు నెలల్లో 437 మంది పదవీ విరమణ
- పెన్షన్ మంజూరుతోనే సరిపెడుతున్న సర్కారు
- రూ.30లక్షల నుంచి రూ.70లక్షల వరకు రావలసి ఉన్న బెనిఫిట్స్
- అధికారులు ఫైళ్లు పంపుతున్నా క్లియర్ చేయని ఫైనాన్స్ డిపార్టుమెంట్
- ఆర్థిక ఇబ్బందులతో రిటైర్డ్ ఉద్యోగులు సతమతం

హనుమకొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ పొందిన ఉద్యోగి దంపతులను ఘనంగా సత్కరించి.. వారికి రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్లలో కొన్నింటిని అదే రోజు చెల్లించి దర్జాగా సాగనంపుతారు. ఇది నిన్నటి మాట. ఇప్పుడా పరిస్థితి లేదు. ఆయా ప్రభుత్వ శాఖల్లో రిటైర్ అయిన ఉద్యోగుల దంపతులకు సన్మానాలు చేసి.. ఉత్తి చేతులతో సాగనంపుతున్నారు. అలా ఉమ్మడి జిల్లాలో సుమారు 437మంది రిటైర్డ్ ఉద్యోగులు తాము పదవీవిరమణ చేసి ఆరు నెలలవుతున్నా ప్రయోజనాల నుంచి ఒక్క పైసా కూడా అందక ట్రెజరీ, ఫైనాన్స్ డిపార్టుమెంట్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఈ ఏడాది మార్చి ఆగస్టు మధ్య కాలంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగుల దయనీయ పరిస్థితి ఇది. వారికి ఇప్పటి వరకు బెనిఫిట్స్ ఏవీ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రిటైర్మెంట్ కాగానే ఆ వచ్చిన డబ్బుతో తమ కుటుంబ అవసరాలను తీర్చుకోవాలని, పోగా విగిలిన మొత్తంతో శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలనుకునే వారు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వారికి పెన్షన్ మంజూరు చేసి చేతులు దులుపుకొంటోంది. రిటైర్ అయిన ఉద్యోగికి గ్రాట్యుటీ, వేతనం నుంచి నెల నెలా దాచుకున్న జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) డబ్బు చెల్లించడం లేదు. అలాగే గ్రూప్ ఇన్సూరెన్స్ (జీఎల్ఐ), కమ్యుటేషన్, సరెండర్ లీవులు తదితర రూపేణా ఇవ్వాల్సింది కూడా ఇప్పటి వరకు చెల్లించలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా 4 డీఏల మొత్తం ఉద్యోగులకు బకాయి ఉంది. ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులకు ఎలాగూ ఇవ్వడం లేదు. కనీసం పదవీ విరమణ పొందిన వారికైనా సకాలంలో చెల్లిస్తే అయినా కొంత మేరకైనా వారికి ఉపశమనంగా ఉండేది. అదీ లేదు. కొత్త ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందు వల్ల రిటైర్ అయిన ఉద్యోగులకు సకాలంలో బెనిఫిట్స్ చెల్లించలేకపోతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కాకపోతే అన్నీ ఒక సారి కాకపోయినా విడతల వారీగా అయినా చెల్లించాలి కదా రిటైర్ అయిన ఉద్యోగులు వాపోతున్నారు.

437 మంది రిటైర్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రిటైర్మెంట్ వయసును మూడేళ్ల క్రితం 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచింది. ఆ గడువు ఈ ఏడాది మార్చితో ముగిసింది. అప్పటి నుంచి ప్రతీ నెల ఉమ్మడి వరంగల్ జిల్లాలో గరిష్ఠంగా 60 నుంచి 70 మంది వరకు రిటైర్ అవుతూవస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు, పంచాయతీరాజ్ ఉద్యోగులున్నారు. సాధారణంగా రిటైర్ అయిన ఉద్యోగులు పనిచేసిన కాలంలో జమ చేసుకున్న జీపీఎఫ్‌తో పాటు ఇతర ప్రయోజనాలు అన్నింటిని కలిపి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను ప్రభుత్వం అందజేస్తుంది. ఉద్యోగి రిటైర్‌మెంట్ గడువు సమీపిస్తున్న సమయంలో వారికి సంబంధించిన అన్ని వివరాలను సేకరించి వాటి ఆధారంగా రిటైర్‌మెంట్ తర్వాత వారం పది రోజులు, గరిష్ఠంగా నెల రోజుల వ్యవధిలో అన్ని ప్రయోజనాలను అందచేస్తూ వచ్చేది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రిటైర్‌మెంట్ అయిన ఉద్యోగులకు ఏడు నెలలు గడిచినా బెనిఫిట్స్ మంజూరు చేయడం లేదు. దీంతో వారు, వారి కుటుంబాల అవస్థలు పడుతున్నారు. రిటైర్ అయ్యాక వచ్చే మొత్తాన్ని లెక్కలేసుకొని పిల్లల వివాహాలు, ఇంటి నిర్మాణం, తదితర అవసరాల కోసం ప్రణాళికలు రూపొందిచుకున్న వారు సొమ్ము చేతికి అందుతుందన్న భరోసాతో అప్పులు చేసి కార్యాలను గట్టెక్కించుకున్నవారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఉమ్మడి జిల్లాలో గత ఆరునెలల్లో పదవీవిరమణ పొందినవారి సంఖ్య
హనుమకొండ : 110
వరంగల్ : 90
జనగామ : 75
మహబూబాబాద్ : 80
ములుగు : 40
జయశంకర్ భూపాలపల్లి : 42
మొత్తం : 437

సంబంధిత శాఖలకు ఫైళ్లు వెళ్తున్నా..

పదవీ విరమణ చేసిన ఉద్యోగికి సంబంధించిన అన్ని రకాల బెనిఫిట్స్‌పై ఆయా శాఖలు ఫైళ్లు తయారు చేసి ఆర్థిక శాఖకు పంపుతాయి. అక్కడ ఒకే చేస్తే ట్రెజరీ నుంచి సంబంధిత రిటైర్డ్ ఉద్యోగి బ్యాంకు అకౌంట్‌లో సొమ్ము జమ అవుతుంది. ఆయా శాఖలు రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ ఫైళ్లు సకాలంలో పంపిస్తున్నా వాటిని ఫైనాన్స్ డిపార్టుమెంట్ క్లియర్ చేయడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. దీంతో రిటైర్డ్ ఉద్యోగులు ట్రెజరీలు, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ చుట్టూ కాళ్లరిగేలా తిరుతున్నారు. ఫైనాన్స్ నుంచి అప్రూవల్ ఇస్తే ఖాతాల్లో డబ్బులు వేస్తామని ట్రెజరీ వాళ్లు, సర్కార్ ఫండ్స్ ఇస్తే అప్రూవ్ ఇస్తామని ఫైనాన్స్ వాళ్లు చెప్పి తిప్పి పంపుతున్నారు. రిటైర్ అయిన ఉద్యోగులకు పెన్షన్ ఒక్కటీ మంజూరు చేయమని మాత్రమే ఆదేశాలు వచ్చాయనీ, మిగతా బెనిఫిట్స్ విషయంలో తమకు ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని ట్రెజరీ అధికారులు చెబుతున్నారు.

వడ్డీ నష్టం.. అదే భారం..

విరమణ చెందిన ఉద్యోగికి గ్రాచ్యుటీ, వేతనం నుంచి ప్రతి నెలా ప్రభుత్వం వద్ద పొదుపు చేసుకున్న జనరల్ ప్రావిడెంట్ ఫండ్, గ్రూప్ ఇన్సూరెన్స్, కమ్యూటేషన్, సరెండర్ లీవులు తదితర రూపేణా ఇవ్వాల్సి ప్రయోజనాల సొమ్ము ఏక మొత్తంలో విరమణ చెందిన ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఎంత చిన్న ప్రభుత్వ ఉద్యోగికి అయినా కనీసం రూ.35 లక్షల నుంచి రూ.70లక్షల వరకు పెన్షన్ బెనిఫిట్స్ ప్రభుత్వం చెల్లించాల్సి వస్తుంది. వీటిని చెల్లించడంలో ఆలసమైనా వడ్డీ ఏమైనా ఇస్తుందా అంటే అలాంటిదేమి లేదు. విరమణ పొందిన ఉద్యోగి ఆరు నెలల కాలానికి తన బెనిఫిట్స్‌కు సంబంధించి ఒక రకంగా బ్యాంకు వడ్డీ చొప్పున లెక్క గట్టినా రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు నష్టపోయినట్టే. ఈ ఏడు నెలల కాలంలో విరమణ చెందిన అధికారులు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి ఉమ్మది వరంగల్ జిల్లాలో వివిధ రకాల చెల్లింపులు, బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక కొందరు బయట తెచ్చిన అప్పులకు వడ్డీ భారం పెరుగుతోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిటైర్ అయిన ఉద్యోగులతో పాటు సర్వీసు పూర్తవబోతున్న ఏ ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులు కలిసినా ఇదే చర్చ జరుగుతోంది. చేసిన అప్పులు ఓ వైపు.. వాటికి పెరిగిపోతున్న వడ్డీలు మరో వైపు తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. ప్రభుత్వం వ్యవహార శైలి చూస్తే ఇబ్బందికరంగా ఉందని, ఇలాంటి పరిస్థితి కొనసాగితే వృద్ధాప్యంలో ఎలా బతకాలి? అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రయోజనాల కోసం అందని పలువురు పెన్షనర్లు సంఘాల నేతలను ఆశ్రయిస్తున్నారు. ప్రయోజనాలు త్వరగా వచ్చేలా చూడాలని కోరుతున్నారు. ఈ పరిణామాలతో పదవీ విరమణ పొందడానికి సిద్ధంగా ఉన్న ఉద్యోగుల్లోనూ ఆందోళన నెలకొంటున్నది.

ఫీజులు చెల్లించకపోతే ప్రైవేట్ కళాశాలలను బంద్ చేస్తాం

రిజిస్ట్రార్, కలెక్టర్‌కు ప్రైవేట్ యాజమాన్యాల నోటీసులు



రిజిస్ట్రార్‌కు నోటీస్ ఇస్తున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల బాధ్యులు

కేయూ క్యాంపస్, అక్టోబరు 7 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు నిరవధిక బంద్ పాటిస్తూ పోరు బాటకు సిద్ధమైయ్యారు. ఈ మేరకు సోమవారం పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు ప్రావీణ్యకు, సత్య శారదలకు వేర్వేరుగా అందచేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ కళాశాల యాజమాన్యాల నేతలు మాట్లాడుతూ.. గత 3ఏళ్ళ నుంచి విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీ యింబర్స్‌మెంట్ ఉపకార వేతాలను విడుదల చేయకపోవడంతో కళాశాల అధ్యాపకుల వేతనాలు, కళాశాల నిర్వహణ, అద్దెల చెల్లింపులకు ఇబ్బందిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయంలో గతంలో సీఎం రేవంత్‌రెడ్డికి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు ఇతర ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్ళినట్లు వివరించారు. అయినా ప్రైవేట్ కళాశాల పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఉపకార వేతనాల విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని ధ్వజమెత్తారు. తమ ఫీజులు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1200 ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలను దసరా పర్వదినం తర్వాత మూకుమ్మడిగా మూసి వేసి నిరసన చేపట్టనున్నట్లు టీపీడీఎంఏ (తెలంగాణ ప్రైవేటు డిగ్రీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) సంఘం నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ పీఎంఏ (ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) బాధ్యులు వేణుమాధవ్, గోలి వెంకట్, టీపీడీఎంఏ సభ్యులు జే.శ్రీధర్‌రావు, రవీందర్, విద్యాసాగర్, కృష్ణమోహన్, సదానందంతో పాటు అన్ని కళాశాల యాజమాన్యాల బాధ్యులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ప్రారంభం

పోటీలను ప్రారంభించిన స్పోర్ట్స్ ఓఎస్‌డీ రవీందర్ రెడ్డి

కొత్తక్రీడా పాలసీ తెచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని వెల్లడి



స్పోర్ట్స్ ఓఎస్‌డీ రవీందర్ రెడ్డి సన్మానిస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 7 : హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ సింథటిక్ ట్రాక్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. సీఎం పేషి స్పోర్ట్స్ ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. తొలుత క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీ తెచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని వెల్లడించారు. వివిధ క్రీడల్లో ప్రతిభ ఉన్న గ్రామీణస్థాయి యువతను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దాలన్నది సీఎం సంకల్పమని స్పష్టం చేశారు. లక్ష్యానికి అనుగుణంగా అత్యుత్తమ విధానాలను క్రీడాపాలసీలో పొందుపరిచేలా చర్యలు చేపట్టేలా సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాలు ఇప్పటికే నిర్వహించామన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అనుసరించాల్సిన విధానాన్ని స్పోర్ట్స్ పాలసీలో పొందుపరిచేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే సలహాలు, సూచనలు చేయడం జరిగిందన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సారంగపాణి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో 33 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. అండర్-14, 16, 18, 20 బాలబాలికల వివిధ విభాగాలలో పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఇక్కడ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అథ్లెట్‌లను ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ఒడిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అనంతరం గత నెల సెప్టెంబర్‌లో చెన్నయ్‌లో నిర్వహించిన సౌత్ ఏషియన్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని 800 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం సాధించిన బి. వినోద్‌కుమార్‌ను, 3వేల పరుగు పందెంలో ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించిన మరో క్రీడాకారుడు మోహిత్‌చౌదరిని అథ్లెటిక్స్ అసోసిమేషన్ పక్షాన ఒక్కో క్రీడాకారుణికి రూ. 15వేల చొప్పున అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో జి. అశోక్‌కుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు, సభ్యులు పగడాల వెంకటేశ్వర్లు, మురళీధర్, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



100మీటర్ల పరుగు పందెంలో పోటీ పడుతున్న క్రీడాకారులు

ఉత్సాహంగా తొలిరోజు పోటీలు

తొలిరోజు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో క్రీడాకారులు చిరుతల్లా పరుగుతీస్తూ నువ్వా నేనా అన్నట్లుగా తలపడ్డారు. ఏటీసీ ట్రైయాథ్లిన్, 60, 600 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో హ్యామర్ త్రో పోటీల్లో సుమారు 1000 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

అండర్-16 బాలుర జావెలిన్ విభాగంలో..

ఎన్. శ్రీకాంత్ (మెదక్) ప్రథమ స్థానం, ఆర్. వంశీ (అసిఫాబాద్) ద్వితీయ స్థానం, పి. సతీష్‌కుమార్ (అదిలాబాద్) తృతీయ స్థానంలో నిలిచారు.

అండర్-16 బాలుర లాంగ్ జంప్ విభాగంలో....

జి. రాజేష్ (రంగారెడ్డి) ప్రథమ స్థానం, కె. ఉదయ్‌కిరణ్ (రంగారెడ్డి) ద్వితీయ స్థానం, కె. ఆనంద్ (కామారెడ్డి) తృతీయస్థానం.

అండర్ -18 బాలికల షాట్‌పుట్ విభాగంలో ..

కె. రాజరాజేశ్వరి (నాగర్ కర్నూల్) ప్రథమ స్థానం, జి. శ్రీరెడ్డి (రంగారెడ్డి) ద్వితీయస్థానం, ఎం.అక్షయ సిందూ (నల్గొండ) తృతీయ స్థానం .

అండర్ -18 బాలికల 1000 మీటర్లు పరుగుపందెం..

ఎ. అఖిల (నల్గొండ) ప్రథమస్థానం, కె. స్వప్న (నాగర్ కర్నూల్) ద్వితీయస్థానం, గౌనిప్రియా (రంగారెడ్డి) తృతీయస్థానం,

అండర్ -18 బాలుర డిస్కస్ త్రో ..

జి. సునిత్‌కుమార్ (జనగాం) ప్రథమ స్థానం, పి. గౌతం (కామారెడ్డి) ద్వితీయ స్థానం, జి. వరుణ్‌గౌడ్ (నిర్మల్) ద్వితీయ స్థానం.

అండర్ -18 బాలుర హై జంప్‌లో..

జి. సిద్ధి వినయ్ (భద్రాద్రి కొత్తగూడెం) ప్రథమ, పి. వెంకటేశ్వర్‌రావు (భద్రాద్రి కొత్తగూడెం) ద్వితీయ స్థానం, బి.విష్ణు (మంచిర్యాల) తృతీయ స్థానం .

అండర్ -18 బాలుర 5000 మీటర్ల రేస్ వార్‌లో ..

ఎండ్ల సాయిచరణ్‌రెడ్డి (నిజామాబాద్)ప్రథమ స్థానం, ఎ. జశ్వంత్ (ఆదిలాబాద్)ద్వితీయస్థానం, చంద్ర సిద్ధార్థ (ఆదిలాబాద్) తృతీయస్థానం.

అండర్ -20 బాలుర 800 మీటర్ల పరుగు పందెంలో..

ఎం. ఈశ్వర్ (కామారెడ్డి) ప్రథమ స్థానం, గోపీచంద్ (ఖమ్మం) ద్వితీయ స్థానం, ఎం. అకిల్ (భద్రాద్రి కొత్తగూడెం) తృతీయ స్థానం.

అండర్ -20 బాలుర షాట్‌పుట్‌లో..

ఎ. సాయికిరణ్ (టీఏపీ వికారాబాద్) , ప్రథమ స్థానం, వైదిత్‌రెడ్డి (హైదరాబాద్) ద్వితీయ స్థానం, ఎస్‌కే అల్తాఫ్ (ఖమ్మం) తృతీయ స్థానం.

అండర్ -20 బాలుర డిస్‌కర్స్ త్రోలో..

ఎస్. విదిత్‌రెడ్డి (హైదరాబాద్) ప్రథమ, కె.స్వామి (కరీంనగర్) ద్వితీయ, రాహుల్ (హైదరాబాద్) తృతీయ స్థానంలో నిలిచారు.

కాజీపేట మీదుగా బీదర్-నాగ్‌పూర్ స్పెషల్ రైలు

కాజీపేట, అక్టోబరు 7 : దసరా, దీపావళి పండగల రద్దీ దృష్ట్యా కాజీపేట మీదుగా నాగ్‌పూర్ వైపు స్పెషల్ రైలు నడపడానికి రైల్వే అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. (07023) బీదర్-నాగ్‌పూర్ మధ్య నడిచే ఈ స్పెషల్ రైలు బీదర్‌లో ఈ నెల 11న, 18. 45 నిమిషాలకు బయలు దేరి తరువాత రోజు నాగ్‌పూర్‌కు 12. 00 చేరుకుంటుంది. (07024) నాగ్‌పూర్ - బీదర్ స్పెషల్ నాగ్‌పూర్‌లో ఈ నెల 13న 20. 10నిమిషాలకు బయలు దేరి తరువాతి రోజు 11.00 బీదర్‌కు చేరుకుంటుంది. ఈ రైలు నిజామాబాద్, మర్పెల్లి, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాద్, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, చంద్రాపూర్ రైల్వే స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.

సినీ గేయ రచయిత కందికొండ విగ్రహావిష్కరణ




కందికొండ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట టౌన్, అక్టోబరు 7 : నర్సంపేట మండలం నాగుర్లపల్లి గ్రామానికి చెందిన సినీ గేయ రచయిత కందికొండ యాదగిరి విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన కందికొండ సాంబయ్య-కొంరమ్మ దంపతులకు 1973, అక్టోబరు 13న యాదగిరి జన్మించారు. తన ఇంటి పేరునే కలం పేరుగా మార్చుకొని 1300 కు పైగా సినీ, ప్రైవేట్ ఆల్బమ్స్, జానపద గేయాలు రచించారు. క్యాన్సర్ వ్యాధితో 2022, మార్చి 12న హైదరాబాద్‌లో కందికొండ మృతి చెందాడు. నాగుర్లపల్లె గ్రామంలోని యాదగిరి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పాము, కప్ప.. బతుకు పోరాటం!

ఈ చిత్రాలు చూశారా.. ఓ నీటి పాము ఓ కప్పను విఽంగేందుకు ప్రయత్నించింది. కానీ తనను తాను కాపాడుకునేందుకు ఆ కప్ప తీవ్రంగా ప్రతిఘటించింది. అదే సమయంలో నోటికాడికొచ్చిన ఆహారాన్ని వదులుకోకూడదన్నట్టుగా ఆ పాము కప్పను నోటితో పట్టుకుంది. ఇలా ఆ పాము, కప్ప మధ్య జరిగిన 'బతుకు పోరాటం'లో చివరకు ఆ కప్ప పాము చెర నుంచి బయటపడి అక్కడి నుంచి జారుకుంది. ఆ పాము కూడా ఉసూరుమంటూ అక్కడి నుంచి వెనుదిరిగింది. వరంగల్ జిల్లా గీసుగొండ కంఠమహేశ్వర స్వామి దేవాలయం సమీపంలో సోమవారం ఈ దృశ్యాలు కనిపించాయి.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటో గ్రాఫర్, హనుమకొండ





కప్పను నోటకరుచుకున్న పాము, తప్పించుకు పోతున్న కప్ప

జీపీ కార్మికుల వేతనాలను చెల్లించాలి

హనుమకొండ టౌన్, అక్టోబరు 7 : పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ అను బంధ సంఘ మైన తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రామన్న, యాకయ్య, రూప, కొమురమ్మ తదితరులు పాల్గొన్నారు.


డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

బాధిత కుటుంబాలకు కడియం పరామర్శ

ఐనవోలు, అక్టోబరు 7: మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. వెంకటాపురంలో ఆదివారం పిడుగుపాటుకు గురై కూకట్ల రాజుయాదవ్, దౌతుబాజి శ్రావణిలు మరణించారు. కాగా, సోమవారం వారి భౌతికకాయాలను ఎమ్మెల్యే సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే వెంట డైరెక్టర్ మేటి చిరంజీవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రాజయ్య పరామర్శ

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య వెంకటాపురంలో పిడుగుపాటుకు గురై మృతిచెందిన రాజుయాదవ్, శ్రావణిల మృతదేహాలను ఆయన సందర్శించి నివాళులు అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట నాయకులు సుబ్బారావు తదితరులు ఉన్నారు.

పిడుగు పాటు మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ఐనవోలు, అక్టోబరు 7: వెంకటాపురంలో పిడుగుపాటుకు గురై మృతిచెందిన కూకట్ల రాజుయాదవ్, దౌతుబాజి శ్రావణి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. సోమవారం భౌతికకాయాలను సందర్శించి నివాళులు అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల ఒక్కొక్క కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి అండగా నిలువాలని కోరారు. కొంకాల నారాయణరెడ్డి, దీకొండ ఉప్పలయ్య, రామ్‌కుమార్, ఉప్పలయ్య, తదితరులు పరామర్శలో పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 7 : జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్ ఆధ్వర్యంలో బుధవారం (9వ తేదీన) ములుగురోడ్‌లోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం. మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భారత్ ఫైనాన్సియల్ ఇంక్లూషన్ లిమిటెడ్ బ్రాంచీల్లో లోన్ ఆఫీసర్‌గా పనిచేసేందుకు ఆసక్తి, అర్హులైన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనాలని ఆయన కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బ్రాంచీల్లో 50 పోస్టులకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంటర్‌తో పాటు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ద్విచక్ర వాహనం లైసెన్సు ఉన్న వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు బుధవారం ములుగురోడ్‌లోని కార్యాలయంలో ఉదయం 11 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

ఆటోనగర్, అక్టోబరు 7 : డెవలప్‌మెంట్ కమిషనర్ ఫర్ హ్యాండ్లూమ్స్ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ న్యూఢిల్లీ, కమిషనర్ చేనేత, జౌళీ శాఖ, అప్పారెల్ ఎక్స్‌పోర్టు హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం సమన్వయంతో సహాయ సంచాలకులు చేనేత జౌళీ శాఖ వరంగల్ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన-2024 మంగళవారం ప్రారంభించనున్నట్లు చేనేత, జౌళీ శాఖ ఏడీ రాఘవరావు ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ ఎన్‌జీవోస్ కాలనీలోని రెడ్డి మ్యారేజ్ ఫంక్షన్ ఆల్‌లో ఈనెల 8 నుంచి 21 వరకు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, వెస్ట్‌బెంగాల్, కాశ్మీర్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి 60ప్రాథమిక చేనేత సహకార సంఘాలు పాల్గొంటాయని వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా చేనేత జౌళా శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

'టీచర్ పోస్టుల భర్తీలో మాదిగలకు ద్రోహం'

కాజీపేట, అక్టోబరు 7 : సుప్రీం కోర్టు తీర్పును స్వాగతించి, ప్రతీ నోటిఫికేషన్‌లో ఎస్సీ వర్గీకరణతో పోస్టుల భర్తీ చేస్తామని చెప్పి, వర్గీకరణ లేకుండా భర్తీ చేయడం మాదిగలకు తీవ్ర అన్యాయమే అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దినేష్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు సురేందర్ మాదిగ అన్నారు. కాజీపేటలో సోమవారం ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘా ల సమావేశం నిర్వహించగా దినేశ్ మాదిగ మాట్లాడారు. సీఎం రేవంత్ చేసిన ద్రోహానికి నిరసనగా ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అంబేద్కర్ విగ్రహాల నుంచి కలెక్టరేట్ వరకు నల్ల బ్యాడ్జీలతో భారీ ప్రదర్శన చేస్తున్నట్లు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ రవికుమార్



వరంగల్ క్రైం, అక్టోబర్ 7 : కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ సీఐగా ఎస్.రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. టాస్క్‌ఫోర్స్ సీఐగా విధులు నిర్వహి స్తున్న రవి కుమార్‌ను కేయూ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ కమి షనర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రవి కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రవికుమార్‌కు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రుద్రేశ్వరీదేవి అమ్మవారికి లక్ష పుష్పార్చన

పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కొనసాగుతున్న అభిషేకాలు, అన్నదానాలు


లక్ష పుష్పార్చన చేస్తున్న ఎమ్మెల్యే నాయిని


ప్రత్యేక పూజలు చేస్తున్న సీపీ దంపతులు

హనుమకొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అయిదవ రోజు రుద్రేశ్వరి దేవి అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో ఉదయం నిత్యాహ్నికం, చతుశష్టి ఉపచార పూజలు నిర్వర్తించి అమ్మవారిని లలితామహా త్రిపుర సుందరిగా అలంకరించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నీలిమ దంపతులు, దేవన విష్ణు వర్ధన్ రెడ్డి గోదాదేవి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. లక్ష చామంతి, గులాబీ, కనకాంబరాలు, లిల్లీ పూలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మంగళవాయిద్యాలతో శేషవాహన సేవ నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా యాగశాలలో మహాచండీ యాగం నిర్వహించారు. సీఎంఆర్ గ్రూప్ అధినేత వెంకటరమణ సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం తాడూరి రేణుగా దేవి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యప్రదర్శన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ఈవో వెంకటయ్య ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సతీష్, తౌటం రెడ్డి రవీందర్ రెడ్డి, రమేష్, సీఎంఆర్ గ్రూప్స్ వెంకన్న భక్తులకు సేవలు అందించారు.

● వడ్డెపల్లి : హనుమకొండలోని వివిధ డివిజన్ల మండపాలలో నెలకొల్పిన దుర్గామాతకు భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానాలు నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ దేవరాజ్ కాలనీలో నవ దుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాఅన్నదాన కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్ ప్రారంభించారు. కాంగ్రెస్ నేత నిమ్మాని శేఖర్‌రావు, వల్లాల రాజ్‌కుమార్‌గౌడ్, కాసగోని లవణ్‌కుమార్, దూలం వినయ్ తదితరులు దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాన్ని సమర్పించుకున్నారు. డివిజన్‌లోని కనకదుర్గా కాలనీలోని కనకదుర్గా మల్లేశ్వర ఆలయంలో నెలకొల్పిన దుర్గా మాతకు రుత్వికులు ఉదయమర్రి కృష్ణమూర్తి శర్మ, అభిషేకాలు చేశారు. భక్తుల భజన కీర్తనలతో కనకదుర్గా మల్లేశ్వర స్వామి ఆలయం మార్మోగింది.

అమ్మవారిని సందర్శించిన సీపీ దంపతులు

కాజీపేట,అక్టోబరు 7: కాజీపేట శివాలయం గుడిలో సోమవారం మాతా శాకంబరీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. 108 కూరగాయలతో అమ్మవారికి పూజారి ఐనవోలు ప్రవీణ్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలకు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మిట్టపల్లి రవీందర్, రంజిత్, నాగవెల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

స్కందమాత అలంకరణలో అమ్మవారు

ఐనవోలు : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భ్రమరాంబికాదేవి ఆలయంలో సోమవారం అమ్మవారు స్కందమాత అలంకరణలో దర్శనమిచ్చారు. దుర్గామత ఐదో స్వరూపమైన స్కందమాత ఈ పేరనే అమ్మవారు ప్రసిద్ధిచెందారు. ఈ పూజ కార్యక్రమాల్లో అమ్మవారికి నిత్యాహ్నికము, నవార వర్ణార్చన బావనోపనిషత్ పారాయణం, లలితసహస్ర నామార్చన, చండీహోమం, చండి సప్తశతి పారాయణం, మహానివేదన నీరాజన మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు బల్దియాలో బతుకమ్మ సంబరాలు

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 7 : బల్దియా పరిధిలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగే బతుకమ్మ వేడుకలకు హాజరుకావాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే బతుకమ్మ వేడుకలకు మహిళా ఉద్యోగులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

హనుమకొండ సిటీ, అక్టోబరు 7 : వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో చెక్కులను అందచేసిన అనం తరం ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభు త్వం పని చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు పనికట్టుకొని అవాస్తవ ప్రచారాలు చేస్తూ రాజకీయ ఉనికి కోసం నానా తంటాలు పడుతున్నారని విమర్శించారు. రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న మాజీ మంత్రి హరీశ్‌రావు యూ టర్న్ తీసుకున్నారని ఎద్దేశా చేశారు.

ముగ్గురు సీఐల బదిలీ

వరంగల్ క్రైం, అక్టోబర్ 7 : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ సోమవారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో జి.సీతారెడ్డి ఎస్‌బీ నుంచి హనుమకొండ ట్రాఫిక్, ఎం.ఎ.సుఖూర్ హనుమకొండ ట్రాఫిక్ నుంచి ఇంతేజార్‌గంజ్, జె.వెంకటరమణ కవిఎషనరేట్ నుంచి మిల్స్‌కాలనీ.

14న రౌండ్ టేబుల్ సమావేశం

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 7: తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14న విద్యారంగంలో వస్తున్న మార్పులపై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని కమిటీ రాష్ట్ర ప్రతినిధులు ఎస్. తిరుపతి, కె. బోగేశ్వర్, ఎ. శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం హనుమకొండ సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ... ప్రజాపాలన చేస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సైతం విద్యారంగం సైతం సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించాల్సిన ప్రభుత్వం సరైన విధానాలపై దృష్టిసారించకుండా ఆకస్మిక, అనా లోచిన నిర్ణయాలను అమలుచేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలోని సుమారు 30 వేల ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు కల్పించకుండా మరోరకమైన గురుకులాలను ఏర్పాటు చేస్తామనడాన్ని వారు తప్పుబట్టారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 25 అశాస్త్రీయంగా ఉం దని, అది పాఠశాలల మూసివేతకు పునాదిగా మారనుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 14న నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి ఉపాధ్యాయులు, విద్యారంగ నిపుణులు, విద్యార్థి సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు, యువజ, సామాజిక, మహిళా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు. అనంతరం రౌండ్ టేబుల్ సమావేశం కరపత్రాలను ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో కమిటీ వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రతినిధులు కె. శ్రీనివాస్, ఎం. రఘుపతి, జి. సత్యనారాయణ, ఎ. గోవిందరావు, జి. వెంకటేశ్వర్లు, మనోజ్‌గౌడ్ పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

గ్రామీణ డాక్ సేవకుల సమస్యలు పరిష్కరించండి

కాజీపేట జంక్షన్, అక్టోబరు 7: గ్రామీణ తపాలా ఉద్యోగులకు కనీస వేతనాన్ని అమలు చేసి సౌకర్యాలు కల్పిస్తూ కమలేష్ చంద్ర కమిటీ ఇచ్చిన అనుకూల సిఫారస్‌లను అమలు చేయాలని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు కోరారు. ఈమేరకు సోమవారం వెంకటేశ్వర్లు ఇతర సంఘం నేతలతో కలిసి కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెంబసాని చంద్రశేఖర్‌కువినతి పత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో గల కేంద్రమంత్రి క్యాంప్ ఆఫీసులో మంత్రిని కలిసిన వారు ఉద్యోగుల సమస్యలను వివరించారు. గ్రామీణ తపాలా ఉద్యోగులు మెడికల్, కనీస పెన్షన్ సౌకర్యం లేకుండా గ్రామీణ ప్రాంత ప్రజలకు నిరంతరం ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకొని సేవలందిస్తున్నారని మంత్రికి వివరించారు. పేరుకు ఐదు గంటల పనితో నియమించబడిన రోజుకు 8నుంచి 10 గంటల వరకు పనిచేయాల్సి వస్తుందని వివరించారు. నేతల వినతి మేరకు స్పందించిన కేంద్ర మంత్రి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో వెంకటేశ్వర్లుతో పాటు యూనియన్ తెలంగాణ అసిస్టెంట్ సర్కిల్ సెక్రటరీ పెరుమాండ్ల తిరుపతి, హనుమకొండ డివిజన్ కోశాధికారి జె. బాపూజీ, మర్రి కొమురారెడ్డి తదితరులు ఉన్నారు.


కేంద్ర మంత్రికి వినతి పత్రం సమర్పిస్తున్న వెంకటేశ్వర్లు ఇతర నాయకులు

అమెరికాలో బతుకమ్మ వేడుకలు

సందడి చేసిన తెలంగాణ మహిళలు

హనుమకొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని కెంటకీలో తెలంగాణ మహిళలు బతుకమ్మ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ఆటలు ఆడి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ఆవిష్కరించారు. కెంటకీ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ (కేటీసీఏ) ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన కెంటకీలోని హిందూ టెంపుల్ ఆఫ్ కెంటకీ (ఆలయాల సముదాయం-హెచ్‌టీకేవై) ఆవరణలో బతుకమ్మ వేడుకలు జరిగాయి. సుమారు 500 మందికిపైగా తెలుగు కుటుంబాలు ఈ వేడుకల్లో పాల్గొన్నాయి. సాయంత్రం 4 గంటలకు బతుకమ్మలతో హెచ్‌టీకేవైకి బయలుదేరారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడారు. కోలాటాలు ఆడారు. నృత్యాలు చేశారు. డిజేలో బతుకమ్మ పాటతో ఆ ప్రాంగణమంతా మార్మోగింది. ప్రాంగణంలో కాకతీయ కళా తోరణాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. శ్రీనివాస్ వేమూరి, అపర్ణ వేమూరి, రవి అరుసం, నీతా పోల్కం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అయోధ్యలో బతుకమ్మ వేడుకలు

శ్రీ రామచంద్రుడి జన్మభూమి అయోధ్యలో ఓరుగల్లు మహిళలు బతుకమ్మ ఆట పాటలతో సందడి చేశారు. హనుమకొండ శ్రీ రామనుజ పాదుపు సంస్థ ఆధ్వర్యంలో ఉత్తర భారత పర్యటనలో ఉన్న వీరు సోమవారం అయోధ్యకు చేరుకున్నారు. ఇక్కడ ప్రధాన రామాలయం సమీపంలో మహిళలు తెలంగాణ సంస్కృతిని చాటే బతుకమ్మ పండుగ ఆట పాటలతో సందడి చేశారు. సంస్థ నిర్వాహకులు చక్రధరస్వామి, వెంకటేశ్వర్లు, నరేందర్, దయాకర్, శ్రీకాంత్ పర్యవేక్షించారు, టూర్ మేనేజర్‌గా శ్రీనివాస్ వ్యవహరించారు.


అమెరికాలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

మారణహోమాన్ని ఆపండి

సీపీఐ,సీపీఎం వామపక్ష పార్టీల నాయకులు

బాలసముద్రం, అక్టోబరు 7 : గాజాపై ఇజ్రాయిల్ ఏకపక్ష దాడులు చేసి మారణహోమాన్ని చేస్తోందని ఆ దాడులను వెంటనే ఆపాలని ఇండియాతో పాటు ప్రపంచం గాజాకు అండగా నిలవాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు బొట్ల చక్రపాణి, కర్రె భిక్షపతి అన్నారు. సోమవారం హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్ ఎదుట వామపక్ష పార్టీల పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాజాపై జరిగిన దాడిలో 41లక్షల మంది ఇప్పటి వరకు మరణించినట్లు తెలిపారు. ప్రతీ దేశానికి ఒక జాతీయత ఉంటుందని కానీ ఇజ్రాయిల్‌కు మాత్రం ఆ దేశం మిలటరీనే జాతీయత అని ఎద్దేవా చేశారు. గాజా వీధులు నిత్యం రక్తంతో తడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచం ముందు వారిని ఇస్లామిక్ తీవ్రవాదులుగా ముద్ర వేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌పీ జిల్లా కార్యదర్శి శివాజీ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ గంగుల దయాకర్, సీపీఎం జిల్లా నాయకులు సారంపల్లి వాసుదేవరెడ్డి, జి.రాములు, తిరుపతి, వీరన్న, సంపత్, భానునాయక్, సీపీఐ నాయకులు అశోక్ స్టాలిన్, ఎల్లేశ్ పాల్గొన్నారు.

సివిల్ పనులు త్వరగా పూర్తి చేయండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 7 : హనుమకొండ బాలసముద్రం, వరంగల్ పోతననగర్‌లో నిర్మాణమైన చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో మిగిలిన సివిల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. సోమవారం బల్దియా పరిధిలోని రెండు చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. స్వచ్ఛ ఆటోలు సేకరించి తెచ్చిన చెత్త ఇక్కడి నుంచి రాంపూర్‌కు ఎంత సమయంలో తరలిస్తున్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బాలసముద్రం సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ అంతర్గత రోడ్డులను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, డీఈ సారంగం, ఏఈ సురేష్‌బాబు, శానిటరి ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్‌తో పాటు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ధర్మసాగర్, అక్టోబర్ 7: సీజనల్ వాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోపినాథ్ అన్నారు. సోమవారం ధర్మసాగర్ మండలం మల్లక్‌పల్లిలో ఆయన వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని 81 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఏనుమాముల మార్కెట్‌కు పండగ సెలవులు

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 7: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సద్దులు, దసర పండగను పురస్కరించుకుని నాలుగురోజుల పాటు సెలువులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం దుర్గాష్టమి, శుక్రవారం మహర్నవమి, శనివారం విజయదశమి, ఆదివారం సాధారణ సెలవు, విజయదశమి మరుసటి రోజును పురస్కరించుకుని వరుసగా సెలవులను ప్రకటించినట్లు తెలిపారు. రైతులు, వ్యాపారులు, కార్మికులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కార్యదర్శి కోరారు.

దాడి చేసి చోరీకి పాల్పడిన ముగ్గురికి జైలు

వరంగల్ లీగల్, అక్టోబరు 7 : ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళను బంధించి దాడి చేసి దొంగతనానికి పాల్పడిన ముగ్గురికి ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ప్రధాన అసిస్టెంట్ సెషన్స్ జడ్జి క్షమా దేశ్ పాండే సోమవారం తీర్పు చెప్పారు. 2014 సెప్టెంబరు 26న మధ్యాహ్నం 2.45గంటల సమయంలో హనుమకొండ గణేష్‌నగర్‌లోని అక్వాల సమ్మయ్య అనే వ్యక్తి ఇంటి ఎదుట ఓ వ్యక్తి నిలబడి ఉండగా సమ్మయ్య అతడెవరో తెలుసుకునేందుకు వెళ్లాడు. ఆ సమయంలో సదరు వ్యక్తి సమ్మయ్య చేతిలో ఉన్న సెల్‌ఫోన్ గుంజుకొని సమ్మయ్యను ఇంట్లోకి నెట్టివేసి పరారయ్యాడు. దాంతో సమ్మయ్య ఇంట్లోకి వెళ్లేసరికి అక్కడ మరో ఇద్దరు వ్యక్తులు అతడి భార్య లతశ్రీ చేతులు కట్టివేసి నోట్లో క ర్చీఫ్ కుక్కి డబ్బులు ఎక్కడ ఉన్నాయో చెప్పాలని లేదంటే చంపుతామని బెదిరిస్తున్నారు. ఇంట్లో ఉన్న బీరువా, బెడ్ రూం పరుపుల కింద వెదికి ఇంట్లో ఉన్న సామగ్రిని చిందర వందరం చేసి బంగారు వస్తువులను లాక్కున్నారు. డబ్బులు దొరకక పోవడంతో సమ్మయ్యను ఇష్టమొచ్చినట్లు కొట్టి జేబులో నుంచి రూ.10వేలు తీసుకున్నారు.

ఆ తర్వాత దంపతులిద్దరిని ఇంట్లో ఉంచి బయట నుంచి తలుపు గడియపెట్టి పరారయ్యారు. కాసేపటి తర్వాత ఇంట్లో నుంచి కేకలు వేయడంతో విని ఇంటి యజమాని వచ్చి గడియ తీశారు. ఆ తర్వాత బంగారం, నగదు మొత్తం కలిపి రూ.2.20లక్షల సొత్తును దొంగిలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో కరీంనగర్ జిల్లా గోదావరి ఖనికి చెందిన షేక్ అలీ హైదర్, సోమిడి కుమారస్వామి, రాదండి శంకర్ , మాసిపెద్ది మధూకర్, కోరుట్ల భీముని దుబ్బకు చెందిన పండుగ శివకృష్ణ, అదే ప్రాంతానికి చెందిన ఎండి అసీఫ్ దొంగతనానికి పాల్పడినట్లు నిర్ధారించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కాగా, విచారణలో రెండో నిందితుడు కుమారస్వామి చనిపోవడంతో షేక్ అలీ హైదర్, శంకర్, ఎం. మధూకర్‌లపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. అదే విధంగా వారికి సహకరించినందుకు పండుగ శివకృష్ణ , ఎండి అసీఫ్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు. కోర్టు పీసీలు బి. సురేష్, ఎం.సుభాష్ సాక్షులను ప్రవేశపెట్టగా కోర్టులైజనింగ్ అధికారి కె. పరమేశ్వరి సహకరించారు.నర్సంపేట ఏసీపీ వి. కిరణ్, హనుమకొండ సీఐ వై.సతీష్ దర్యాప్తు అధికారులుగా వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.

బాలిక మృతి.. వైద్యం వికటించడం వల్లేనని ఆరోపణలు


హనుమకొండ టౌన్, అక్టోబరు 7 : డెంగీతో ఆస్పత్రిలో చేరిన 8 సంవత్సరాల వర్షిత అనే బాలిక మృ తి చెందిన సంఘటన హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బంధు వుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా పత్తిపల్లికి చెందిన జాటోతు కవిత-జయపాల్ దంపతుల కూతు రు వర్షిత (8) ఈనెల 2న డెంగీతో బాధపడుతూ హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. నాలుగు రోజులుగా వైద్య సిబ్బంది బాలిక ఆరోగ్య పరిస్థితి గురించి సమాచారం ఇవ్వకుండా మెరుగైన వైద్యానికి మరికొన్ని డబ్బులు కావాలని బాలిక తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచి సుమారు రూ. 4 లక్షలు వరకు డబ్బులు కట్టించుకున్నారు. చివరిగా ఆదివారం మధ్యాహ్నం మృతురాలి తల్లికి వర్షితను చూపించారు. రాత్రి సందర్శన సమయంలో చూపించకుండా అర్ధరాత్రి పాప చనిపోయినట్లుగా సమాచారం ఇచ్చారు. దీంతో బాలిక బంధువులు ఆస్పత్రి ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. హను మకొండ పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిలువరించారు. కాగా, గత నెల 9న ఇదే ఆస్పత్రిలో ఓ పాప వైద్యం వికటించి చనిపోవడం గమనార్హం.

బుంగను పూడ్చిన పోలీసులు

కట్టకు తప్పిన ప్రమాదం

ఐనవోలు, అక్టోబరు 7: ఒంటిమామిడిపల్లి ఎల్లమ్మ చెరువుకు ఏర్పడిన బుంగను ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం యుద్ధ ప్రాతిపదకన పూడ్చివేయించారు. ఆదివారం రాత్రి చెరువు కట్టపై ఎల్లమ్మ ఆలయం సమీపంలోని తూము పక్కన కట్టపై మట్టి దసికి లీకేజీ ఏర్పడింది. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు ఎస్సైకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న ఆయన ఇరిగేషన్ శాఖ ఏఈ రాజ్‌కుమార్‌కు సమాచారం అందించారు. బుంగ పెద్దది కాకుండా సత్వరమే మరమ్మతులు చేయాలని ఏఈ సూచించారు. దీంతో ఎక్స్‌కవేటర్ సాయంతో మొరం పోసి బుంగను పూడ్చి వేశారు.

తల్లి పెన్షన్‌కోసం అన్నపై తమ్ముడి దాడి


గాయపడిన రాజేందర్

మడికొండ, అక్టోబరు 7 : తల్లి పెన్షన్ కోసం అన్నపై తమ్ముడు కత్తితో దాడి చేసి గాయపర్చాడు.. మడికొండ ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం అయోధ్యపురానకు చెందిన రాజగారి వీరమ్మకు నలుగురు కుమారులు కాగా, పెద్దకుమారుడు కొన్నిసంవత్సరాల క్రితం మరణించాడు. రెండవ కుమారుడు వేరే ఊరిలో నివాసం ఉంటున్నాడు. తల్లి వీరమ్మకు రైల్వే పెన్షన్ పంపకాల విషయంలో సోమవారం మూడో కుమారుడు రాజేందర్, వెంకటేశ్‌ల మధ్య మాట మాట పెరిగి గొడవ జరిగింది. ఈ గొడవలో అక్కడే ఉన్న వెదురు కర్రలు తీసే కత్తితో అన్న రాజేందర్ తలపై తమ్ముడు వెంకటేశ్ దాడి చేశాడు. దీంతో రాజేందర్ తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు సమాచారం మేరకు 108 సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. రాజేందర్ భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆరోగ్య బుక్‌లెట్ ఆవిష్కరించిన కలెక్టర్

హనుమకొండటౌన్, అక్టోబరు 7 : రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకానికి సంబంధించి జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవల వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను సోమవారం కలెక్టర్ ప్రావీణ్య కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవే ట్ ఆసుపత్రులలో ఆరోగ్య శ్రీ పథకంలో భాగంగా అందించే శస్త్ర చికిత్సలు, థెరపీల వివరాలను కలిగిన బుక్‌లెట్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినం దనీయమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్‌వో వై.వి గణేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితా దేవి పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి
9
నవ్య డాక్టర్
మంగళవారం • 8 అక్టోబరు 2024

వేడుక



నేడు వేపకాయల బతుకమ్మ

బతుకమ్మ వేడుకల్లో ఏడో రోజైన ఆశ్వయుజ శుద్ధ షష్ఠి (మంగళవారం) నాడు బియ్యం పిండిని వేయించి, బెల్లం కలిపి వేపకాయ ఆకారంలో చేసిన వంటను గౌరమ్మకు నివేదిస్తారు. కాబట్టి 'వేపకాయల బతుకమ్మ' అంటారు. చేమంతి, గునుగు, రుద్రాక్ష తదితర పూలను ఏడు ఎత్తుల్లో పేర్చి, గౌరమ్మను వాటిపై పెడతారు.

నైవేద్యం: వేయించిన బియ్యం పిండి, బెల్లం కలిపి చేసిన వంటకం

దేవీ నవరాత్రులు

నేటి అలంకరణ

శ్రీమహాలక్ష్మీదేవి


ఆశ్వయుజ శుద్ధ షష్ఠి- మంగళవారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఆరో రోజున విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ... శ్రీ మహాలక్ష్మిగా దర్శనమిస్తారు. మంగళప్రదమైన దేవత మహాలక్ష్మీదేవి. మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అనే రూపాల్ని ఆదిపరాశక్తి ధరించి, దుష్ట రాక్షస సంహారం చేసిందనీ, క్షీరాబ్ధి పుత్రికగా అవతరించిన లక్ష్మీదేవి... డోలాసురుడనే రాక్షసుణ్ణి సంహరించిందనీ పురాణాలు చెబుతున్నాయి. రెండు చేతులలో కమలాలు ధరించి, అభయ, వరద హస్త ముద్రలను ప్రదర్శిస్తూ, గజరాజు సేవిస్తుండగా... భక్తుల అభీష్టాలను తీర్చే మహాలక్ష్మి సర్వ మంగళకారిణి. లోక స్థితికారిణిగా ధన, ధాన్య, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, సంతాన, గజలక్ష్ములుగా వరాలు ప్రసాదించే అష్టలక్ష్మల సమష్టి రూపమైన మహాలక్ష్మీదేవిగా దుర్గమ్మ ఈ రోజు భక్తులను అనుగ్రహిస్తారు. ఈ అలంకారంలో ఉన్న దుర్గమ్మను దర్శించుకొని, పూజిస్తే... ధన, కనక, వస్తు, వాహన ప్రాప్తి కలుగుతుందనీ, సుఖ సంతోషాలు చేకూరుతాయనీ, దారిద్ర్యం, దుఃఖాలు తొలగిపోయి సకల శుభాలూ కలుగుతాయనీ భక్తుల నమ్మిక.



నైవేద్యం: రవ్వకేసరి, గారెలు, చిత్రాన్నం, పాయసం
అలంకరించే చీర రంగు: ఎరుపు
అర్చించే పూలు: తామర పుష్పాలు
పారాయణ చెయ్యాల్సినవి: లక్ష్మీ స్తోత్రాలు

లంగ్ కేర్



ఉబ్బసం నుంచి ఉపశమనం

నాలుగడుగులు వేస్తే ఆయాసం. ఊపిరి సలపని దగ్గు. ఛాతీలో చెప్పలేనంత అసౌకర్యం... ఇలా ఉబ్బసం రోగుల బాధలకు అంతంటూ ఉండదు. మరీ ముఖ్యంగా చలి కాలం ప్రారంభంలో ఈ రుగ్మత తీవ్రత పెరుగుతూ ఉంటుంది. కాబట్టి ఇప్పటినుంచే ఉబ్బసం నుంచి ఉపశమనాన్ని అందించే సమర్థమైన చికిత్సను అనుసరించడం మొదలుపెట్టాలి.

ఉబ్బసం వ్యాధి, చికిత్స చుట్టూరా పరుచుకున్న అపోహల వల్ల వ్యాధి నియంత్రణ క్లిష్టంగా మారుతోంది. సమర్థమైన చికిత్స అందుబాటులో ఉన్నా, వ్యాధిని అదుపులో ఉంచే ముందు జాగ్రత్త చర్యల మీద అవగాహన లేకపోవడం వల్ల ఉబ్బసం గురించి బెంబేలు పడిపోయే పరిస్థితి అంతటా నెలకొని ఉంది. దగ్గుని దగ్గుగానే చూడడం, తగ్గకపోతే యాంటీబయాటిక్స్ వాడేయడం, అంతిమంగా వైద్యుల్ని కలవడం, కలిసినా వాళ్లు సూచించే మందుల్ని సక్రమంగా వాడకపోవడం, ఉబ్బసాన్ని ప్రేరేపించే కారకాలను నిర్లక్ష్యం చేయడం... ఇలా ఈ వ్యాధిని స్వయానా పెంచుకుంటున్నాం! కానీ మధుమేహం లాంటి అన్ని దీర్ఘకాలిక వ్యాధుల్లాగే ఉబ్బసాన్ని కూడా నియంత్రణలో ఉంచుకోవచ్చు.

కారణాలు అనేకం!

ఉబ్బసం ఎవరికైనా, ఎప్పుడైనా రావొచ్చు! సాధారణ అలర్జీ కూడా దీర్ఘకాలంలో ఉబ్బసానికి దారి తీయొచ్చు. వంశపారంపర్యంగా కూడా సంక్రమించవచ్చు. కాలుష్యం, ఫుడ్ అలర్జీ, డస్ట్ అలర్జీలు కూడా ఉబ్బసంగా మారొచ్చు. కొందరు పుట్టుకతోనే వెంటబెట్టుకుని రావొచ్చు. మరి కొందరికి బాల్యంలో తలెత్తవచ్చు. మరికొందరికి టీనేజీలో మొదలవ్వొచ్చు. కాబట్టి ఎప్పుడు, ఏ కారణంగా వచ్చిందనే దాని ఆధారంగా తగిన చికిత్సతో వ్యాధిని మచ్చిక చేసుకోగలిగితే నాణ్యమైన జీవితాన్ని గడపవచ్చు.

ఉబ్బసం అంటే?

ఆయాసం, పిల్లి కూతలు, దగ్గు, తెమడ పడడం, పడక పోవడం, చిక్కని జిగురులాంటి కళ్లె, అది శ్వాసనాళాన్ని పోలిన ఆకారంలో ఉండడం... ఉబ్బసం ప్రధాన లక్షణాలు. ఉబ్బస కారక అలర్జెన్స్ ఊపిరి ద్వారా శ్వాసనాళాల్లోకి ప్రవేశించి అక్కడ అతుక్కుపోయి, వాపును కలగజేస్తాయి. దాంతో ఆ ప్రదేశం ఇరుకుగా మారి శ్వాస బలవంతంగా తీసుకోవలసివస్తుంది.

పొంచి ఉండే ముప్పులు

ఉబ్బసం తిరగబెట్టడానికి కారణం కొన్ని ఆహార పదార్థాలే అనుకుంటూ ఉంటారు. దాంతో జామ పళ్ళ, వంకాయ... ఇలాంటి కొన్నిటికి చాలా దూరంగా ఉంటూ ఉంటారు. కానీ ఇది అందరికీ వర్తించదు. కొందరికి కొన్ని పదార్థాలు తినటం వల్ల ఉబ్బసం లక్షణాలు పెరగడం నిజమే అయినా, అందరికీ అలాగే ఉండాలని లేదు. దానికి మించిన ఉబ్బసం ప్రేరకాలు ఇంట్లో బయటా ఎన్నో ఉంటాయి. అవేంటంటే...

- **డస్ట్ అలర్జీ:** కంటికి కనిపించని డస్ట్ మైట్స్ మన ఇల్లంతా వ్యాపించి ఉంటాయి. దుప్పట్లు, దిండ్లు, రగ్గులు, మ్యాట్లు, సోఫాలు, కార్పెట్లు, పెంపుడు జంతువుల బొచ్చు... వీటన్నిట్లో ఉంటాయి. కాబట్టి వీటి నుంచి డస్ట్ మైట్స్ ఊపిరి ద్వారా శ్వాసనాళాల్లోకి చేరకుండా చూసుకోవాలి. ఇందుకోసం...
- ఇల్లు ఊడ్చకుండా తడి బట్టతో తుడవడం అలవాటు చేసుకోవాలి.
- పెంపుడు జంతువులను పెంచకపోవడమే మేలు.

ఇన్‌హేలర్స్ సురక్షితం



ఉబ్బసానికి ఉత్తమమైన చికిత్స నెబ్యులైజర్స్, ఇన్‌హెలర్స్, స్టిరాయిడ్స్. చాలామంది వీటిని వాడడానికి ఇష్టపడరు. వైద్యులు ఇన్‌హెలర్స్ సూచించినప్పుడు 'మాకంత ఉబ్బసం లేదండీ!' అంటూ వేరే మందులను సూచించమని వైద్యులను ఒత్తిడి చేస్తారు. కానీ ఉబ్బసానికి ఇన్‌హేలర్స్ సురక్షితమైన చికిత్స. తీవ్రతను బట్టి కొందరికి స్టిరాయిడ్స్ కూడా అవసరం పడొచ్చు. ఈ రెండూ ఇతరత్రా దుష్ప్రభావాలు కలిగించకుండా నేరుగా ఊపిరితిత్తుల మీదే పనిచేస్తాయి.

- దుప్పట్లు, దిండు కవర్లను ప్రతి రెండు రోజులకోసారి ఉతుకుతూ ఉండాలి.
- ఎక్కువ వాసన కలిగి ఉండే పర్‌ఫ్యూమ్స్, పౌడర్లు వాడకూడదు.
- కార్పెట్లు వాడకూడదు.
- బాత్రూమ్‌లో మౌల్డ్ లేకుండా చూసుకోవాలి.
- ఇంట్లో ఎక్కడా తేమ ఉండకూడదు.
- కాలుష్యం ముప్పు

కాలుష్యం ఉబ్బసం వచ్చే వీలు లేని వారికీ వచ్చేలా చేస్తుంది. పదే పదే కాలుష్యానికి గురైనా కొందరికి ఉబ్బసం రావొచ్చు. వాతావరణంలో కలిసిన వాహనాల పొగ పీల్చుకోకూడదు. ఇందుకోసం..

- మందంగా ఉండే స్కార్ఫ్‌లు వాడాలి.
- సర్జికల్ మాస్క్‌లకు బదులుగా సూక్ష్మమైన ధూళిని వడగట్టే ఎన్95 మాస్క్‌లు వాడాలి.
- వీలైతే రెస్పిరేటర్స్ వాడాలి.

సిగరెట్లతో 'సీవోపీడి'

క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్... ఇది ధూమపానం చేసేవారికి వస్తుంది. ఇదీ ఉబ్బసమే! అవే లక్షణాలు ఉంటాయి. అయితే ఉబ్బసంలాగా దీన్ని సరిదిద్దలేం! ఒకసారి సీవోపీడి అని నిర్థారణ అయితే చికిత్సతో లక్షణాలను అదుపు చేయవచ్చుగానీ, వ్యాధిని అదుపు చేయలేం! ఆస్తమాలో ఈసినోఫిల్స్ వల్ల శ్వాసనాళాల్లో వాపు మొదలైతే, ఈ వ్యాధిలో న్యూట్రోఫిల్స్ వల్ల సమస్య మొదలవుతుంది. ఇది తీవ్ర రూపం దాలిస్తే, ఊపిరితిత్తులు బెలూన్‌లా ఉబ్బిపోతాయి. శ్వాసనాళాలు శాశ్వతంగా గట్టిపడిపోయి సాగే గుణం కోల్పోతాయి.

అలర్జీలను పసిగట్టాలి!

డస్ట్ అలర్జీతోపాటు కొందరికి కొన్ని రకాల ఫుడ్ అలర్జీలు ఉంటాయి. ఇంకొందరికి ఘాటైన వాసనలు పడవు. వీటి వల్ల మొదలయ్యే దగ్గు, జలుబు, ఆయాసం, పిల్లి కూతలు ఉబ్బసాన్నే పోలి ఉంటాయి. మందులతో తగ్గినా ఇదే స్థితి పదే పదే తిరగబెడుతూ ఉంటే క్రమేపీ ఉబ్బసంగా పరిణమిస్తుంది. కాబట్టి దేని వల్ల ఉబ్బసం తాలూకు లక్షణాలు మొదలవుతున్నాయో జాగ్రత్తగా గమనించి వాటికి దూరంగా ఉండాలి. ఇలా అలర్జీ కారణంగా తలెత్తే ఉబ్బసానికి యాంటీ ఐజీఈ అనే మందుతో చికిత్స చేయవచ్చు. అలర్జీ ఉన్నవాళ్లలో పెరిగిపోయే ఐజీఈ అనే యాంటీబాడీకి విరుగుడుగా ఈ మందు ఇవ్వడం ద్వారా అలర్జీ, దాని తాలూకు ఉబ్బసం రాకుండా ఉంటాయి.

ట్రిగ్గర్ కావచ్చు!

కొందరికి ఐదు నిమిషాల ముందు వరకూ లేని ఆయాసం హఠాత్తుగా మొదలవుతుంది. భయపడినా, విపరీతమైన ఒత్తిడి, శారీరక శ్రమకు లోనైనా క్షణాల్లో ఉబ్బసం లక్షణాలు కనిపించి ఊపిరి ఆడనివ్వకుండా చేసేస్తాయి. ఇలాంటివాళ్లు ఇన్‌హెలర్స్ ఎప్పుడూ దగ్గర పెట్టుకోవాలి. క్రీడాకారులైతే ఆటకు ముందు వీటిని వాడితే, ఉబ్బసం వేధించకుండా ఉంటుంది.

అప్రమత్తత ముఖ్యం!

ఉబ్బసం అని నిర్థారణ జరిగేదాకా ఆగకుండా లక్షణాలు మొదటిసారి కనిపించిన వెంటనే వైద్యులను కలిస్తే వ్యాధి ముదరకుండా నియంత్రించే వీలుంటుంది. ఇందుకోసం దగ్గు, జలుబు మూడు వారాలకు మించి వేధిస్తుంటే తప్పనిసరిగా పల్మనాలజిస్టు చేత పరీక్షలు చేయించుకోవాలి. సాధారణ దగ్గు, జలుబు అయినా సొంత వైద్యం చేసుకోకూడదు. అది వైరస్ కారణంగా వచ్చిందా? లేక అలర్జెన్స్ కారణంగా వచ్చిందా? అనేది నిర్థారించుకోవాలి. ఇందుకోసం వైద్యులను సంప్రదించాలి. ఉబ్బస లక్షణాలను పెంచే అలర్జెన్స్‌ను గుర్తించి వాటికి దూరంగా ఉండాలి. అవసరమైతే ఇన్‌హెలర్స్ వాడడానికి సంకోచించకూడదు. శ్వాసనాళాల వాపును తగ్గించే స్టిరాయిడ్స్‌నూ అవసరమైతే వాడక తప్పదు. అన్నిటికంటే ముఖ్యంగా ఉబ్బసాన్ని తీవ్రమైన వ్యాధిలా కాకుండా ఓ అసౌకర్యంగా భావించి, సమయానికి చికిత్స తీసుకోగలిగితే నాణ్యమైన జీవితాన్ని గడపవచ్చు.

పిఎమ్ఎస్

నొప్పికి నో...

కొందరు మహిళలకు నెలసరి నరకాన్ని చూపిస్తుంది. అయితే నెలసరి నొప్పిని కష్టంగా భరించాల్సిన అవసరం లేదు. కొన్ని పనులకు దైనందిన జీవితంలో చోటు కల్పిస్తే, ఆ నొప్పులు క్రమేపీ తగ్గిపోతాయి.

నొప్పి ఎందుకంటే?: నెలసరి నొప్పులకు కారణం ఆ సమయంలో శరీరంలో అసమతౌల్యానికి గురయ్యే హార్మోన్లే! హార్మోన్ల అసమతౌల్యానికి ప్రధాన కారణం పోషకాహార లోపం. దీంతోపాటు పర్యావరణం, కాలుష్యం, విషాలు, ఒత్తిడి... నెలసరి నొప్పులను పెంచుతాయి. కాబట్టి వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని నొప్పులను తగ్గించే చిట్కాలు పాటించాలి. ఇందుకోసం...



- **వ్యాయామం:** వ్యాయామం వల్ల కండరాలు వదులవుతాయి. మరీ ముఖ్యంగా నడుము, పొత్తి కడుపు, కాళ్లకు సంబంధించిన వ్యాయామాలు చేస్తే నెలసరిలో వేధించే నొప్పులు క్రమంగా తగ్గుముఖం పడతాయి.
- **హీటింగ్ ప్యాడ్:** నొప్పి ఉన్న ప్రదేశంలో వేడి నీళ్ల నింపిన హీటింగ్ ప్యాడ్‌తో కాపడం పెట్టినా ఫలితం ఉంటుంది.
- **వేడినీటి స్నానం:** నెలసరిలో ఉన్నన్ని రోజులూ వేడినీటి స్నానం చేయాలి. ఇలా చేసినా కండరాలు రిలాక్స్ అయి, నొప్పులు తగ్గుతాయి.
- **కంటి నిండా నిద్ర:** ఈ సమయంలో విశ్రాంతి మంచి ఫలితాన్నిస్తుంది. పగటివేళ కొద్దిసేపు కునుకు తీస్తూ ఉండాలి.
- **తక్కువ ఉప్పు:** ఈ సమయంలో ఆహారంలో ఉప్పు తగ్గించాలి. ఉప్పు శరీరంలో నీరు నిలిచి ఉండేలా చేస్తుంది. దీంతో శరీరం బరువుగా తయారై అసౌకర్యం కలిగిస్తుంది.
- **మెగ్నీషియం, కాల్షియం:** ఈ రెండు ఖనిజలవణాలు కండరాల బిగువు సడలేలా చేస్తాయి. కాబట్టి ఇవి పుష్కలంగా ఉండే ఆకు కూరలు, పాలు తీసుకోవాలి.
- **మంచి కొవ్వులు:** కొబ్బరినూనె, వెన్నల్లో ఆరోగ్యానికి మేలు చేసే కొవ్వులు ఉంటాయి. కాబట్టి ఆహారంలో ఇవి ఉండేలా చూసుకోవాలి.
- **ఇవి మానేయాలి:** కెఫీన్, ప్రాసెస్డ్ ఫుడ్.

గుడ్ ఫుడ్

మెటబాలిజం పెరగాలంటే?

మెటబాలిజం వేగం తగ్గితే శరీరంలో క్యాలరీలు పేరుకుపోయి, స్థూలకాయం వేధిస్తుంది. కాబట్టి ఓ పక్క వ్యాయమాలు చేస్తూనే మెటబాలిజంను కూడా పరుగులు పెట్టించే ఆహారాన్ని ఎంచుకోవాలి.

మెటబాలిజం పెరగాలంటే ప్రొటీన్లు ఎక్కువగా, కాంప్లెక్స్ కార్బొహైడ్రేట్లు పరిమితంగా, మంచి కొవ్వులు తక్కువగా తీసుకోవాలి. అందుకోసం...



- **ప్రొటీన్:** గుడ్లు, లేత మాంసం (చికెన్, టర్కీ), చేపలు, సోయా, టోఫు, పప్పుధాన్యాలు తినాలి.
- **కాంప్లెక్స్ కార్బ్స్:** పాలిష్ పట్టని గోధుమలు, రోల్డ్ ఓట్స్, మిల్లెట్లు, పాలిష్ పట్టని బియ్యం, చిలకడ దుంపలు, తీపి మొక్కజొన్న తినాలి.
- **మంచి కొవ్వులు:** కొబ్బరి నూనె, సీడ్స్, నట్స్ అవకాడో అలాగే రోజుకు కనీసం మూడు లీటర్లకు తగ్గకుండా నీళ్ల తాగాలి. అలాగే మెటబాలిజంను పెంచే ఇంకొన్ని చిట్కాలను కూడా పాటించాలి. అవేంటంటే...
- మెటబాలిక్ రేట్‌ను నిద్ర కూడా ప్రభావితం చేస్తుంది. కాబట్టి 7 నుంచి 8 గంటలకు తగ్గకుండా నిద్రపోవాలి.
- మెటబాలికల్‌గా చురుగ్గా ఉండే అవయవాలు కండరాలు. మజిల్ మాస్ ఎక్కువగా ఉన్న వాళ్లలో మెటబాలిక్ రేటు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి కొవ్వును కరిగించి మజిల్ మాస్‌ను పెంచే వ్యాయమాలు చేయాలి.
- స్ట్రెంగ్త్ ట్రైనింగ్, హై ఇంటెన్సిటీ ఇంటర్వెల్ ట్రైనింగ్ వ్యాయామాలు మెటబాలిజంను పెంచుతాయి.

విమెన్స్ హెల్త్



గృహిణిగా, ఉద్యోగినిగా రెండు బాధ్యతలనూ సమర్థంగా నిర్వర్తించే క్రమంలో స్వీయశ్రద్ధను పక్కన పెట్టేసే మహిళలే ఎక్కువ. తినే ఆహారం మొదలు, అనుసరించే అలవాట్ల పట్ల మెలకువగా వ్యవహరించినప్పుడే, మహిళల ఆరోగ్యం చెక్కుచెదరకుండా ఉంటుంది. అందుకోసం మహిళలు ఎలా నడుచుకోవాలంటే...

కలకాలం ఉక్కు మహిళల్లా...

భర్తకూ, పిల్లలకూ, అత్తామామలకూ ఏం వండి పెట్టాలి? వాళ్ల అవసరాలన్నింటినీ ఎలా తీర్చాలి? కుటుంబసభ్యుల అలవాట్లకు తగ్గట్టుగా అన్నీ అమరుస్తున్నానా? అనే ఆలోచనలే మహిళల మనసుల్లో తిరుగుతూ ఉంటాయి. దాంతో తమ ఆకలి గురించీ, ఆరోగ్యం గురించీ శ్రద్ధ తగ్గిపోతుంది. ఫలితంగా బరువు పెరగడం, నెలసరి సమస్యలు వేధించడం, మధుమేహం, థైరాయిడ్ లాంటి సమస్యలు మొదలవుతాయి. నిజానికి వీటన్నింటినీ ఎంతో ముందుగానే నియంత్రించుకునే వీలున్నప్పటికీ, తమలో తలెత్తే మార్పులకు అంతగా ప్రాధాన్యం ఇవ్వని మహిళలు ఎంతో ఆలస్యంగా వైద్యులను కలుస్తూ ఉంటారు. ఫలితంగా జీవితాంతం మందులు వాడవలసిన ఆరోగ్య సమస్యలు అప్పటికే మహిళల్లో తిష్ఠ వేసుకుని ఉండిపోతాయి. ఇలా జరగకుండా ఉండాలంటే అన్నిటికంటే ముఖ్యంగా మహిళలు వాళ్లు తీసుకునే డైట్ మీద దృష్టి పెట్టాలి.

చురుగ్గా ఉంచే ఆహారం

భోజనంతో అవసరానికి మించిన పిండిపదార్థాలు, చక్కెరలు ఎక్కువగా, అత్యవసరమైన మాంసకృత్తులు, పీచు, ఆరోగ్యకరమైన కొవ్వులు తక్కువగా శరీరంలో చేరుతున్నాయేమో గమనించుకోవాలి. నిజానికి ఒక భోజనంలో 30 నుంచి 40% పిండిపదార్థాలు ఉంటే సరిపోతుంది. అంతకు మించి అవసరమే లేదు. కాబట్టి అన్నం బలం అనే అపోహను వదిలించుకుని, భోజనంలో అన్నం తక్కువగా పప్పుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. భారతీయ మహిళల్లో ఐరన్ లోపం ఎక్కువ. రక్తంలో హిమోగ్లోబిన్ సమంగా ఉండడం కోసం ఆహారంలో బీట్‌రూట్, క్యారెట్, దానిమ్మ, ఆకుకూరలు తీసుకోవాలి. ప్రొటీన్ కోసం మొలకలు, నట్స్, పప్పు పదార్థాలు, మాంసాహారం, పన్నీర్, టోఫు, సోయా ఇలా భోజనంలో 20 నుంచి 30% ప్రొటీన్ ఉండేలా చూసుకోవాలి. నీరసం నిస్సత్తువ ఆవరించకుండా రోజులో కూరగాయలూ పండ్లు కలిపి ఐదు రకాలు, వాల్‌నట్స్, బాదం, పిస్తా (మొత్తం కలిపి ఏడు నుంచి పది నట్స్) తీసుకోవాలి. మెనోపాజ్ మహిళల్లో క్యాల్షియం లోపం తలెత్తుతుంది. కాబట్టి ఆ లోటును పాలు, క్యాల్షియం సప్లిమెంట్లతో భర్తీ చేసుకోవాలి. ఇలా ముందు జాగ్రత్తగా ఉండగలిగితే, పెద్ద వయసు మహిళల్లో జారి పడి తుంటి విరిగే అవకాశాలు తగ్గుతాయి. ఎముకలు గుల్లబారడం, కీళ్ల అరిగిపోవడం లాంటి సమస్యలు కూడా తగ్గుతుంది.

నచ్చిన వ్యాయామం ఎంచుకుని...

రోజు మొత్తంలో కనీసం ముప్పై నిమిషాల పాటైనా వ్యాయామం చేయాలి. ఇంటిపనులే వ్యాయమాలతో సమానం అనుకుంటే పొరపాటు. గుండె వేగం పెరిగే వ్యాయామాలు చేస్తేనే వ్యాయామ ఫలం దక్కుతుంది. కాబట్టి నడక, యోగా. ఇలా సౌకర్యంగా ఉండే నచ్చిన వ్యాయామాన్ని ఎంచుకోవచ్చు. నెలసరిలో అవకతవకలు, వాటితో తలెత్తే మానసిక కుంగుబాటు, భావోద్వేగాలు అదుపు తప్పడం లాంటి ఇబ్బందులు వ్యాయామంతో అదుపులోకొస్తాయి. శరీరం చురుకుగా ఉంటే, మనసూ చురుగ్గా ఉంటుందనే విషయం గుర్తు పెట్టుకోవాలి. వ్యాయామంతో మానసిక ఒత్తిడి, కుంగుబాటు అదుపులోకి వస్తాయి. అలాగే వ్యాయామాలతో ఎత్తుకు తగిన బరువు సమకూరుతుంది. ఇలా బరువు అదుపులో ఉన్నంత కాలం వ్యాధులు దరి చేరవు.

హార్మోన్లలో హెచ్చుతగ్గులు ఇలా సమం

నెల నెలా వచ్చే నెలసరి చక్రంలోని వేర్వేరు దశల్లో హార్మోన్ల మోతాదులు కూడా వేర్వేరుగా ఉంటాయి. నెలసరి ముందు ఒకలా, నెలసరి తర్వాత ఇంకోలా హార్మోన్లలో హెచ్చుతగ్గులు చోటు చేసుకుంటూ ఉంటాయి. ఈ మార్పుల ప్రభావాల మూలంగా కొందరు మహిళలు తీవ్రమైన భావోద్వేగాలకు లోనవుతూ ఉంటారు. ఈ పరిస్థితి అదుపులోకి రావాలన్నా ఆరోగ్యకరమైన జీవనశైలినే అనుసరించాలి. సమతులాహారం, వ్యాయామం హార్మోన్లను సమంగా ఉంచుతాయి. అలాగే రెడీమేడ్, ప్యాకేజ్‌డ్ ఫుడ్స్, సాఫ్ట్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. అలాగే బరువు పెరిగినా హార్మోన్లలో హెచ్చుతగ్గులు తప్పవు. కాబట్టి డైట్, వ్యాయామాలతో బరువును అదుపులో ఉంచుకోవాలి. బాడీ మాస్ ఇండెక్స్ 23కి మించకుండా చూసుకోవాలి. కెఫీన్‌ను ఎక్కువగా తీసుకున్నా, భావోద్వేగాల మీద నియంత్రణ కోల్పోతాం. కాబట్టి వాటి పరిమాణం తగ్గించాలి. అదే పనిగా కాఫీలు, టీలు తాగేయకుండా, రోజుకు అర కప్పు కాఫీకి పరిమితం కావాలి.

ఉద్యోగినులు ఇలా...

ఉద్యోగినులు ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా పనులన్నీ సక్రమంగా ముగించడం కోసం పనుల్లో సమయపాలన పాటించడం ఎంతో అవసరం. వారం రోజుల్లో వంట, ఆఫీసుకు ధరించే దుస్తులకు సంబంధించిన ప్రణాళికను ముందే సిద్ధం చేసుకుంటే పనులు తేలికవుతాయి. అలాగే ఉదయాన్నే వంట పనుల్లో హడావుడి తగ్గాలంటే ముందు రాత్రే కూరగాయలను కట్ చేసి ఫ్రిజ్‌లో ఉంచుకోవచ్చు. అలాగే వంట పనుల్లో ఇంటి పనుల్లో భర్త, పిల్లల సహకారం తీసుకోవచ్చు. పనులను పంచుకునే పద్ధతిని కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ అలవాటు చేయాలి. అన్నిటికంటే ముఖ్యంగా ఉద్యోగిని పాత్రను ఇంటి గడప దగ్గరే వదిలేయడం అలవాటు చేసుకోవాలి. వృత్తిలోని ఒత్తిడిలను ఇంటికి మోసుకురాకూడదు. ఆఫీసు పనుల్లో అలసటకు గురి కాకుండా ఉండడం కోసం, లంచ్ బాక్స్‌తో పాటు నట్స్, ఫ్రూట్స్ లాంటివి అదనంగా వెంట తీసుకువెళ్లాలి. రోజంతా సరిపడా నీళ్ల తాగుతూ ఉండాలి. ఆఫీసు, ఇంటికే పరిమితమైపోకుండా, వారాంతాల్లో కుటుంబంతో పిక్నిక్‌లు లాంటివి ప్లాన్ చేసుకోవాలి. వ్యాయామం కూడా చేస్తూ ఉండాలి.

టీజీఈఆర్‌సీ ఛైర్మన్‌గా జస్టిస్ నాగార్జున్!

హైదరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ) ఛైర్మన్‌గా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దేవ రాజు నాగార్జున్‌ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సంబంధిత ఫైలుపై సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే సంతకం చేయగా.. త్వరలోనే ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తికి చెందిన జస్టిస్ నాగార్జున్.. వనపర్తి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్, ఆర్ఎల్‌డీ కాలేజీలో బీఎస్సీ, గుల్బర్గాలోని ఎస్ఎస్ఎల్ కాలేజీలో ఎల్ఎల్‌బీ చదివారు. అంతర్జాతీయ న్యాయ శాస్త్రంపై ఉస్మానియా వర్సిటీలో ఎల్ఎల్ఎం చేశారు. అమెరికాలోనూ న్యాయశాస్త్రంలో పలు కోర్సులు అభ్యసించారు. 1986లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకొన్న ఆయన.. 1991 మే 1వ తేదీన జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. 2004లో సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందారు. 2019 సెప్టెంబరు 17వ తేదీన కామారెడ్డి జిల్లా జడ్జిగా బాధ్యతలు చేపట్టారు. 2022 అక్టోబరు 18న హైకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. 2023 ఏప్రిల్ 6న మద్రాసు హైకోర్టుకు బదిలీ కాగా.. అక్కడే పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం టీజీఈఆర్‌సీ ఛైర్మన్‌గా పని చేస్తున్న తన్నీరు శ్రీరంగారావుతోపాటు ఇద్దరు సభ్యుల పదవీ కాలం ఈనెల 29న ముగియనుంది. కమిషన్‌ను ఖాళీగా ఉంచకుండా.. అదే రోజు సాయంత్రం కొత్త ఛైర్మన్‌గా జస్టిస్ డి.నాగార్జున్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను డిస్కమ్‌లు దాఖలు చేసిన ఏఆర్ఆర్, వీలింగ్ చార్జీలు, టారిఫ్ ప్రతిపాదనలపై విచారణ జరుగుతోంది. ప్రస్తుత కమిటీ ఈనెల 24వ తేదీన చివరి బహిరంగ విచారణ జరపనుంది.

కొండపోచమ్మ సాగర్‌పై విజిలెన్స్ గురి

- జలసౌధలో సంబంధిత పత్రాల కోసం సోదాలు
- సంబంధిత ఫైళ్లు అందించాలని అధికారులకు నిర్దేశం

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్‌పై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గురిపెట్టింది. రిజర్వాయర్ నిర్మాణంలో అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదు మేరకు సోమవారం విజిలెన్స్ అధికారులు జలసౌధలో సోదాలు నిర్వహించారు. ప్యాకేజీ-14లోని కొండపోచమ్మసాగర్‌కు నీటిని తరలించే గ్రావిటీ కెనాల్‌తోపాటు రెండు దశల పంప్‌హౌస్‌లపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి హైపవర్ కమిటీ నిర్ణయాలు, సైట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్టు, సమీక్ష సమావేశాల పత్రాలు, స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ, ఐబీఎం కమిటీ సమావేశాల మినిట్స్, నిర్మాణ వ్యయానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన పరిపాలన పరమైన అనుమతులు, రిజర్వాయర్ నిర్మాణంతో ముడిపడిన ఉత్తర ప్రత్యుత్తరాలు, 2008 నుంచి ఇప్పటిదాకా జరిగిన అకౌంటెంట్ జనరల్, కాగ్ నివేదికలను పరిశీలించిన అధికారులు... కొన్ని పత్రాలను వెంట తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన సమగ్ర ఫైళ్లను అందించాలని నిర్దేశించారు. మరోవైపు.. మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి గల కారణాలపై తుది నివేదిక అందించడానికి సిద్ధమవుతున్న విజిలెన్స్ అధికారులు.. సోమవారం ఈఎన్సీ(ఓ అండ్ ఎం) బి.నాగేంద్రరావు నుంచి పలు వివరాలు సేకరించారు. మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి కారణాలేంటి? 2019లో బ్యారేజీ నిర్మాణం పూర్తయిన తర్వాత ఓఅండ్ ఎం పనులు చేయకపోవడమేనా? బ్యారేజీ కుంగడానికి కారణం ఎవరు? అని ఆరా తీసినట్లు సమాచారం. 2019 జూన్‌లో బ్యారేజీ ప్రారంభమైన తర్వాత 2021 దాకా డిఫెక్ట్ లయబులిటీలో ఉందని, తర్వాత మూడేళ్లపాటు నిర్వహణ బాధ్యత నిర్మాణ సంస్థదేనని ఆయన బదులిచ్చినట్లు తెలిసింది. కాగా, మంగళవారం సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) మాజీ చీఫ్ ఇంజనీర్(సీఈ) టి.శ్రీనివాస్, డైరెక్టర్ వర్క్ అకౌంట్స్ డైరెక్టర్ వి.ఫణిభూషణ్‌శర్మ నుంచి విజిలెన్స్ వివరాలు సేకరించనుంది.

నేడు, రేపు మోస్తరు వర్షాలు

రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణ వ్యాప్తంగా 25 జిల్లాల్లో గంటకు 30-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆ 25 జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. అలాగే ఈ నెల 10 నుంచి 13 వరకు ఎటువంటి వర్షపాత హెచ్చరికలు లేవని వెల్లడించింది.

అవినీతి ఐపీఎస్‌లపై కొరడా!

(మొదటి పేజీ తరువాయి)

తెలుస్తోంది. ఇప్పుడు కూడా కొంత మంది ఐపీఎస్‌లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంతో వారి విషయాన్ని సర్కారు సీరియస్‌గా తీసుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎస్పీ స్థాయి అధికారి ఒకరు డబ్బులు తరలించినట్లు ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. విశ్రాంత ఐఏఎస్ అధికారి భన్వర్‌లాల్ విషయంలో ఓ ఐపీఎస్ వ్యవహరించిన తీరు సొంతశాఖలోనే విమర్శలకు దారితీసింది. ఇదేగాక కొందరు తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని భూ దందాలు, సెటిల్మెంట్‌లను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మరో ఘటనలో.. గతంలో ఓ జిల్లా ఎస్పీ పేకాటను కట్టడి చేయాల్సింది పోయి.. తన కుటుంబ సభ్యుల ద్వారా పేకాట నిర్వాహకుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఇందుకు సంబంధించి నిఘా విభాగం నుంచి ప్రభుత్వం పూర్తి వివరాలు సేకరించింది.

అధికార దుర్వినియోగంపై ఆరా..

ఓ ఐపీఎస్ అధికారి.. గన్‌లైసెన్సు జారీ విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన తీరు పైనా నిఘా విభాగం ఆరా తీస్తోంది. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారికి కరీంనగర్ చిరునామాతో గన్‌లైసెన్సు మంజూరు చేశారు. ఈ వ్యవహారంలో ఐపీఎస్ అధికారి చక్రం తిప్పినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. వాస్తవానికి కొంతకాలంగా గన్ లైసెన్సుల జారీ ప్రక్రియ దాదాపుగా నిలిపివేశారు. అత్యవసరమనుకుంటే అన్ని అంశాలను పరిశీలించి జారీ చేస్తున్నారు. అలాంటిది హైదరాబాద్‌లో ఉండే వ్యక్తికి జిల్లాలో గన్ లైసెన్సు ఇప్పించడం విస్మయం కలిగిస్తోంది. మరో జిల్లా ఎస్పీ.. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. ఇలా.. ఐపీఎస్ హోదాను అడ్డం పెట్టుకుని కొందరు అధికారులు చేస్తున్న పనులు పోలీస్ శాఖకే కాకుండా ప్రభుత్వానికే మచ్చతెచ్చేవిగా మారాయి. ఇలాంటి వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రభుత్వం సీరియస్‌గా ఉండటం, నిఘా విభాగం ఆరా తీస్తుందన్న విషయం తెలుసుకున్న ఒకరిద్దరు అధికారులు అప్రమత్తమైనట్లు కూడా తెలిసింది. మొత్తంగా అరడజను మంది ఐపీఎస్‌ల విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు, వారి మొత్తం రికార్డును తెప్పించుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలున్న వారిని కీలక పోస్టుల నుంచి తప్పించింది. మరీ శ్రుతి మించి వ్యవహరించేవారి విషయంలో అదే స్థాయిలో చర్యలు చేపట్టాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం.

అవినీతిపై జీరో టాలరెన్స్ విధానం..

అవినీతి, అలసత్వం, అధికార దుర్వినియోగం.. ఇలా కారణం ఏదైనా హోంగార్డు నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల వరకు ఉన్నతాధికారులు జీరో టాలరెన్స్ విధానం అనుసరిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారిని అప్రాధాన్య పోస్టులకు బదిలీ చేయడమో, వేకెన్సీ రిజర్వ్‌కు పంపడమో చేస్తున్నారు. అవసరమైతే సస్పెండ్ చేస్తున్నారు. ఇలా క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది శాఖాపరంగా చర్యలు ఎదుర్కొన్న ప్రతిసారీ.. పైస్థాయిలోని అవినీతి, అక్రమాలపై కొందరు వేలెత్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఐపీఎస్ స్థాయి అధికారుల విషయంలోనూ తగిన చర్యలు తీసుకోవడం ద్వారా మొత్తం పోలీస్ సిబ్బందికి ఒక సంకేతం ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

సింగరేణిని బతికించుకుందాం

- 11న కార్మికులకు విందు ఏర్పాటు చేసి సంస్థ వాస్తవ స్థితిగతుల వివరణ
- కోల్‌బెల్ట్ పరిధిలోని ప్రతి నియోజక వర్గంలో సమీకృత గురుకులాలు
- మాజీ కార్మికులకు పెన్షన్ పెంపుపై కమిటీ
- వైద్య చికిత్స సీలింగ్ 10లక్షలకు పెంపు: భట్టి
- ఇళ్లపై త్వరలో తీపికబురు: పొంగులేటి
- ఎన్నికల్లో హామీ మేరకు సింగరేణిలో మార్పు కనిపిస్తోంది: శ్రీధర్‌బాబు

సంస్థను నిలబెట్టే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది


సింగరేణి కార్మికులకు బోనస్ చెక్కును అందజేస్తున్న భట్టి, పొంగులేటి, శ్రీధర్‌బాబు

హైదరాబాద్, కొత్తగూడెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెబుతూ 'సింగరేణిని బతికిద్దాం.. మనం బతుకుదాం' అని ఆ సంస్థ కార్మికులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలను బతికించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా రూ.400 కోట్లను నెలనెలా అందిస్తూ ఆర్టీసీకి బతికించుకుంటున్నామని చెప్పారు. సింగరేణి సంస్థను నిలబెట్టి ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. దసరా సందర్భంగా ఈనెల 11న ప్రతి బొగ్గు బావి దగ్గర సింగరేణి కార్మికులకు విందు ఏర్పాటు చేసి, సంస్థ వాస్తవిక స్థితిగతులు వివరించి, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాభవన్‌లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటా రూ.796 కోట్ల చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా భట్టి, విశిష్ట అతిథులుగా మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడారు. సింగరేణి లాభాల్లో వాటా కింద ఒక్కో కార్మికుడికి రూ.1.9 లక్షలు, దీపావళి బోనస్ కింద రూ.93,750, దసరా పండుగ అడ్వాన్స్ కింద రూ.25 వేల చొప్పున అందించనున్నామన్నారు. లాభాల్లో వాటా, దసరా, దీపావళి బోనస్ కలిపి ఈ నెలలో రూ.1,261 కోట్లను కార్మికులకు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. తాడిచర్ల బొగ్గు గని సింగరేణికి కేటాయించాలని కోరామని, కోల్‌బెల్ట్‌లో ఒక్క గని బయటి వ్యక్తుల చేతికి వెళ్లకుండా అడ్డుకుంటామన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు ప్రయోగాత్మకంగా కోల్‌బెల్ట్‌లోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. సింగరేణి మాజీ కార్మికులకు పింఛను పెంపుపై కమిటీ వేసి, సాధ్యాసాధ్యాలపై చర్చించి, నిర్ణయం తీసుకుంటామన్నారు. వైద్య చికిత్స సీలింగ్ రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా పెంచుతున్నామన్నారు. అనంతరం పొంగులేటి మాట్లాడారు. కోల్‌బెల్ట్‌లో కార్మికులతో పాటు స్థానికులకు ఆధునిక విద్య, వైద్యం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్లకు సంబంధించి కార్మికులకు త్వరలో తీపి కబురు చెబుతామన్నారు. అనంతరం శ్రీధర్ బాబు మాట్లాడారు. ఎన్నికల కంటే ముందు ప్రతి వ్యవస్థలో మార్పు చూపిస్తామన్నామని ప్రకటించామని, ఆ మార్పు సింగరేణిలో కనిపిస్తోందన్నారు. కాగా సింగరేణి సమస్యలు పరిష్కరించాలని కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. కనీస వేతనాల అమలు కోసం జీవో నంబరు 22ను అమలు చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రామగుండం ఎమ్మెల్యే మఖన్‌సింగ్ ఠాకూర్ విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ నియామకాల్లో ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే జి.వినోద్, కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్ కోరారు. సింగరేణిలో నెలకు రూ.18 వేల లోపు పింఛన్ అందుకునే మాజీ కార్మికులు 90 శాతం మంది దాకా ఉన్నారని, శ్రీరాంపూర్‌లో 2500 ఎకరాల భూమిపై యాజమాన్య హక్కులను సాగుచేసుకుంటునవారికి ఇవ్వాలని మంచిర్యాల ఎమ్మెల్యే కె.ప్రేమ్‌సాగర్‌రావు డిమాండ్ చేశారు.

ఏడేళ్లకు సరిపడా విద్యుత్తు డిమాండ్‌కు తగ్గట్లుగా ప్రణాళికలు

రానున్న ఏడేళ్లకు సరిపడా విద్యుత్తు డిమాండ్‌ను తీర్చడానికి వీలుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ప్రస్తుతం 15,700 మెగావాట్లుగా ఉన్న పీక్ డిమాండ్.. రానున్న ఏడేళ్లకు 27వేల మెగావాట్లకు చేరనుందన్నారు. దీని కోసం అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్దేశించారు. సోమవారం సచివాలయంలో ట్రాన్స్‌కో పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ట్రాన్స్‌కో సబ్ స్టేషన్ల నిర్మాణ పనులను నిర్దీత వ్యవధిలోగా పూర్తిచేయాలన్నారు. ట్రాన్స్‌మిషన్ రంగంలో ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకోవడానికి వీలుగా రిసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, దీనిపై అధికారులకు తగిన శిక్షణ అందించాలన్నారు.

రేవంత్ సృష్టించిన భయంతో ఆదాయం తగ్గింది

- రిజిస్ట్రేషన్లు, రియల్ ఎస్టేట్ పడిపోయాయి
- తెలంగాణను ఏం చేద్దామనుకుంటున్నారు?:కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు గుండెకాయ వంటి హైదరాబాద్‌ను కాపాడుకోవడం చేతగాక సీఎం రేవంత్‌రెడ్డి సామాన్యులపైకి బుల్డోజర్లు పంపి భయాన్ని సృష్టించడంతో రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం తగ్గిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పనిమంతుడు పందిరేస్తే పిల్లి తోక తగిలి కూలిందన్నట్లు సీఎం తీరు ఉందంటూ ఆయన ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. హైడ్రా హైరానాతో రెండు నెలల్లో హైదరాబాద్ రియల్ ఎస్టేట్, రిజిస్ట్రేషన్లు పడిపోయి సర్కారు ఆదాయం తగ్గిపోయిందన్నారు. కొత్తగా ఆదాయం సృష్టించకపోయినా ఉన్నది ఊడగొడుతూ ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఫోర్త్‌సిటీపై ఫోకస్ చేసి అక్కడ కృత్రిమ రియల్ బూమ్‌కోసం ఆలోచిస్తున్నారని, సామాన్యుల ద్వారా కొనుగోలు, అమ్మకాలు లేకుంటే ఆదాయం ఎలా పెరుగుతుందని ఆయన రేవంత్‌ను ప్రశ్నించారు. తెలంగాణను ఏం చేద్దామనుకుంటున్నావ్ స్వామీ అంటూ కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రం అప్పుల పాలైందంటూ డబ్బులు లేవంటున్న రేవంత్ మూసీపేరిట లక్షన్నరకోట్ల సోకులు ఎవరి ప్రయోజనం కోసమో చెప్పాలన్నారు.

2 లక్షల ఉద్యోగాలిస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైంది?

- ఢిల్లీకి మూటలు పంపడంలో రేవంత్ బిజీ: బాల్క సుమన్

అధికారం చేపట్టిన ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలిస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రశ్నించారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ లాగా గత సర్కారు ఇచ్చిన నోటిఫికేషన్లకు సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేస్తున్నారని విమర్శించారు. ఇక్కడ మూటలు సర్దుకొని ఢిల్లీకి పంపడంలో రేవంత్ బిజీగా ఉన్నారని ఆరోపించారు.

నవ్య | చిత్రజ్యోతి



ట్రెండ్‌కు తగ్గట్లుగా...

గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న యూత్‌ఫుల్ సోషల్ డ్రామా 'యుఫోరియా'. నీలిమ గుణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో విఘ్నేష్, లిఖిత, పృథ్వీ, శ్రీనిక ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సోమవారం ఈ సినిమా గ్లింప్స్‌ను దిల్‌రాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "గ్లింప్స్ అదిరిపోయింది. నైట్ లైఫ్, డ్రగ్స్ కల్చర్ ఆధారంగా తెరకెక్కించిన చిత్రమిది. ట్రెండ్‌కు తగ్గట్లు రియలిస్టిక్‌గా ఉన్న ఈ సినిమా సూపర్ హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను" అని చెప్పారు. "ఈ సినిమాలో దాదాపు 90 శాతం మంది కొత్త వారే నటించారు. యూత్, పేరెంట్స్ మధ్య జరిగే సంఘర్షణే ఈ సినిమా కథాంశం" అని గుణశేఖర్ అన్నారు.

సంతృప్తినిచ్చింది



ఇటీవలే 'హరోం హర' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు సుధీర్‌బాబు. తాజాగా అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వంలో ఆయన నటించిన చిత్రం "మా నాన్న సూపర్‌హీరో". సునీల్ బలుసు నిర్మించారు. సాయిచంద్, షాయజీ షిండే కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 11న సినిమా విడుదలవుతున్న సందర్భంగా సుధీర్‌బాబు మీడియాతో ముచ్చటించారు.

"ఇది బలమైన సంఘర్షణతో నిండిన కథ. ఇద్దరు తండ్రులు.. ఓ కొడుకు మధ్య జరిగే ఆసక్తి కరమైన సినిమా అని చెప్పొచ్చు. ఇందులోని ప్రతీ సన్నివేశం ఎంతో లోతుగా ఉంటుంది. మానవ సంబంధాల మీద అరుదుగా కొన్ని సినిమాలు వస్తుంటాయి. ఈ సినిమా ఆ కోవకు చెందినదే. ఇందులో నటీనటుల నటన నుంచి కెమెరా యాంగిల్స్ వరకు ప్రతీది సహజంగా ఉండేలా దర్శకుడు కేర్ తీసుకున్నారు. సాయిచంద్, షాయాజీ షిండేలతో నటించడం మంచి వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్. సంగీత దర్శకుడు జైక్రిష్ అద్భుతమైన పాటలను ఇచ్చారు. ఇందులో ఉండే లవ్ ట్రాక్, స్టోరీని పక్కదారి పట్టనీయకుండా సందర్భానుసారం ఉంటుంది. ఇది పక్కా ఫ్యామిలీ చిత్రం. అవుట్‌పుట్ చూశాను. చాలా బాగా వచ్చింది. అందరికీ తప్పక నచ్చుతుంది. నేను ఇప్పటివరకూ చేసిన చిత్రాల్లో అత్యంత సంతృప్తిని ఇచ్చిన చిత్రమిదే. ప్రస్తుతం 'జటాధర' ప్రీ ప్రొడక్షన్ జరుగుతోంది. నా కెరీర్‌లోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రమిది" అని చెప్పారు.



రామాయణంలోని పాత్రల ఆధారంగా...

డైరెక్టర్ రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్‌లోని 'సింగం అగైన్'లో అజయ్ దేవ్‌గణ్ నటిస్తోన్న సంగతి తెలిసిందే. దాదాపు అయిదు నిమిషాల నిడివితో ఉన్న ఈ సినిమా ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. రామాయణంలోని ప్రధాన పాత్రలను స్ఫూర్తిగా తీసుకుని దానికి అనుగుణంగా సినిమాను తెరకెక్కిచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో అజయ్ దేవ్‌గణ్‌ను రాముడిగా, కరీనా కపూర్‌ను సీతగా.. అర్జున్ కపూర్‌ను రావణుడిగా, రణ్‌వీర్ సింగ్‌ను హనుమంతుడిగా, టైగర్ ష్రాఫ్‌ను లక్ష్మణునిగా పోల్చి చూపించారు. ఈ ట్రైలర్‌లో దీపికా పదుకొణె, అక్షయ్‌కుమార్ కూడా తళుక్కుమన్నారు. దీపావళి కానుకగా నవంబర్ 1న సినిమా విడుదలవుతోంది.

తెలుగు డబ్బింగ్‌లకు తమిళ టైటిల్సా?



'బొమ్మరిల్లు', 'కిక్', 'ఎవడు' సినిమాలతో సినీ రచయితగా మంచి గుర్తింపు పొందారు అబ్బూరి రవి. ప్రస్తుతం 'డెకాయిట్' సినిమాకు పని చేస్తున్న ఆయన.. ఎక్స్ వేదికగా తెలుగులో రిలీజ్ అవుతున్న డబ్బింగ్ సినిమా టైటిల్స్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలుగువారికి సుపరిచితం కాని పేర్లతో సినిమాల టైటిల్స్ పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. "తెలుగు ప్రేక్షకులని అగౌరవపరుస్తున్నారు. ఒకప్పుడు 'డబ్బింగ్' సినిమాలకు తెలుగు పేర్లు పెట్టేవారు. ఇతర భాషలలో ఉండే బోర్డులని చక్కగా తెలుగులోకి మార్చేవారు. ఇప్పుడు అదంతా మానేసి విడుదల చేస్తున్నారు. ఆయా భాషల గొప్పతనాన్ని.. వారి కళాత్మకతని గౌరవిస్తాను. కానీ తెలుగు ప్రేక్షకులని ఇంత తేలికగా తీసుకోవటం నచ్చట్లేదు. తెలుగుని గౌరవించని వాళ్లని కూడా తెలుగువారు గౌరవించడం, ఆదరించడం.. ఆ సినిమాలను చూడటం కోసం మన డబ్బులు ఖర్చు పెట్టడం గొప్పతనమని నేను మాత్రం అనుకోవట్లేదు" అని పేర్కొన్నారు. ఈ ట్వీట్ ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. మంచి పాయింట్‌ను లేవనెత్తారు అంటూ నెటిజన్లు రవి పోస్ట్‌కు మద్దతు పలుకుతున్నారు. 'కంగువ', 'వేట్టయాన్', 'తంగలాన్', 'రాయన్' 'వలిమై', లాంటి పేర్లు పలకడానికే కష్టంగా ఉన్నాయి.. అయినా అటువంటి టైటిల్స్ బదులు చక్కగా తెలుగు టైటిల్స్ పెట్టొచ్చు కదా అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

పవన్ ఫుట్‌బాల్ లాంటివారు

- తమిళ చానల్ ఇంటర్వ్యూలో ప్రకాశ్ రాజ్



ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని సినీ నటుడు ప్రకాశ్ రాజ్ మరోమారు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాజకీయాల్లో పవన్ కల్యాణ్ ఫుట్‌బాల్ లాంటివారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ తమిళ న్యూస్ చానెల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రకాశ్ రాజ్ మాట్లాడుతూ 'ఫుట్‌బాల్ ఆటను చూసేందుకు మైదానానికి వెళ్లే వ్యక్తి ప్రేక్షకుడిగా ఉండాలి. లేదా ఏదో ఒక టీమ్‌లో సభ్యుడిగానో, మ్యాచ్ అంపైర్‌గానో ఉండాలి. కానీ, పవన్ కల్యాణ్ ఫుట్‌బాల్ వంటివారు. మైదానంలో ఫుట్‌బాల్‌ని తన్నినట్టుగా ఎవరైనా తంతారు. సిగ్గూశరం లేని వ్యక్తి. ఒక అవకాశవాది. దేశంలో హిందూ ధర్మానికి, సనాతన ధర్మానికి ఎక్కడా ప్రమాదం పొంచిలేదు. బీజేపీ మాత్రమే ప్రమాదం ఉందంటూ చెబుతోంది.. ఈ విషయాన్ని ఆయన తెలుసుకుంటే మంచిది. తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ గతంలో సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యల్లో తప్పులేదు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని ఉదయనిధి ఎక్కడా చెప్పలేదు. సనాతన ధర్మంలోని హెచ్చుతగ్గులు, తారతమ్యాల గురించి మాత్రమే చెప్పారు' అని ప్రకాశ్ రాజ్ అన్నారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

నవ్వించే సినిమా

ఇన్ ప్రోగ్రెస్




సుహాస్, సంగీర్తన హీరోహీరోయిన్లుగా నటించిన 'జనక అయితే గనక' ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆదివారం మచిలీపట్నంలో జరిగింది. ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిధిగా హాజరై యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర సమర్పకుడు దిల్ రాజు మాట్లాడుతూ 'మీ జిల్లా వాడు, మీలో ఒకడైన సుహాస్ నటించిన సినిమా ఇది. 'జనక అయితే గనక' పెద్ద హిట్ కాబోతోంది. అందరినీ నవ్వించే సినిమా ఇది' అని తెలిపారు. ఈ చిత్ర విజయం మీద ఎంతో నమ్మకం ఉందని హీరో సుహాస్ చెప్పారు. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. సందీప్‌రెడ్డి బండ్ల దర్శకుడు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ నారాయణరావు కూడా పాల్గొన్నారు.

మేజర్ వరదరాజన్ కథ



శివ కార్తీకేయన్, సాయి పల్లవి జంటగా నటిస్తున్న 'అమరన్' చిత్రం నుంచి తొలి పాట 'హే రంగులే'ను హీరో నితిన్ విడుదల చేశారు. రామజోగయ్యశాస్త్రి రాసిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి, రమ్య బెహర పాడారు. శివ అరూర్, రాహుల్ సింగ్ రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్' అనే పుస్తకంలోని 'మేజర్ వరదరాజన్' కథ ఆధారంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను సుధాకరరెడ్డి, నిఖితా రెడ్డి ఈ నెల 31న తెలుగులో విడుదల చేస్తున్నారు.

మాస్ జాతర



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లు. సుజీత్, సందీప్ దర్శకత్వంలో చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం నుంచి 'ఆడు ఆడు ఆడు నిలువెల్లా పూనకమై' అంటూ సాగే జాతర సాంగ్ విడుదల చేశారు. పూనకాలు తెప్పించే రీతిలో ఉన్న ఈ పాటలో హీరోహీరోయిన్లు పాల్గొన్నారు. 'క' చిత్రాన్ని వంశీ నందిపాటి తెలుగులో, హీరో దుల్కర్ సల్మాన్ మలయాళంలో విడుదల చేస్తున్నారు.

బిజినెస్

అమ్మకానికి హైడెల్‌బర్గ్ సిమెంట్!

రేసులో అదానీ గ్రూప్ కంపెనీ • డీల్ విలువ రూ.10,000 కోట్లు!



న్యూఢిల్లీ: సిమెంట్ రంగంలో స్థిరీకరణ (కన్సాలిడేషన్) కొనసాగుతోంది. బహుళ జాతి సిమెంట్ కంపెనీలు క్రమంగా భారత మార్కెట్ నుంచి తప్పుకుంటున్నాయి. అదానీ గ్రూప్ సిమెంట్ కంపెనీ అంబుజా సిమెంట్, కుమార మంగళం బిర్లా గ్రూప్ సంస్థ అల్ట్రాటెక్ క్రమంగా ఈ బహుళ జాతి కంపెనీల వాటా కొనుగోలు చేస్తూ మార్కెట్‌పై పట్టు పెంచుకుంటున్నాయి. తాజాగా జర్మనీకి చెందిన హైడెల్‌బర్గ్ మెటీరియల్స్ కూడా భారత సిమెంట్ రంగం నుంచి తప్పుకునేందుకు నిర్ణయించింది. లిస్టెడ్ కంపెనీ హైడెల్‌బర్గ్ ఇండియా ఈక్విటీలో తనకు ఉన్న 69.39 శాతం వాటా విక్రయించేందుకు ఈ కంపెనీ అదానీ గ్రూప్ కంపెనీ అంబుజా సిమెంట్‌తో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. రెండు కంపెనీల మధ్య జరుగుతున్న చర్చలు ఫలిస్తే ఈ డీల్ విలువ 120 కోట్ల డాలర్ల (సుమారు రూ.10,000 కోట్లు) వరకు ఉంటుందని భావిస్తున్నారు. కాగా గత ఏడాది అల్ట్రాటెక్ సిమెంట్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ కూడా హైడెల్‌బర్గ్ సిమెంట్ కొనుగోలుకు ప్రయత్నాలు చేశాయి.

ఇదీ ప్రస్థానం: హైడెల్‌బర్గ్ 2006లో మైసూర్ సిమెంట్, కొచ్చిన్ సిమెంట్ కంపెనీల కొనుగోలు ద్వారా భారత సిమెంట్ మార్కెట్లోకి ప్రవేశించింది. అలాగే ఇండోరమా సిమెంట్‌తో జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం హైడెల్‌బర్గ్ మెటీరియల్స్, హైడెల్‌బర్గ్ సిమెంట్ ఇండియా అనే లిస్టెడ్ కంపెనీ, జువారీ సిమెంట్ అనే అన్‌లిస్టెడ్ కంపెనీల పేర్లతో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇందులో జువారీ సిమెంట్‌కు ఆంధ్రప్రదేశ్‌లోని ఎర్రగుంట్ల, తెలంగాణలోని సీతాపురం వద్ద సిమెంట్ ప్లాంట్లు ఉన్నాయి. ఇందులో హైడెల్‌బర్గ్ సిమెంట్ ఇండియా మార్కెట్ క్యాప్ రూ.4,957 కోట్ల వరకు ఉంది. రెండు కంపెనీల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 140 లక్షల టన్నుల వరకు ఉంటుంది. అయితే ఈ చర్చలపై హైడెల్‌బర్గ్, అదానీ గ్రూప్ అధికారికంగా నోరు మెదపడం లేదు. హైడెల్‌బర్గ్ ఇండియాకు కర్ణాటకతో పాటు ఉత్తరాది మార్కెట్లలో ప్లాంట్లు ఉన్నాయి. మైసెమ్, జువారీ బ్రాండ్‌తో సిమెంట్‌ను విక్రయిస్తోంది.

లాభాల్లో హైడెల్‌బర్గ్ షేరు: ఈ వార్తలతో సోమవారం స్టాక్ మార్కెట్లో హైడెల్‌బర్గ్ సిమెంట్ షేరు లాభాల బాట పట్టింది. మార్కెట్ నష్టాల్లో ఉన్నా బీఎస్ఈలో ఇంట్రాడేలో హైడెల్‌బర్గ్ సిమెంట్ షేరు 17.95 శాతం లాభంతో 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.257.85ని తాకింది. చివరికి 4.03 శాతం లాభంతో రూ.227.40 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలోనూ ఇంట్రాడేలో 17.93 శాతం లాభంతో 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.258ని తాకాయి. చివరికి 3.85 శాతం లాభంతో రూ.227.19 దగ్గర క్లోజైంది. రెండు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో 182.88 లక్షల హైడెల్‌బర్గ్ ఇండియా షేర్లు ట్రేడయ్యాయి.

లుఫ్తాన్సా టెక్నిక్‌తో జీఎంఆర్ ఏరో టెక్నిక్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లుఫ్తాన్సా టెక్నిక్‌తో జీఎంఆర్ ఏరో టెక్నిక్ జట్టు కట్టింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా లుఫ్తాన్సా టెక్నిక్ బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఇంజన్ కోర్ వాష్ సేవలను నిర్వహించనున్నట్లు జీఎంఆర్ ఏరో టెక్నిక్ సోమవారం ప్రకటించింది. అలాగే, దేశంలో వాణిజ్య విమాన ఇంజన్ వాషింగ్ సేవలనూ ఈ ఏడాది నాలుగో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో ప్రారంభించనున్నట్లు వెల్లడించింది.

2030 నాటికి విమాన ప్రయాణికులు 30 కోట్లు

న్యూఢిల్లీ: దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య 2030 నాటికి 30 కోట్ల స్థాయికి చేరుతుందని అంచనా. పెరుగుతున్న డిమాండుకు దీటుగా విమానాశ్రయాల అభివృద్ధి కోసం 1,100 కోట్ల డాలర్లు (రూ.92,400 కోట్లు) ప్రభుత్వం ఖర్చు చేయనుంది. ఫ్రెంచ్ ఏరోస్పేస్ పరిశ్రమల సంఘం (జిఫాస్) సోమవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ విషయం వెల్లడించారు. భారత, ఫ్రాన్స్ దేశాలు ఉమ్మడిగా ఎస్ఏఎఫ్ (సుస్థిర విమాన ఇంధనం) సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేస్తాయని ఆయన అన్నారు. ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్లలో భారత్ ఒకటని, పెరుగుతున్న డిమాండుకు దీటుగా విమానయాన సంస్థలు విమానాలను సమకూర్చుకుంటున్నాయని చెప్పారు. వచ్చే 20 నుంచి 25 సంవత్సరాల మధ్య కాలంలో దేశంలో మరో 200 విమానాశ్రయాలు సిద్ధం కానున్నాయన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,450 ▼	71,000 ▼	1,03,000 ▲
ముంబై	75,933 ▼	69,555 ▼	91,940 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

8వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	523	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	114	విజయవాడ	120
వరంగల్	114	గుంటూరు	123
కరీంనగర్	114	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	124
కర్నూలు	114	నెల్లూరు	124
విశాఖపట్నం	115	అనంతపురం	124
గోదావరి	120		

బీఓబీ గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ టెండుల్కర్



ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ).. సచిన్ టెండుల్కర్‌ను గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. సచిన్ భాగస్వామ్యంతో అంతర్జాతీయంగా అత్యంత విశ్వసనీయ బ్యాంకుల్లో ఒకటిగా బీఓబీ నిలుస్తుందని బీఓబీ దేబదత్త చంద్ ఈ సందర్భంగా అన్నారు. అలాగే బీఓబీ మాస్టర్‌స్ట్రోక్ సేవింగ్స్ అకౌంట్ పేరుతో ప్రీమియం బ్యాంక్ ఖాతాను బ్యాంక్ ప్రారంభించింది. ప్రస్తుతం బీఓబీ 17 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

బేర్ బిగిపట్టు

సెన్సెక్స్ 638 పాయింట్లు డౌన్

వరుసగా ఆరో రోజూ నష్టాలే..

25,000 దిగువకి నిఫ్టీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌పై బేర్ పట్టు బిగించడంతో సూచీలు వరుసగా ఆరో రోజూ నష్టాలు చవిచూశాయి. సోమవారం స్వల్ప లాభాలతో ట్రేడింగ్ ఆరంభించినప్పటికీ సూచీలు మళ్లీ జారుకున్నాయి. మధ్యాహ్నం ఒక దశలో సెన్సెక్స్ 962.39 పాయింట్ల మేర పతనమై 80,726.06 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 638.45 పాయింట్ల నష్టంతో 81,050 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 218.85 పాయింట్లు కోల్పోయి 24,795.75 వద్ద ముగిసింది. చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలోనైతే అమ్మకాలు పోటెత్తాయి. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ ఏకంగా 3.27 శాతం క్షీణించింది. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.85 శాతం నష్టపోయింది. అమ్మకాల ఉధృతి కొనసాగడంతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ మరో రూ.8.9 లక్షల కోట్లు తగ్గి రూ.451.99 లక్షల కోట్లకు (5.38 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. గడిచిన ఆరు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 4,786 పాయింట్లు కోల్పోగా.. నిఫ్టీ 1,420 పాయింట్లు నష్టపోయింది. 6 రోజుల్లో రూ.25.16 లక్షల కోట్ల మార్కెట్ సంపద హరించుకుపోయింది. కాగా దేశీయంగా పసిడి ధరలు సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయికి పెరిగాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.200 పెరిగి రూ.78,700కు చేరుకుంది.

- అకాయ్ ఇండియా మార్కెట్లోకి 4కే క్యూఎల్ఈడీ డిస్‌ప్లే టెక్నాలజీతో కూడిన టీవీలను విడుదల చేసింది. 190,254 సెంటీమీటర్ల స్క్రీన్స్‌తో ఇవది అందుబాటులో ఉండనున్నాయి. రెండేళ్ల వారంటీతో అందుబాటులో ఉండనున్న వీటి ధరలు వరుసగా రూ.99,990, రూ.3,99,990గా ఉన్నాయి.
- రిఫ్రిజిరేషన్ ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థ ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.500 కోట్లు, 2027-28 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.1000 కోట్ల టర్నోవర్‌ను లక్ష్యంగా పెట్టుకుంది. ఉత్పత్తి సామర్థ్యాల పెంపు, అంతర్జాతీయ మార్కెట్లోకి విస్తరించటం ద్వారా నిర్దేశిత లక్ష్యాన్ని అందుకోవాలని భావిస్తోంది. అంతేకాకుండా ఉత్పత్తి సామర్థ్యం పెంపు కోసం రూ.250 కోట్లు ఇన్వెస్ట్ చేయాలని నిర్ణయించింది.
- ఈ ఏడాది తొలి రెండు త్రైమాసికాల్లో యూజ్డ్ కార్ల విక్రయ సంస్థ స్పిన్నీ కార్ల విక్రయాల్లో మెరుగైన వృద్ధిని నమోదు చేసింది. అయితే సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కార్ల కొనుగోలుదారుల ప్రాధాన్యతలు, ఫైనాన్సింగ్‌లో ఎంపికలు సహా డెలివరీలో కీలకమైన మార్పులు చోటు చేసుకున్నట్లు స్పిన్నీ వ్యవస్థాపకుడు నీరజ్ సింగ్ అన్నారు. ఈ మార్పులు స్పిన్నీ కార్ల విక్రయాలు మరింతగా పెరిగేందుకు దోహదపడ్డాయన్నారు.

లాట్ మొబైల్స్‌లో దసరా, దీపావళి ఆఫర్లు



హైదరాబాద్: మొబైల్ రిటైల్ చెయిన్ లాట్ మొబైల్స్.. తన 12వ వార్షికోత్సవంతో పాటు దసరా, దీపావళి పండగల సందర్భంగా 'సెలబ్రేట్ విత్ లాట్' పేరుతో ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఇంతకుముందు ఎన్నడు లేని విధంగా స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్స్, ఎలక్ట్రానిక్స్ డ్యూరబుల్స్‌పై పలు ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు లాట్ మొబైల్స్ డైరెక్టర్ ఎం అఖిల్ వెల్లడించారు. ఇందులో భాగంగా రూ.9,999 వరకు విలువ చేసే ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతులతో పాటు స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ టీవీలు, ఏసీలు, ల్యాప్‌టాప్స్‌పై 40 శాతం తక్షణ తగ్గింపు సహా 10 శాతం నగదు వాపసు ఆఫర్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రతి ఒప్పో మొబైల్ కొనుగోలుపై లక్కీ డ్రా ద్వారా రూ.10 లక్షల వరకు నగదు గెలుచుకునే అవకాశంతో పాటు నో కాస్ట్ ఈఎంఐ ఫైనాన్స్ పథకాలు, బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 80 శాతం వరకు తగ్గింపును ఇస్తున్నట్లు తెలిపారు. ఈఎంఐ ఆఫర్‌గా ఏటీఎం కార్డు నుంచి రూ.1 ముందస్తు చెల్లింపు ద్వారా స్మార్ట్‌ఫోన్స్, టీవీలు, ఏసీలు కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు లాట్ మొబైల్స్ డైరెక్టర్ ఎం సుప్రజ తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్టోర్స్ కన్నా మెరుగైన ధరలు, డిస్కౌంట్స్ లాట్ మొబైల్ స్టోర్స్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

10 రోజుల్లో 12 కోట్ల స్పామ్ కాల్స్ గుర్తింపు

భారతి ఎయిర్‌టెల్ సీఈఓ శివన్ భార్గవ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని మొబైల్ సబ్‌స్క్రైబర్ల కోసం పూర్తి స్థాయిలో కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత స్పామ్ కాల్ డిటెక్షన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు భారతి ఎయిర్‌టెల్ సీఈఓ (ఏపీ, తెలంగాణ, కేరళ) శివన్ భార్గవ వెల్లడించారు. పది రోజుల క్రితం తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఈ స్పామ్ కాల్స్‌ను గుర్తించి, బ్లాక్ చేసే సేవలను ఎయిర్‌టెల్ ప్రారంభించింది. సస్పెక్టెడ్ స్పామ్ కాల్స్, మెసేజీలను గుర్తించేందుకు ఎయిర్‌టెల్ సొంతంగా ఏఐ ఆధారిత సొల్యూషన్‌ను రూపొందించిందని భార్గవ పేర్కొన్నారు. గడిచిన పది రోజుల్లో ఏపీ, తెలంగాణల్లో 12.2 కోట్ల సస్పెక్టెడ్ స్పామ్ కాల్స్‌తో పాటు 23 లక్షల సంక్షిప్త సందేశాలను ఈ విధానంగా ద్వారా గుర్తించి వాటిని బ్లాక్ చేసినట్లు ఆయన చెప్పారు. దేశవ్యాప్తంగా రోజుకు 100 కోట్ల కాల్స్‌ను తమ ఏఐ ఆధారిత టూల్ ద్వారా గుర్తించి వినియోగదారులు వాటి బారిన పడకుండా చేసినట్లు ఆయన తెలిపారు.

ఇటీవలి కాలంలో ఈ తరహా అవాంఛనీయ కాల్స్ బారిన పడిన ప్రజలు భారీగా నష్టపోతున్నారని, వీటిని కట్టడి చేసే ఉద్దేశంతో ఈ తరహా సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. ఏపీ, తెలంగాణలోని 3.38 కోట్ల మంది ఎయిర్‌టెల్ సబ్‌స్క్రైబర్స్‌కు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని భార్గవ తెలిపారు.

స్పోర్ట్స్

బరిలోకి దిగిన తొలి ప్రపంచకప్‌లోనే స్టార్ షూటర్లకు చెమటలు పట్టించి.. తెలుగోడి సత్తాను ప్రపంచానికి చాటాడు. ఒకటి, రెండు కాదు ఒకే జూనియర్ వరల్డ్‌కప్‌లో ఏకంగా ఏడు పతకాలు కొల్లగొట్టి.. ఈ ఘనత సాధించిన తొలి తెలుగు షూటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఈ పతకాల మోతతో ఒక్కసారిగా యావద్దేశం దృష్టిని ఆకర్షించిన నేలవల్లి ముకేష్ గురించి తెలుసుకుందాం..

నయా బుల్లెట్

జూ. ప్రపంచకప్‌లో అదరగొట్టిన ముకేష్



(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

గుంటూరు శ్రీనగర్‌కాలనీకి చెందిన సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన నేలవల్లి ముకేష్ ఇప్పుడు తన నిఖార్సయిన గురితో దేశవ్యాప్తంగా సంచలనంగా మారాడు. మూడేళ్లుగా జాతీయ స్థాయిలో పతకాలను సాధిస్తున్నా ఈ 19 ఏళ్ల షార్ప్ షూటర్.. పెరూలో తాజాగా ముగిసిన జూనియర్ షూటింగ్ వరల్డ్‌కప్‌తో వెలుగులోకి వచ్చాడు. ఐదు స్వర్ణాలు సహా ఏకంగా ఏడు పతకాలు కొల్లగొట్టడంతో ముకేష్ పేరు మార్మోగుతోంది. 13 ఏళ్ల వయస్సులో పాఠశాల సమ్మర్ క్యాంప్‌లో సరదాగా షూటింగ్ నేర్చుకోవడం ప్రారంభించిన ముకేష్ అతి తక్కువ కాలంలోనే ఆ క్రీడపై మక్కువ పెంచుకున్నాడు.

గుంటూరులోనే ఓనమాలు..: గుంటూరులోని ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్‌లో మాజీ షూటర్ సుబ్రహ్మణ్యం దగ్గర ఓనమాలు నేర్చుకోవడం ప్రారంభించాక ముకేష్‌కు గురి కుదిరింది. 2017లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సీనియర్, యూత్, జూనియర్ విభాగాల్లో తన కంటే పెద్దవారితో పోటీపడి స్వర్ణాలు సొంతం చేసుకోగా, సౌత్ జోన్‌లో జరిగిన పోటీల్లో రెండు రజతాలు, ఒక కాంస్యం సాధించాడు. అదే ఏడాది జరిగిన జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్ యూత్ కేటగిరీలో కాంస్యం నెగ్గి, ఆలిండియా స్థాయిలో తన ప్రస్థానాన్ని ఘనంగా మొదలుపెట్టాడు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కలిపి 50కి పైగానే పతకాలు అందుకున్న ముకేష్, ఇప్పుడు భారత్ షూటింగ్ ఆశాకిరణంగా మారాడు.

ఖేలో ఇండియాతో మలుపు :: ముకేష్ కెరీర్‌ను ఖేలో ఇండియా యూత్ గేమ్స్ మలుపు తిప్పింది. 2019లో జరిగిన పోటీల్లో అండర్-17 విభాగంలో కాంస్యం సాధించిన ముకేష్ ప్రతిభను గుర్తించిన 'సాయ్' ఉపకార వేతనం ఇవ్వడం ప్రారంభించింది. కొవిడ్‌కు ముందు కొద్దికాలం హైదరాబాద్‌లోని 'గన్ ఫర్ గ్లోరీ' అకాడమీలో శిక్షణ తీసుకున్న ముకేష్, కరోనా కారణంగా మళ్లీ గుంటూరు చేరాడు. ఆతర్వాత పుణెలోని గన్ ఫర్ గ్లోరీ అకాడమీలో చేరాక ముకేష్ రాటుదేలాడు. ప్రస్తుతం భారత కోచ్ సీకే చౌధురి, జర్మనీకి చెందిన ఒయి క్రీప్ దగ్గర శిక్షణ తీసుకుంటున్న ముకేష్ తాజాగా ముగిసిన షూటింగ్ వరల్డ్ కప్‌లో తన సత్తా నిరూపించాడు. తమ తాహతుకుమించి ఇప్పటికే రూ.35 లక్షలు ఖర్చుచేశామని, ఇకపై రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చి ప్రోత్సహిస్తే తమ కుమారుడు భవిష్యత్‌లో దేశం గర్వించే ప్రపంచ స్థాయి షూటర్‌గా ఎదుగుతాడని ముకేష్ తల్లిదండ్రులు చెబుతున్నారు. ముకేష్ తదుపరి పోటీల్లోనూ రాణించి, వచ్చే ఒలింపిక్స్‌లో దేశానికి పతకాలు అందించాలని ఆకాంక్షిద్దాం.

లిమా (పెరూ): జూనియర్ షూటింగ్ వరల్డ్‌కప్‌ను భారత్ స్వర్ణంతో ముగించింది. పురుషుల 50 మీటర్ల పిస్టల్ విభాగంలో దీపక్, కమల్‌జీత్, రాజ్‌చంద్ర త్రయం స్వర్ణం నెగ్గింది. భారత్ 13 స్వర్ణాలు సహా 24 మెడల్స్‌తో అగ్రస్థానంతో టోర్నీని ముగించింది.

మయాంక్ దశ తిరిగినట్టే!



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో అరంగేట్రం చేసిన భారత పేసర్ మయాంక్ యాదవ్ ఇప్పుడు అన్‌క్యాప్‌డ్ ప్లేయర్ కాదు. అందుకే ఐపీఎల్ వేలానికి ముందే అతడు మిలియన్ డాలర్ క్లబ్‌లో చేరే అవకాశం ఉంది. గంటకు 150 కి.మీ వేగంతో బంతులు విసిరే ఈ ఢిల్లీ పేసర్‌ను లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ వేలంలోకి వదులుతుందనుకోవడం అత్యాశే అవుతుంది. కచ్చితం గా అతడిని రిటైన్ చేసుకుంటుంది. మూడో ప్రాధాన్య ఆటగాడిగా అట్టిపెట్టుకున్నా రూ.11 కోట్లు (1.31 మిలియన్ డాలర్లు) ఇవ్వాల్సి ఉంటుంది. లీగ్ నిబంధనల ప్రకా రం ఏ ఫార్మాట్‌లోనైనా భారత జట్టు తరఫున ఒక్క మ్యాచ్ ఆడినా క్యాప్‌డ్ ప్లేయర్ అవుతాడు. అలాగే రిటైన్ చేసుకునే తొలి ముగ్గురు ఆటగాళ్లకు వరుసగా రూ.18 కోట్లు, రూ.14 కోట్లు, రూ.11 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఐపీఎల్ నిబంధనల ప్రకారం ఫ్రాంచైజీలు ఆరుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకోవచ్చు. మరోవైపు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆర్‌టీఎం ద్వారా తిరిగి తీసుకునే చాన్స్ ఉంది.

మహిళల వరల్డ్ కప్‌లో నేడు

ఆస్ట్రేలియా X న్యూజిలాండ్

రాత్రి 7.30 నుంచి

స్టార్ నెట్‌వర్క్, డిస్నీ హాట్‌స్టార్‌లో

జిమ్నాస్టిక్స్‌కు దీప గుడ్‌బై



న్యూఢిల్లీ: రియో ఒలింపిక్స్‌లో త్రుటిలో పతకం చేజార్చుకొన్న జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ (31) కెరీర్‌కు వీడ్కోలు పలికింది. విశ్వక్రీడల బరిలోకి దిగిన తొలి భారత జిమ్నాస్ట్‌గా చరిత్ర సృష్టించిన దీప.. 2016 రియో క్రీడల్లో నాలుగో స్థానంలో నిలిచింది. ఎంతో క్లిష్టమైన ప్రొదునోవా వాల్ట్‌లో దీప తనదైన ముద్ర వేసింది. 'విశ్రాంతి తీసుకోవాల్సిన సమయం వచ్చింది. ఎంతో ఆలోచించిన తర్వాత కెరీర్‌కు గుడ్‌బై చెప్పాలనుకొంటున్నా. ఏదో ఒకరోజు కోచ్‌గా తిరిగి రావచ్చు లేదా భవిష్యత్ జిమ్నాస్ట్‌లకు మద్దతుగా తెరవెనుకే నిలవచ్చ'ని దీప పేర్కొంది. అగర్తలాకు చెందిన కర్మాకర్ ఆరేళ్ల వయసు నుంచే జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ ఆరంభించింది. 'వాల్ట్ ఆఫ్ డెత్'గా పిలిచే ప్రొదునోవా వాల్ట్ ఫీట్ చేసే ప్రపంచంలోని ఐదుగురు జిమ్నాస్ట్‌ల్లో దీప కూడా చోటు సంపాదించింది. 2014 కామన్వెల్త్ క్రీడల్లో కాంస్య పతకంతో ఆమె ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత 2015 ఆసియా చాంపియన్‌షిప్స్‌లో కాంస్యం, 2015 వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో ఐదో స్థానంలో నిలిచింది. 2016 రియో ఒలింపిక్స్‌లో 0.15 పాయింట్ల తేడాతో పతకం చేజార్చుకొని నాలుగో స్థానంలో నిలిచింది. 2018లో తుర్కియేలో జరిగిన ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ వరల్డ్‌కప్‌లో స్వర్ణం నెగ్గిన దీప.. అంతర్జాతీయ ఈవెంట్‌లో పసిడి సాధించిన తొలి భారత జిమ్నాస్ట్‌గా చరిత్ర సృష్టించింది. అదే ఏడాది జర్మనీలో జరిగిన వరల్డ్‌కప్‌లో కాంస్యం, 2021 ఆసియా జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణం నెగ్గింది. అయితే, 2021 అక్టోబరులో డోపింగ్‌లో పట్టుబడిన కర్మాకర్‌పై రెండేళ్ల నిషేధం విధించారు. 2023లో నిషేధం తొలగినతర్వాత పునరాగమనం చేసినా ఆశించినరీతిలో ప్రదర్శన కనబర్చలేక పోయింది. ప్రభుత్వం ఆమెను పద్మశ్రీ, ఖేల్‌రత్న, అర్జున అవార్డులతో సత్కరించింది.

మనమ్మాయిలు సెమీస్ చేరాలంటే..



ఇతర జట్ల ఫలితాలు కీలకం

మహిళల టీ20 వరల్డ్‌కప్

దుబాయ్: మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో ఒక ఓటమి, ఒక గెలుపుతో భారత క్రికెట్ జట్టు గ్రూప్ 'ఎ'లో నాలుగో స్థానంలో ఉంది. కివీస్ చేతిలో ఆరంభ మ్యాచ్‌లో చిత్తుగా ఓడినందుకు నెట్ రన్‌రేట్ కూడా మైనస్‌లో కొనసాగుతోంది. మనకన్నా పాక్ మెరుగైన స్థానం (3)లో ఉండడం గమనార్హం. మరిప్పుడు.. హర్మన్‌ప్రీత్ సేనకు సెమీస్ అవకాశాలున్నాయా? అంటే పూర్తిగా లేవనీ కొట్టిపారేయలేం. ఇంకా ఈ గ్రూపులో ఆరు మ్యాచ్‌లు జరగాల్సి ఉన్నాయి. అప్పుడే సెమీస్‌కు వెళ్లే జట్లపై స్పష్టత వస్తుంది. దీంట్లో ముందుగా భారత జట్టు శ్రీలంక, ఆసీస్‌లపై భారీ తేడాతో విజయం సాధించాలి. ఆ తర్వాత కూడా ఇతర జట్ల ఫలితాలపైనే ఆధారపడాల్సి ఉంటుంది. లంకపై గెలిస్తే జట్టు మూడో స్థానానికి వెళుతుంది. అయితే మహిళల ఆసియాకప్ ఫైనల్లో ఇదే జట్టు చేతిలో భారత్ ఓడిన విషయం మరువరాదు. ఇక రెండేసి పాయింట్లతో ఉన్న ఆసీస్-కివీస్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లో ఎవరు గెలిచినా రన్‌రేట్ ప్రకారం టాప్-2లోనే ఉంటారు. మరోవైపు ఆసీస్ ఫామ్ దృష్ట్యా కివీస్, పాక్‌లతో జరిగే మ్యాచ్‌ల్లో సులువుగానే నెగ్గే అవకాశాలున్నాయి. అదే జరిగితే గ్రూప్ టాపర్‌గా సెమీస్ చేరుతుంది. కానీ భారత్ సెమీస్ చేరాలంటే కివీస్ జట్టు తమ మిగిలిన మ్యాచ్‌లను గెలవాలని కోరుకోవాలి. అదే జరిగితే గ్రూప్ ఎ నుంచి కివీస్‌తో పాటు భారత్ సెమీస్‌కు వెళుతుంది. ఒకవేళ ఆసీస్ జట్టు కివీస్‌పై గెలిచి.. భారత్ తన రెండు మ్యాచ్‌లను గెలిస్తే ఈ మూడు జట్లు ఆరేసి పాయింట్లతో ఉంటాయి. ఆ పరిస్థితిలో నెట్ రన్‌రేట్ మెరుగ్గా ఉన్న టాప్-2 టీమ్స్ సెమీస్ బెర్త్ దక్కించుకుంటాయి. ఏదేమైనా ఈ గ్రూపులో జరిగే చివరి మూడు మ్యాచ్‌లతో సెమీస్ బెర్త్‌పై స్పష్టత రానుంది.

గమ్‌బాల్ కాదు.. గోహిట్ ఆట



న్యూఢిల్లీ: ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్టులో భారత జట్టు టీ20 తరహా ఆటతీరుతో చెలరేగి సిరీస్‌ను దక్కించుకుంది. తొలి మూడు రోజుల ఆట దాదాపు వర్షార్పణం కావడంతో చివరి రెండు రోజుల్లోనే తమ తుఫాన్ ఆటతీరుతో రికార్డులను బద్దలుకొట్టిన విషయం తెలిసిందే. అయితే కొత్త కోచ్ గౌతం గంభీర్ రాకతోనే జట్టు ఈ తరహా ఆటను ప్రదర్శించిందని, అందుకే దీన్ని బజ్‌బాల్ తరహాలో 'గమ్‌బాల్' క్రికెట్‌గా పేర్కొనవచ్చని పలువురు కామెంట్స్ చేశారు. కానీ మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ మాత్రం కెప్టెన్ రోహిత్ శర్మకే ఈ క్రెడిట్ ఇవ్వాలని స్పష్టం చేశాడు. 'గంభీర్ వచ్చి కొంత కాలమే అయ్యింది. అయితే రోహిత్ ఈ తరహా ఆటను ఎప్పటినుంచో ఆడుతున్నాడు. ఇతర ఆటగాళ్లను కూడా ప్రోత్సహించాడు. ఇంగ్లండ్ కోచ్ మెకల్లమ్‌లాగా గంభీర్ ఎప్పుడూ దూకుడుగా బ్యాటింగ్ చేయలేదు. అందుకే ఈ ఆటను రోహిత్ పేరు నుంచి తీసుకుంటూ 'గోహిట్'గా భావించాలని సూచిస్తాను' అని సన్నీ వివరించాడు.

మసూద్, అబ్దుల్లా శతకాలు



పాకిస్థాన్ 328/4 ● ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్

ముల్తాన్: ఎట్టకేలకు పాకిస్థాన్ జట్టు ఆట గాడిలో పడ్డట్టే కనిపిస్తోంది. స్వదేశంలో వరుస పరాజయాల నుంచి కోలుకొని ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్‌లో సత్తా చాటే ప్రయత్నం చేస్తోంది. సోమవారం మొదలైన మ్యాచ్‌లో కెప్టెన్ షాన్ మసూద్ (151), ఓపెనర్ అబ్దుల్లా షఫీక్ (102) సెంచరీలతో కదం తొక్కారు. దాంతో తొలిరోజు ఆఖరికి ఆతిథ్య జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 328 పరుగులు చేసింది. షాన్, షఫీక్ రెండో వికెట్‌కు 253 పరుగులు జోడించారు. అట్కిన్సన్ రెండు వికెట్లు పడగొట్టాడు.

ఇంగ్లండ్ ఆల్ రౌండ్ షో

ఏడు వికెట్లతో సౌతాఫ్రికాపై గెలుపు



బ్రంట్ (48)

షార్జా : ఇంగ్లండ్ ఆల్‌రౌండ్ షోతో టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్ దిశగా మరో అడుగు వేసింది. సోమవారం జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఆ జట్టు ఏడు వికెట్లతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. నలుగురు స్పిన్నర్లతో బరిలో దిగిన ఇంగ్లండ్ తొలుత సౌతాఫ్రికాను 124 పరుగులకే పరిమితం చేసింది. వోల్వార్ట్ (42), కాప్ (26) రాణించారు. డెర్క్‌సెన్ (11 బంతుల్లో 20 నాటౌట్) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఎకిల్‌స్టోన్ 2 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో బ్రంట్ (48 నాటౌట్), వ్యాట్ (43) రాణించడంతో 19.2 ఓవర్లలో 125/3 చేసి సఫారీలు నెగ్గారు.

సంక్షిప్తస్కోర్లు : సౌతాఫ్రికా 20 ఓవర్లలో 124/6 (వోల్వార్ట్ 42, కాప్ 26, ఎకిల్‌స్టోన్ 2/15); **ఇంగ్లండ్ 19.2 ఓవర్లలో 125/3** (బ్రంట్ 48 నాటౌట్, వ్యాట్ 43, కాప్ 1/17, ఎం లాబా 1/22, డి క్లెర్క్ 1/23).

అలాస్కన్ నైట్స్‌కు షాక్

లండన్: గ్లోబల్ చెస్ లీగ్‌లో ఐదు వరుస విజయాలతో జోరు మీదున్న అలాస్కన్ నైట్స్‌కు తొలిసారి షాక్ తగలగా.. ఆనంద్ సారథ్యం వహిస్తున్న గ్యాంజీస్ గ్రాండ్ మాస్టర్స్ రెండో విజయాన్ని నమోదు చేసింది. సోమవారం జరిగిన ఆరో రౌండ్ మ్యాచ్‌లో అల్పైన్ ఎస్‌జీ పైపర్స్ 9-7తో నైట్స్‌కు షాకిచ్చింది. త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ 10-8తో అప్‌గ్రాడ్ ముంబా మాస్టర్స్‌పై నెగ్గింది. కాగా, గ్యాంజీస్ గ్రాండ్ మాస్టర్స్ 10-4తో అమెరికన్ గాంబిట్స్‌పై గెలిచింది.

19 నుంచి బీఫార్మసీ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఫార్మసీ, ఫార్మా-డి, బయో-టెక్నాలజీ వంటి కోర్సుల భర్తీ కోసం ఈ నెల 19వ తేదీ నుంచి కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఎప్‌సెట్ ప్రవేశ పరీక్ష రాసిన బైపీసీ అభ్యర్థుల కోసం ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 19 నుంచి 22వరకు అభ్యర్థులు స్లాట్‌ను నమోదు చేసుకుని కౌన్సెలింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 23వ తేదీలోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను చేపడతారు. 21 నుంచి 25వ తేదీ వరకు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. 28న సీట్లను కేటాయిస్తారు. సీట్లు పొందిన అభ్యర్థులు 30వ తేదీలోపు ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. వచ్చే నెల 4వ తేదీ నుంచి తుది దశ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తారు.

సహకార గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జగన్ మోహన్ రావు

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సహకార శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా ఎన్నమనేని జగన్ మోహన్ రావు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా దేవునూరి భీంరాజ్ ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన నూతన కమిటీ టీజీవో భవన్‌లో సమావేశమైంది. ఎన్నికల్లో గెలిచిన ప్రతినిధులకు టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ. సత్యనారాయణ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా టీజీవో అధ్యక్షుడు మాట్లాడుతూ.. సహకార శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీజీవో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. త్వరలోనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమావేశమై సహకార శాఖలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులపై చర్చిస్తామని తెలిపారు.

113 గొత్తికోయల గుడిసెలు తొలగింపు

ఏటూరునాగారం, అక్టోబరు 7: గొత్తికోయలు నివాసముంటున్న 113 గుడిసెలను అటవీశాఖ అధికారులు తొలగించారు. ఈ సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి పంచాయతీ పరిధిలోని కొమరంభీం గ్రామంలో సోమవారం జరిగింది. అటవీ శాఖ రొయ్యూరు 141, 142 బీట్ల పరిధిలోని భూముల్లో గొత్తికోయలు కొన్నేళ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. వాటిని ఖాళీ చేయాలని వారికి అటవీశాఖ అధికారులు పలుమార్లు నోటీసులు పంపించారు. అయినా వారు గుడిసెలను తొలగించలేదు. దాంతో అధికారులు భారీ యంత్రాలతో ఆ గుడిసెలను తొలగించారు. అక్కడే ఉన్న తుడుందెబ్బ జెండాను కూడా ధ్వంసం చేశారు. పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా, నోటీసులు జారీ చేసినా అటవీశాఖ భూముల్లోని గుడిసెలను తొలగించలేదని, అందుకే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. తాము ఎన్నో ఏళ్లుగా ఇక్కడ గుడిసెలు వేసుకుని జీవిస్తున్నామని, అధికారులు నిర్దాక్షిణ్యంగా వాటిని తొలగించి తమకు నిలువనీడ లేకుండా చేశారని గొత్తికోయలు ఆవేదన వ్యక్తం చేశారు.

5 రోజుల ఈడీ కస్టడీకి సాహితి లక్ష్మీనారాయణ

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : విల్లాల నిర్మాణం పేరుతో ప్రజల్ని మోసగించిన సాహితి ఇన్‌ఫ్రా ఎండీ లక్ష్మీనారాయణ ఈడీ కస్టడీకి కోర్టు అనుమతించింది. విల్లాల నిర్మాణం పేరుతో రూ. 360 కోట్లు దారి మళ్లించిన ఆరోపణలపై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ చేపట్టింది. చంచల్‌గూడ జైల్లో విచారణ ఖైదీగా ఉన్న లక్ష్మీనారాయణను పూర్తిస్థాయిలో విచారించేందుకు కస్టడీకి అనుమతించాలని ఈడీ అధికారులు ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ అనంతరం న్యాయస్థానం 14 నుంచి 18 వరకు 5రోజుల కస్టడీకి అనుమతిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పెళ్లి చేసుకోవాలంటూ బాలికకు వేధింపులు

- ఒత్తిడి తాళలేక మైనర్ బలవన్మరణం

అల్వాల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లే బాలికను వివాహమై భార్య పిల్లలు ఉన్న ఓ వ్యక్తి ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేశాడు. దీంతో వేధింపులు భరించలేక సదరు బాలిక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన అల్వాల్‌లో సోమవారం జరిగింది. అల్వాల్ లోతుకుంటలోని ఓ ప్రాంతంలో నివసించే బాలిక(17) స్థానికంగా పదో తరగతి చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన (30) ఏళ్ల వ్యక్తి బ్యాండ్ వాయించడంతో పాటు పోతరాజు వేషాధరణ చేస్తుంటాడు. అతనికి ఇది వరకే వివాహమై భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సదరు వ్యక్తి నివసించే ప్రాంతానికి దగ్గరలో ఉండే బాలికపై ఆ కామాంధుడి కన్ను పడింది. దీంతో తరుచుగా పాఠశాలకు వెళ్లి వస్తున్న క్రమంలో బాలికను వేధించసాగాడు. తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేశాడు. రోజురోజుకూ అతడి వేధింపులు ఎక్కువ కావడంతో భరించలేక సదరు బాలిక ఆదివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది.

జర్నలిస్టులకు సర్కారు దసరా కానుక ఇదేనా?

- కరీంనగర్‌లో ఇళ్ల స్థలాల రద్దుపై హరీశ్‌రావు నిలదీత

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో 118 మంది జర్నలిస్టులకు బీఆర్ఎస్ సర్కారు కేటాయించిన ఇళ్ల స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవడాన్ని ఖండిస్తున్నానని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చే దసరా కానుక ఇదేనా? అని 'ఎక్స్' వేదికగా సోమవారం నిలదీశారు. బతుకమ్మ, దసరా పండుగల వేళ జర్నలిస్టుల కుటుంబాల్లో ఆవేదన మిగల్చడం శోచనీయమన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిత్యం శ్రమించే జర్నలిస్టుల పట్ల కాంగ్రెస్ వ్యవహరిస్తున్న దుర్మార్గ వైఖరికి ఇది మరో నిదర్శనమని మండిపడ్డారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల రద్దు ప్రకటనను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జేఎన్టీయూలో 15 మంది విద్యార్థుల సస్పెన్షన్

- గత నెల 24న ఘర్షణ.. చర్యలు తీసుకున్న ప్రిన్సిపాల్

హైదరాబాద్ సిటీ , అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూలో ఇటీవల పరస్పరం దాడులు చేసుకున్న రెండు వర్గాలకు చెందిన 15మంది విద్యార్థులను సస్పెండ్ చేస్తూ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి నర్సింహారెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో సెకండియర్ క్లాస్ రిప్రజెంటేటివ్‌ను ఎన్నుకునే విషయంలో విద్యార్థుల మధ్య సెప్టెంబరు 24న వివాదం చోటుచేసుకుంది. ఆచార్యుల మందలింపుతో గొడవ ఉదయం కొద్దిసేపు సద్దుమణిగినప్పటికీ, సాయంత్రం కళాశాల వెలుపల రెండు వర్గాల విద్యార్థులు మళ్లీ ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్.. కారకులైన విద్యార్థులపై చర్యల నిమిత్తం క్రమశిక్షణ కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. కమిటీ సభ్యులు సమర్పించిన నివేదిక మేరకు 13మంది మెకానికల్ విద్యార్థులు, ఇద్దరు కంప్యూటర్ సైన్స్ విద్యార్థులపై చర్యలు తీసుకున్నారు. గొడవకు కారకులైన లేఖజ్ అనే విద్యార్థిని నెలరోజులు సస్పెండ్ చేయగా, కొంతమందిని రెండు వారాలు, మరి కొంతమందిని వారం పాటు సస్పెండ్ చేశారు.

హద్దు మీరావ్..వివరణ ఇవ్వు!

- ఐపీఎస్ సునీల్‌కుమార్‌కు ఏపీ సర్కారు చార్జి మెమో

అమరావతి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): 'హద్దు మీరావ్...వివరణ ఇవ్వు..' అంటూ సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్‌కు ఏపీ ప్రభుత్వం చార్జి మెమో జారీచేసింది. సోషల్ మీడియా వేదికగా సునీల్ కుమార్ పెట్టిన పోస్టు ఆలిండియా సర్వీస్ నిబంధనల అతిక్రమణ కిందికి వచ్చింది. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు రావడంతో సీనియర్ ఐపీఎస్ అధికారిని సంజాయిషీ అడిగింది. వివరాల్లోకి వెళితే... ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ గత వైసీపీ ప్రభుత్వంలో ఏకపక్షంగా వ్యవహరిస్తూ పూర్తి స్థాయి వైపీఎస్ అధికారిగా పేరు తెచ్చుకున్నారు. అప్పటి ఎంపీ, ప్రస్తుత కూటమి ఎమ్మెల్యే రఘురామ రాజును చిత్రహింసలకు గురి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ ఘటనపై న్యాయపోరాటం చేస్తోన్న రఘురామరాజు, ఈ ఏడాది జూలై 11న గుంటూరులోని నగరంపాలెం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ కేసులో ఏ-1 నిందితుడు సునీల్‌కుమార్ మరుసటిరోజు (జూలై 12) తన ట్విటర్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. 'ఎప్పుడో మూడేళ్ల క్రితం జరిగిన దానిపై ఇప్పుడు కేసు నమోదు చేయడమేంటి.?' అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకంగా వ్యవహరించినందుకు సమాధానం చెప్పాలంటూ సాధారణ పరిపాలన శాఖ (పొలిటికల్) కార్యదర్శి సురేశ్ కుమార్ సోమవారం జీవో-1965 జారీ చేశారు. పదిహేను రోజుల్లో వివరణ ఇవ్వక పోయినా, ఎవరితోనైనా సిఫారసులు చేయించినా, రాజకీయ పరమైన ఒత్తిళ్లు తెచ్చినా తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని ప్రభుత్వం... సునీల్ కుమార్‌ను హెచ్చరించింది.

సమాజ హితానికే..

- మూసీ, చెరువుల ప్రక్షాళన.. మా స్వార్థానికి కాదు
- నిర్వాసితులకు న్యాయం మా బాధ్యత
- కబ్జాల తీరును జీఐఎస్ మ్యాపుల సాయంతో వివరించిన భట్టి



హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మూసీ పునరుజ్జీవనం, చెరువుల సంక్షరక్షణ తమ వ్యక్తిగత ఎజెండా కాదని.. అందులో తమ స్వార్థం ఏమీ లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అవి.. ఈ ప్రాంతంలోని వనరులు, ఆస్తులను ప్రజలపరం చేయాలనే సామాజిక లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమాలని ఆయన పేర్కొన్నారు. కానీ.. కొందరు ప్రతిపక్ష నేతలు ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తెలంగాణ వచ్చాకయినా రాష్ట్ర వనరులు, ఆస్తులను కాపాడుకునే చర్యలు చేపట్టకపోవడం వల్ల 2014 నుంచి 2023 వరకు వందలాది చెరువులు పూర్తిగా కబ్జాకు గురయ్యాయని ఆవేదన వెలిబుచ్చారు. చెరువులు ఏ విధంగా కబ్జాకు గురయ్యాయో వివరిస్తూ.. సోమవారం ఆయన సచివాలయంలో మీడియాకు శాటిలైట్ మ్యాపుల ఆధారాలతో కూడిన వీడియో ప్రజెంటేషన్ ఇచ్చారు. హెచ్ఎండీఏ పరిధిలో 920 చెరువులు ఉండేవని.. రాష్ట్రం ఏర్పడేనాటికి అందులోని 225 చెరువులు పూర్తిగా కబ్జాకు గురై కనుమరుగైపోయాయని, 196 చెరువులు పాక్షికంగా కబ్జాలకు గురయ్యాయని వివరించారు. 2014 నుంచి 2023 వరకు 44 చెరువులు పూర్తిగా కబ్జాకు గురవ్వగా, 127 చెరువులు పాక్షికంగా ఆక్రమణలోకి వెళ్లాయని తెలిపారు. హైదరాబాద్ అంటే ఒకప్పుడు రాక్స్, పార్క్స్, లేక్స్ సిటీ అని.. అవన్నీ కబ్జాలకు గురవడంతో ఇప్పుడు నగరం అందం దెబ్బతిన్నదని, ముంపు సమస్యను ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. తాము రూపొందించిన మ్యాపులు కేవలం ఎఫ్‌టీఎల్ పరిధికి మాత్రమే పరిమితమయ్యాయని.. బఫర్ జోన్ విషయంలోకి తామింకా వెళ్లలేదని చెప్పారు. చెరువులు కబ్జా అయిన తీరు చూసి.. తాము నిర్మాణాలను తొలగించాలో లేదో ప్రతిపక్షాల నేతలు, విమర్శలకు పాల్పడుతున్న వారు చెప్పాలని అన్నారు. గత ప్రభుత్వాలు కూడా చెరువుల ఆక్రమణ, మూసీ సుందరీకరణ గురించి మాట్లాడాయనీ, కబ్జాలపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పి ఆ పని చేయలేకపోయాయని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం ప్రజలకు, సమాజానికి మంచి చేసే కార్యక్రమం చేపడుతోందని చెప్పారు. హైదరాబాద్‌కు గ్లోబల్ సిటీ అయ్యే లక్షణాలన్నీ ఉన్నాయనీ, ఆ దిశగా తాము వెళ్లడం ఇష్టమో కాదో ప్రతిపక్షాలు స్పష్టం చేయాలన్నారు. మూసీ నిర్వాసితులకు సంతృప్తికరమైన నష్టపరిహారం చెల్లిస్తామని భట్టి స్పష్టం చేశారు. పట్టా లేకపోయినా పరిహారం చెల్లిస్తామని చెప్పారు. ఎక్కడైనా అసంతృప్తి ఉంటే ప్రతిపక్షాలు తమకు చెప్పాలని, మేలైన ప్యాకేజీ ఏమిటో సూచించాలన్నారు. తాము దాన్ని అమలు చేయకపోతే అప్పుడు నిరసనలు వ్యక్తం చేయాలన్నారు. త్వరలో తాను ఈ విషయంపై వివిధ రాజకీయ పార్టీలకు లేఖ రాస్తానని తెలిపారు.

చెరువుల్లో 386 ఎకరాలు మాయం!

(మొదటి పేజీ తరువాయి)



2014లో సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని కిష్టారెడ్డిపేట చెరువు, 2023 నాటికి భవనాలతో నిండిన అదే ప్రాంతం

చెరువులన్నింట్లో కలిపి గత పదేళ్లలో 386.71 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు అధికారులు తేల్చారు. వీటిలో శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలు వెలిశాయి. రెవెన్యూ ఇరిగేషన్ రికార్డులతోపాటు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ) వద్ద తీసుకున్న శాటిలైట్ చిత్రాల ద్వారా చెరువుల స్థితిని అధికారులు పరిశీలించారు. అక్షాంశం, రేఖాంశం ఆధారంగా ఒక్కో చెరువు 2014 వరకు ఎంత విస్తీర్ణంలో ఉంది, ప్రస్తుతం ఎన్ని ఎకరాల్లో ఉందనేది అంచనా వేశారు. తద్వారా ఆక్రమణల లెక్క తేల్చారు. అభివృద్ధి విస్తరణ క్రమంలోనే ఈ ఆక్రమణలు జరుగుతూ.. చెరువులు, కుంటలు కనుమరుగవుతున్నట్లు స్పష్టమవుతోంది. వాస్తవానికి ఉమ్మడి రాష్ట్రంలోనే ఈ ఆక్రమణల తంతు మొదలైనా.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత కూడా ఇది ఆగలేదు. పైగా, అంతకన్నా ఎన్నో రెట్లు పెరిగింది. తెలంగాణ ఏర్పాటుకు ముందు అంగుళం ఆక్రమణకు కూడా గురికాని 77 చెరువుల్లో.. 20 చెరువులు గత పదేళ్లలో పూర్తిగా కనుమరుగు కావడమే ఇందుకు నిదర్శనం. మరో 57 చెరువులు పాక్షికంగా కబ్జా చెరలో చిక్కాయి. వీటికి తోడు.. గతంలో కొంత విస్తీర్ణం మేరకు ఆక్రమణకు గురైన 94 చెరువుల్లో 24 చెరువులు ఈ పదేళ్లలో పూర్తిగా కనుమరుగయ్యాయి. మరో 70 చెరువుల్లో ఆక్రమణలు పెరిగిపోయాయి.

2014 తరువాతే పెద్దమొత్తంలో కబ్జా..

ప్రభుత్వ రికార్డుల ప్రకారం.. 2014 వరకు 499 చెరువుల్లో ఎలాంటి ఆక్రమణలు లేవని, ఆ తరువాతి కాలంలోనే కబ్జాకు తెర లేచిందని అధికారులు పేర్కొంటున్నారు. రియల్ బూమ్ పెరగడం, భూముల ధరలు రూ.కోట్లలో పలుకుతుండడంతో ఆక్రమణలు చోటుచేసుకున్నాయని అంటున్నారు. మట్టి పోసి చదును చేసి, కొన్ని చోట్ల ప్లాట్లు చేసి విక్రయిస్తే.. ఇంకొన్ని చోట్ల తాత్కాలికంగా షెడ్లు వేసి, అనంతరం పక్కా భవనాలు నిర్మించారు. శిఖం పట్టా భూముల్లో నిర్మాణాలు చేపట్టే అవకాశం లేకపోయినా.. యథేచ్ఛగా భవనాలు వెలిశాయి. అయినా రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆక్రమణలకు పాల్పడ్డవారిలో ఎక్కువగా అప్పటి అధికార బీఆర్ఎస్ నేతలు ఉండగా, కొన్నిచోట్ల స్థానిక కాంగ్రెస్, బీజేపీ నేతలూ ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పలు ప్రాంతాల్లో స్థానికులు ఫిర్యాదు చేసినా.. ఒత్తిళ్ల వల్లనో, అక్రమార్జన వల్లనో అధికారులు స్పందించలేదు. దీంతో ఆక్రమణదారులు మరింత రెచ్చిపోయారు. ఆక్రమించిన స్థలాలను ప్లాట్లుగా విక్రయించడంతోపాటు కొన్నిచోట్ల ఇళ్లు నిర్మించి విక్రయించారు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే తక్కువ ధరకు లభిస్తుండడంతో పేద, దిగువ మధ్య తరగతి వర్గాలు సొంతింటి కల నెరవేర్చుకునేందుకు వీటిని కొనుగోలు చేశాయి. కబ్జా చేసినవారు సొమ్ము చేసుకొని బయటపడగా.. వాటిని కొనుక్కున్న వారు మాత్రం ప్రస్తుతం ఆక్రమణల తొలగింపు నేపథ్యంలో బాధితులుగా మారుతున్నారు.

2014 నాటికి		2014 నుంచి 2023 వరకు	
చెరువుల పరిస్థితి		పూర్తిగా కనుమరుగైనవి	పాక్షికంగా కబ్జాకు గురైనవి
ఆక్రమణలు లేని చెరువులు	499	20	57
పాక్షిక ఆక్రమణకు గురైనవి	196	24	70
మొత్తం	695	44	127

2014 వరకు ఆక్రమణలు లేకుండా.. ఆ తరువాత పూర్తిగా కనుమరుగైన చెరువుల్లో కొన్ని

పుప్పాలగూడ	9.25 ఎకరాలు
బుద్వేల్	6.39 ఎకరాలు
బాచుపల్లి	2.1 ఎకరాలు
కుంట్లూరు	1.62 ఎకరాలు

2014 వరకు ఆక్రమణలు లేకుండా.. ఆ తరువాత పాక్షిక ఆక్రమణలు జరిగిన చెరువుల్లో కొన్ని (బ్రాకెట్లో పూర్తి విస్తీర్ణం)

మల్లాపూర్	11.58 ఎకరాలు (19.75)
మక్తల్ కుంట, పెద్ద అంబర్‌పేట	9.48 ఎకరాలు (12.09)
దేవరయాంజల్	9.19 ఎకరాలు (22.24)
సురోని చెరువు, మంఖాల్	8.88 ఎకరాలు (51.96)
ఉమ్దాసాగర్, జల్‌పల్లి	7.84 ఎకరాలు (113.25)
బ్రాహ్మణ కుంట, గోధుమకుంట	6.52 ఎకరాలు (15.22)
సుమర్ చెరువు	5.31 ఎకరాలు (62.51)
మల్కాం చెరువు, ఉప్పర్‌పల్లి	4.79 ఎకరాలు (22.14)
నాగారం నాచిన్	4.11 ఎకరాలు (26)

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ట్యాగ్‌ను తొలగించిన సాక్షి

- కుట్రపై వరుస వార్తా కథనాలతో తొలగింపు
- క్షమాపణపై మౌనం..
- న్యాయపరమైన చర్యలు తప్పవన్న ఏబీఎన్-ఆంధ్రజ్యోతి

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడి సొంత పత్రిక 'సాక్షి'.. ఎట్టకేలకు తన వెబ్‌సైట్ నుంచి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ట్యాగ్‌ను తొలగించింది. పాత్రికేయ విలువలకు తిలోదకాలిచ్చిన సాక్షి.. ఆంధ్రజ్యోతి ట్యాగ్‌ను వాడి, తన వెబ్‌సైట్లో తమ సొంత వార్తలను ప్రచారం చేసుకున్న సంగతి తెలిసిందే. 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' అని గూగుల్‌లో వెతికినా.. వీక్షకులు సాక్షి వెబ్‌సైట్‌కు అనుసంధానమయ్యేలా చేసింది. 'సాక్షి' విశ్వసనీయత లేని వార్తలను బలవంతంగా ప్రజల్లోకి ఎక్కించేందుకు కుట్రలు పన్నింది. ఈ వ్యవహారం జనాలను సైతం గందరగోళానికి గురిచేసింది. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ఐటీ బృందం పసిగట్టింది. సాక్షి కుట్రను ఎండగడుతూ.. వరుస వార్తా కథనాలు ప్రసారం చేసింది. ఈ అంశంపై ప్రజల్లోనూ వ్యతిరేకతను ఎదుర్కొన్న 'సాక్షి' తమ వెబ్‌సైట్ నుంచి ఆంధ్రజ్యోతి ట్యాగ్ తొలగించింది. తామేం తప్పు చేయలేదన్నట్టు నిశ్శబ్దంగా సైడ్ అయింది. అయితే అక్రమంగా ట్యాగ్ వాడినందుకు క్షమాపణ కూడా చెప్పలేదు. చేసిన తప్పునకు 'సాక్షి' వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని.. లేదంటే న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు వెనకాడబోమని 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' హెచ్చరించింది.

రాజకీయ దురుద్దేశంతోనే కొండా సురేఖ విమర్శలు

- అక్కినేని కుటుంబంపై అభాండాలు వేశారు
- పరువు నష్టం కేసులో నాగార్జున తరఫు న్యాయవాది వాదన
- నేడు కోర్టులో నాగార్జున వాంగ్మూలం

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కీర్తి ప్రతిష్ఠలు కలిగిన అక్కినేని కుటుంబంపై రాజకీయ దురుద్దేశంతోనే మంత్రి కొండా సురేఖ విమర్శలు చేశారని సీనియర్ న్యాయవాది అశోక్‌రెడ్డి వాదించారు. ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేని అక్కినేని కుటుంబంపై తీవ్రమైన అభాండాలు వేశారన్నారు. సినీ హీరో అక్కినేని నాగార్జున దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం దావాపై నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఎక్సైజ్ కోర్టులో సోమవారం వాదనలు ప్రారంభమయ్యాయి. పిటిషనర్ నాగార్జున తరఫున న్యాయవాది అశోక్ రెడ్డి వాదిస్తూ అక్కినేని కుటుంబంపై చేసిన దారుణ విమర్శలు చేసిన వారిపై భారత న్యాయ సంహితలోని సెక్షన్ 356 ప్రకారం కేసు నమోదుకు ఆదేశాలు ఇవ్వాలని న్యాయమూర్తిని కోరారు. పిటిషనర్ నాగార్జునతోపాటు సాక్ష్యులు స్వయంగా వచ్చి వాంగ్మూలం ఇవ్వాలని ఆదేశించిన కోర్టు.. తదుపరి విచారణను కోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. కోర్టు ఆదేశాల మేరకు నాగార్జున, ఇతర సాక్ష్యులు తమ వాంగ్మూలం ఇవ్వడానికి మంగళవారం కోర్టుకు రానున్నారు. ఈ కేసు విషయమై టీపీసీసీ లీగ్ సెల్ వైస్ చైర్మన్ తిరుపతి వర్మ కోర్టు బయట విలేకరులతో మాట్లాడుతూ ఘాటైన విమర్శలు చేశారు. 'నాగార్జునతోపాటు ఆయన వెనకున్న వారిపైనా మేమూ కేసులు పెట్టి న్యాయ పోరాటం చేస్తాం. కోర్టుకు నాగార్జున వస్తారో? ఎవరు వస్తారో రానివ్వండి. మంగళవారం విచారణ పూర్తయ్యాక మేము స్పందిస్తాం. ఒక రాజకీయ నాయకుడు నూలు దండను కొండా సురేఖ మెడలో వేయడంపై.. సోషల్ మీడియాలో ఇష్టానుసారం వ్యాఖ్యలు చేసినా స్పందించని వారు ఇప్పుడు ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారు" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ లీగల్ సెల్ తరఫున ఈ వ్యవహారంలో న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

సీఎంపై వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకుంటే బడిత పూజే

బాల్క సుమన్‌కు ఎమ్మెల్యే మేడిపల్లి హెచ్చరిక

హైదరాబాద్/న్యూఢిల్లీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్, కేటీఆర్‌లు ఇచ్చిన అబద్ధాల స్క్రిప్ట్‌ను.. బానిస బాల్క సుమన్ తెలంగాణభవన్‌లో కూర్చుని చదువుతున్నాడని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి మూటలు మోస్తున్నాడంటూ బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేదంటే బడిత పూజ తప్పదని హెచ్చరించారు. విద్యార్థి నాయకుడినని చెప్పుకొంటున్న బాల్క సుమన్.. పదేళ్ల ఉద్యోగాల గురించి ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. దేహశుద్ధి చేస్తారనే ఆయన ఓయూ వైపునకు కూడా వెళ్లట్లేదన్నారు. ఉద్యోగాలకు సంబంధించి.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటనలు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేసిందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్ అన్నారు. దీనిపై చర్చకు సిద్ధమా అంటూ బాల్క సుమన్‌కు సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిరుద్యోగుల ఆందోళనలు, ధర్నాలు ఎక్కడా కనిపించట్లేదని, బీఆర్ఎస్ నేతలు ఎన్ని పిట్టకథలు చెప్పినా వారు నమ్మబోరని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పరిశ్రమలు పెట్టని సంస్థలకు భూములెందుకు?

(మొదటి పేజీ తరువాయి)

ప్రైవేట్ లిమిటెడ్, స్టార్‌గేజ్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, అనంత టెక్నాలజీస్ లిమిటెడ్, జేటీ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహా ఇతర కంపెనీలపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఎలాంటి టెండర్లు లేకుండా ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు కంపెనీలకు, వ్యక్తులకు, సంస్థలకు రాయితీపై విక్రయించడం, లీజుకు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని, షరతులకు విరుద్ధంగా చేసిన కేటాయింపులను, ఎలాంటి పనులు చేపట్టని కంపెనీలకు చేసిన కేటాయింపులను రద్దు చేయాలని, టెండర్లు లేకుండా భూకేటాయింపులకు అనుమతిస్తున్న ఏపీఐఐసీ అలాట్‌మెంట్ రెగ్యులేషన్స్-1998ని కొట్టేయాలని కోరుతూ క్యాంపెయిన్ ఫర్ హౌసింగ్ అండ్ టెన్యూరల్ రైట్స్(ఛత్రి), ఓఎం డెబెరా, ఎన్.రాంరెడ్డి తదితరులు హైకోర్టులో 2007లో పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఏపీఐఐసీని, విప్రో, ఇన్ఫోసిస్, ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్, హనీవెల్ టెక్నాలజీస్ సొల్యూషన్స్ ల్యాబ్, న్యూలాండ్ ల్యాబ్, విసువల్ సాఫ్ట్ టెక్నాలజీస్, ఇండియన్ హోటల్స్, హిందూజా గ్రూప్ సహా పలు కంపెనీలను ప్రతివాదులుగా చేర్చారు. సదరు పిటిషన్‌పై సుదీర్ఘ విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం తాజాగా తీర్పు వెలువరించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది గంద్ర మోహన్‌రావు వాదనలు వినిపించారు. ఎలాంటి టెండరింగ్ లేదా బిడ్డింగ్ ప్రక్రియ లేకుండా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నామినేషన్ పద్ధతిలో తక్కువ ధరలకు విలువైన ప్రభుత్వ భూములను కేటాయించడం అక్రమమని పేర్కొన్నారు. 1998లో ఏపీఐఐసీ రెగ్యులేషన్స్ రూపొందించారని, వాటికి విరుద్ధంగా నామమాత్రపు ధరలకు భూకేటాయింపులు చేశారని తెలిపారు. భూకేటాయింపులు చేసిన సమయంలో కోకాపేట్ వంటి ప్రాంతాల్లో ఎకరానికి రూ.4.5 కోట్లు ధర ఉందని, అంతకంటే విలువైన భూములను ఇష్టానుసారం కేటాయించి ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారని ఆరోపించారు. ప్రతివాదుల్లో కొన్ని కంపెనీలు ఐటీ కంపెనీ నిర్వచనంలోకి రావని తెలిపారు. నామినేషన్ పద్ధతిలో ఎందుకు కేటాయిస్తున్నారో ఎలాంటి కారణాలు వివరించలేదని ప్రస్తావించారు. ఏపీఐఐసీ రెగ్యులేషన్స్ ప్రకారం నామినేషన్ పద్ధతిలో కేటాయిస్తే మార్గదర్శకాలు విడుదల చేయాల్సి ఉంటుందని తెలిపారు. అలాంటి మార్గదర్శికాలేవీ లేకుండా చేసిన ఈ కేటాయింపులు చెల్లవని పేర్కొన్నారు. పేద ప్రజలు, రైతుల నుంచి భూసేకరణ చేసి, కంపెనీలకు ఇచ్చారని చెప్పారు. వాటిలో కొన్ని ఎలాంటి ఉద్యోగాలు ఇవ్వడం లేదని ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ రాష్ట్రంలో ఐటీ అభివృద్ధి, ఉద్యోగాల కల్పన కోసం ఒక విధానం రూపొందించి కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. 1894 భూసేకరణ చట్టం ప్రకారం భూములు సేకరించి కంపెనీలు ముందుకు రావడానికి నామినేషన్ పద్ధతిపై కేటాయింపులు చేసినట్లు తెలిపారు. 1996 నుంచి 2006 వరకు భూకేటాయింపులు జరిగితే 2007లో పిటిషన్ దాఖలు చేశారని, పిటిషన్ దాఖలు చేయడంలో ఆలస్యం, అశ్రద్ధ ఉన్నాయని చెప్పారు. 28 ఏళ్ల సుదీర్ఘ కాలం గడిచిపోయిన తర్వాత ఇప్పుడు ప్రశ్నించడం సబబు కాదని, ప్రజాహితం పేరుతో లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. భూమి ఉపయోగించుకోని, ఒప్పందాలను ఉల్లంఘించిన కంపెనీల కేటాయింపులు రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పారిశ్రామిక అభివృద్ధి, సామాజిక ఆర్థికాభివృద్ధిలో భాగంగా పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేశామని, రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా ఇది కొనసాగిందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తీసుకున్న విధాన నిర్ణయాలే తప్ప అందులో ఎలాంటి వివక్షకు తావు లేదని తెలిపారు. ఎప్పటి నుంచో విధాన నిర్ణయాల ద్వారా జరుగుతున్న అభివృద్ధిలో జోక్యం చేసుకోలేమని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం రాష్ట్ర ఆదాయం పెంచడం, ఉద్యోగాల కల్పన, పారిశ్రామిక, ఐటీ అభివృద్ధి కోసం విధాన నిర్ణయాల ద్వారా పరిశ్రమలకు, ఐటీ కంపెనీలను ఆకర్షించేందుకు ఆయా ప్రభుత్వాలు రాయితీలు ప్రకటించాయని తెలిపింది. ప్రభుత్వ విధానంలో దురుద్దేశాలు, అక్రమాలు, అసాధారణం ఏదీ లేదని తెలిపింది. కాబట్టి పాలసీ నిర్ణయాల్లో జోక్యానికి అవకాశం లేదని పేర్కొంది. విప్రో, ఇన్ఫోసిస్, ల్యాంకో ఇన్‌ఫ్రా, హనీవెల్, న్యూల్యాండ్ ల్యాబ్, మెఘాసాఫ్ట్, మెట్రో కాష్ అండ్ క్యారీ, ఇండియన్ హోటల్స్, హెచ్‌సీఎల్ టెక్, ఐసీఐసీఐ బ్యాంకు వంటి అనేక కంపెనీలు రూ.100 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టాయని, సదరు కంపెనీలు 3 నుంచి 6 వేలకు పైగా ఉద్యోగాలు ఇస్తున్నాయని తెలిపింది. ప్రభుత్వ విజ్ఞప్తితో వచ్చిన కంపెనీలను ఇప్పుడు మార్కెట్ రేటు చెల్లించాలనడం సబబు కాదని తెలిపింది. భూములు తీసుకొని ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయని, నిర్మాణాలు చేపట్టని ఇందూ టెక్‌జోన్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి కంపెనీల కేటాయింపులు నాలుగు నెలల్లో రద్దు చేయాలని పేర్కొంటూ తుది తీర్పు ఇచ్చింది. ఇందూ టెక్ జోన్ ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ అక్రమాస్తుల కేసుల్లో నిందితుల జాబితాలో ఉంది.

గుడిని బట్టే 'నిధి'

(మొదటి పేజీ తరువాయి)

నుంచి ఎక్కువగా అభ్యర్థనలు వస్తున్నాయి. అందుకు తగ్గట్లుగా మంజూరు చేసేందుకు ప్రస్తుతం సీజీఎఫ్‌లో ఉన్న నిధులు సర్దుబాటు అయ్యే పరిస్థితి లేదు. దీంతో.. ఆలయాల నుంచి అధిక నిధులు సేకరించడంపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఇప్పటిదాకా ఉన్న 5 శాతానికి బదులుగా.. ఆలయాల ఆదాయాన్ని బట్టి కనిష్ఠంగా 7 శాతం నుంచి గరిష్ఠంగా 12 శాతం దాకా సీజీఎఫ్ వాటా కింద వసూలు చేయాలని ప్రతిపాదించారు.

- వార్షిక ఆదాయం రూ.25 లక్షలు, అంతకు మించి ఆదాయం కలిగిన 6ఏ ఆలయాలు 12 శాతం,
- రూ.2 లక్షల నుంచి రూ. 25 లక్షల ఆదాయం కలిగిన 6బీ ఆలయాలు 10%,
- రూ.2 లక్షల కంటే తక్కువ ఆదాయం కలిగిన 6సీ ఆలయాలు 7%,
- ఆదాయంతో సంబంధం లేకుండా 6డీ పరిధిలోకి వచ్చే మఠాలు 5 శాతం సీజీఎఫ్ వాటాగా ఇవ్వాలని పేర్కొన్నారు.

కుదరదంటున్న ఈవోలు..

ఆలయాలకు వస్తున్న ఆదాయం అంతంత మాత్రంగానే ఉంటోందని.. అది కూడా అర్చకులు, ఉద్యోగులకు వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులకే సరిపోతోందని.. కాబట్టి, సీజీఎఫ్‌కు నిధులు పెంచి ఇవ్వడం కుదరదని ఈవోలు ఉన్నతాధికారులకు తెగేసి చెబుతున్నారు. వాస్తవానికి ఇదే ప్రయత్నం గత ప్రభుత్వ హయాంలోనూ చేసినా.. క్షేత్రస్థాయిలో తీవ్ర వ్యతిరేకత రావడంతో విరమించుకున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత మరోసారి సీజీఎఫ్ అంశాన్ని ఉన్నతాధికారులు తెరపైకి తెచ్చారు. దీనిపై అన్ని ఆలయాల ఈవోలతో దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఇటీవల ప్రత్యేకంగా సమావేశమై చర్చించగా ఎవరూ సీజీఎఫ్ పెంచి చెల్లించేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు.

అజమాయిషీ కరువు..

సీజీఎఫ్ నిధుల వాడకంపై దేవాదాయశాఖ అజమాయిషీ లేకుండా పోతోంది. ఆదాయం ఉన్న ఆలయాల నుంచి ముక్కుపిండి సీజీఎఫ్ వసూలు చేస్తున్నా... అవి వినియోగిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కేవలం రాజకీయ నాయకుల పలుకుబడి, వారి అనుచరులకు కాంట్రాక్టులకు మాత్రమే సీజీఎఫ్ నిధులు ఉపయోగపడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఆలయాల మరమ్మత్తులు, కొత్తవాటి నిర్మాణానికి గరిష్ఠంగా రూ. 50 లక్షలకు మించి ఇవ్వరాదనే నిబంధన ఉంది. ఆలయ నిర్మాణం చేపట్టేవారు తమ వాటాగా 30 శాతం నిధులను ముందు గా చెల్లించి, ఆ తర్వాత ఆ తర్వాత దేవాదాయ శాఖ నుంచి మిగతా మొత్తం తీసుకోవాలి. కానీ వాస్తవంగా అలా జరగట్లేదు. మాజీ సీఎం కేసీఆర్.. గజ్వేల్ నియోజకర్గంలో రామాలయ మరమ్మతులకు ఇలా రూ.5 కోట్లు వాడారు. నిర్మల్‌లో అడెల్లి మహాపోచమ్మ ఆలయ మరమ్మతులకు రూ.6 కోట్లు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 2, 3 ఆలయాలకు కోట్లల్లో సీజీఎఫ్ నిధులు మంజూరు చేశారు. దేవాదాయ శాఖ మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నియోజకవర్గంలో.. రాష్ట్రంలోనే అత్యధికంగా పదేళ్లలో సుమారు 800 ఆలయాలకు సీజీఎఫ్ నిధులు మంజూరయ్యాయి.



కడ్తాలలో తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి

డిసెంబరులోగా నిరుపేదలకు పట్టాలు

- సర్కారు భూములు సాగు చేసుకునే వారికి జారీ
- నెలాఖరుకు 5.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- నియోజకవర్గానికి 3-4 వేల గృహాల కేటాయింపు: పొంగులేటి

ఆమనగల్లు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న అర్హులైన నిరుపేదలకు డిసెంబరులోగా పాస్ పుస్తకాలు అందజేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా కడ్తాలలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.1.18 కోట్లతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని మంత్రి పొంగులేటి ప్రారంభించారు. అనంతరం ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల పరిధిలోని 75 మంది గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను, 77 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. దేశానికే ఆదర్శంగా, రైతుల భూములకు రక్షణ, భరోసా కల్పించేలా ప్రభుత్వం 2024లో కొత్త ఆర్‌వోఆర్ చట్టాన్ని తీసుకువస్తుందని తెలిపారు. ఈ చట్టాన్ని అమలు చేసి రైతుల భూ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలకు అధునాతన సదుపాయాలతో నూతన భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెలాఖరు వరకు మొదటి విడతగా 5.50 లక్షల నుంచి 6 లక్షల వరకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 నుంచి 4 వేల ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ఇళ్ల స్థలాలు లేని పేదలకు స్థలాలతో పాటు ఇళ్లను రెండో విడతలో మంజూరు చేస్తామని చెప్పారు.

మూసీ ప్రక్షాళనకు హరీశ్, కేటీఆర్ మోకాలడ్డు

- వారిద్దరూ మూసీ వద్ద నెల రోజులు కిరాయికి ఉంటే పేదల బాధలు తెలుస్తాయి
- రోడ్లు, భవనాలశాఖ మంత్రి వెంకట్‌రెడ్డి



దేవరకొండ, అక్టోబరు 7: మూసీని ప్రక్షాళన చేసి రోగాల బారిన పడకుండా ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్‌లు అడ్డుపడుతున్నారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. వారిద్దరూ నెల రోజులు మూసీ వద్ద ఇల్లు కిరాయి తీసుకుని ఉంటే పేదలు పడే బాధలు తెలుస్తాయని విమర్శించారు. ఎవరు అడ్డొచ్చినా మూసీ ప్రక్షాళన చేసి తీరతామన్నారు. హరీశ్‌రావు మూసీని అడ్డుకునేందుకు ఢిల్లీకి వెళ్లి రాహుల్‌గాంధీ ఇంటి వద్ద ధర్నా చేస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా దేవరకొండ, మాల్ నూతన మార్కెట్‌కమిటీ పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పదేళ్లలో శ్రీశైలం సొరంగమార్గాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. రూ.2వేల కోట్లు కేటాయిస్తే సొరంగమార్గం ఎప్పుడో పూర్తయ్యేదన్నారు. కమీషన్లకు కక్కుర్తిపడి కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్ష కోట్లు కేటాయించారని, సొరంగమార్గానికి నిధులు కేటాయించాలని అడిగినా పట్టించుకోని దుర్మార్గుడు కేసీఆర్ అని విమర్శించారు. తమ ప్రభుత్వం 30 నెలల్లో శ్రీశైలం సొరంగమార్గాన్ని పూర్తి చేసి నల్లగొండ జిల్లా ప్రజలకు సాగునీరు అందిస్తుందని చెప్పారు. వారంలోగా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

గురుకులాల్లో పది పాసైతే నేరుగా గురుకులాల్లో ఇంటర్ అడ్మిషన్

- సాధ్యాసాధ్యాలను పరిశీలించండి: పొన్నం

వచ్చే విద్యా సంవత్సరం నుంచి మోడల్ స్కూళ్ల తరహాలో గురుకులాల్లోనూ పదో తరగతి పాసైన విద్యార్థులకు ప్రవేశ పరీక్షలేకుండా నేరుగా గురుకులాల్లో ఇంటర్మీడియెట్ లో చేరేలా చూస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను ఆయన ఆదేశించారు. అన్ని గురుకులాల్లో ఎప్‌సెట్, నీట్ కోచింగ్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర పాఠశాలలు, కళాశాలల్లో ఉన్నట్లే బీసీ గురుకులాల్లోనూ రెడ్ క్రాస్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ కార్యక్రమాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వంతో చర్చిస్తున్నామని చెప్పారు. ఈ నెల 15 నుంచి 31వతేదీ లోపు పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేయాలని, దీంతో అనేక సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక పూర్తి

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ఖరారు ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. సోమవారం రాత్రి వరకు జిల్లాల వారీగా టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాలను రూపొందించి ఆయా జిల్లాల డీఈవోలకు విద్యా శాఖ పంపింది. టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 9న ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక జాబితాల్లో పేర్లు ఉన్న అభ్యర్థులకు మంగళవారం ప్రత్యేక ఐడీ కార్డులను ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకోసం అభ్యర్థి ఫొటోతో డీఈవో కార్యాలయానికి వెళ్తే అక్కడే ఐడీ కార్డును జారీ చేయనున్నారు. ఈ ఐడీ కార్డు ఉంటేనే ఎల్బీ స్టేడియంలోకి అనుమతిస్తారు. అభ్యర్థులను ఎల్బీ స్టేడియంకు తీసుకువచ్చేందుకు అన్ని జిల్లాల నుంచి ప్రత్యేకంగా ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నారు. స్టేడియంలో జిల్లాల వారీగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. సంబంధిత జిల్లా కౌంటర్లలోనే ఆయా జిల్లాలకు చెందిన అభ్యర్థులు తమ నియామక పత్రాలను తీసుకోవాల్సి ఉంటుంది. ఇక స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు సంబంధించి సాంకేతిక సమస్య తలెత్తినట్లు తెలిసింది. దాంతో సుమారు 400 పోస్టులకు సంబంధించిన అభ్యర్థుల ఖరారు ప్రక్రియను తర్వాత చేయనున్నారు.

మాఫీ గారడీ

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు. ఇందులో ఏది నిజమని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఒకవేళ రూ.17 వేల కోట్లే మాఫీ చేస్తే మిగిలిన రూ.14 వేల కోట్లు ఏమయ్యాయని నిలదీశారు. మరో 16 లక్షలకు పైగా రైతులకు ఎందుకు ఇంకా రుణమాఫీ జరగలేదని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ఒకేసారి రైతు రుణాలన్నీ మాఫీ చేస్తామని వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ప్రకటించిందని, కానీ అధికారంలోకి వచ్చిన 224 రోజుల తర్వాత సగం మాత్రమే మాఫీ చేశారని విమర్శించారు. మొదట్లో రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించి, ఇప్పుడు కుటుంబంలో ఒకరికి మాత్రమే చేస్తామని చెబుతున్నారని మండిపడ్డారు. అసలు తెలంగాణలో పంట రుణాలు తీసుకున్న రైతులు ఎంత మంది..? రుణమాఫీ జరిగింది ఎంత మందికి..? అనే లెక్కలన్నీ ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ చెప్పిన దాంట్లో మూడోవంతు మందికి కూడా రుణమాఫీ జరగలేదని అన్నారు. రుణమాఫీ విషయంలో రైతుల్లో అయోమయం తొలగిపోవాలంటే, లెక్కలన్నీ బహిర్గతం చేయాలని కిషన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

హైడ్రాకూ ఓ మొబైల్ యాప్



- చెరువులు, ప్రభుత్వ స్థలాలపై నిఘా
- ఆక్రమణలపై ఫిర్యాదుచేసేలా రూప కల్పన
- త్వరలో అందుబాటులోకి అప్లికేషన్
- చెరువుల పూర్వవైభవానికి హైడ్రా ప్రణాళిక

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మహా నగరంలో చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాలపై నిరంతర నిఘాకు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) చర్యలు తీసుకుంటోంది. ఆక్రమణలపై పౌరులు ఫిర్యాదు చేసేలా మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కసరత్తులు చేస్తోంది. ఇక నుంచి కబ్జాలను నియంత్రించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకునేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ మేరకు సోమవారం జరిగిన లేక్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశంలో ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆక్రమణల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు యాప్‌ను రూపొందించాలని హైడ్రా నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆక్రమణల ఫొటోలను అప్‌లోడ్ చేయడం ద్వారా ఫిర్యాదు నమోదవుతుంది. సంబంధిత ప్రాంత బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాయి. యాప్ రూపకల్పన బాధ్యతలను ఓ ఏజెన్సీకి అప్పగించినట్టు హైడ్రా వర్గాలు పేర్కొన్నాయి. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల గుర్తింపునకు రెవెన్యూ, ఇరిగేషన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ(ఎన్ఆర్ఎస్ఏ), స్టేట్ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్(ఎస్ఆర్ఎస్‌సీ), సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో చర్చించారు. నాలుగైదు దశాబ్దాల క్రితం, ప్రస్తుతం చెరువుల విస్తీర్ణానికి సంబంధించిన ఉపగ్రహ చిత్రాలను అందించాలని ఎన్ఆర్ఎస్ఏ, ఎస్ఆర్ఎస్‌సీ అధికారులను కోరారు.

చెరువులకు పూర్వ వైభవం తెస్తాం: రంగనాథ్

చెరువుల పరిరక్షణతో పాటు వాటికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు హైడ్రా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా ఆక్రమణలు కూల్చివేసిన చెరువుల్లో వ్యర్థాలను తొలగించి, పనులు చేపడతామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. మొదటి దశలో సున్నం, అప్పా, ఎర్రకుంట, కూకట్‌పల్లి నల్లచెరువుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఔటర్ లోపల ఎన్ని చెరువులున్నాయి..? ఎంత మేర ఆక్రమణలకు గురయ్యాయి..? అన్న లెక్కలూ తేల్చుతామని వెల్లడించారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా ఎఫ్‌టీఎల్ నిర్ధారించాలని, గతంలో నిర్ధారించిన ఎఫ్‌టీఎల్ సరిగా లేని పక్షంలో వాటిని సవరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్ఆర్ఎస్ఏ, ఎస్ఆర్ఎస్ఏ, ఇరిగేషన్ విభాగాల నుంచి 45ఏళ్ల డేటాను సేకరిస్తామని, దాని ఆధారంగా చెరువుల ఎఫ్‌టీఎల్‌ను గుర్తిస్తామని చెప్పారు. హిమాయత్‌సాగర్‌తో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ గుర్తింపును ప్రారంభించి అదే విధానాన్ని అన్ని చెరువుల విషయంలో పాటించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెరువుల ఆక్రమణలపై 2018లో కాగ్ ఇచ్చిన నివేదికను పరిశీలించడంతోపాటు.. ఆక్రమణల గుర్తింపులో పొరపాట్లు లేకుండా చూస్తామన్నారు.

మూసీలోకి మురికి పోనియ్యం!

(మొదటిపేజీ తరువాయి)

తగినట్లుగా లేదని తెలిపారు. సమీప పురపాలక సంఘాల్లోనూ సరైన మురుగు నీటి పారుదల వ్యవస్థ లేదని చెప్పారు. హైదరాబాద్‌లో మూసీ నది 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోందని, దానికి ఇరువైపులా కలిపి 110 కిలోమీటర్ల మేర నగరంలోని మురుగు అంతా మూసీలోనే చేరుతోందని వివరించారు. ఈ మురుగు మూసీలో చేరకుండా ఉండేందుకు ట్రంక్ సీవర్స్ మెయిన్స్, లార్జ్ సైజ్ బాక్స్ డ్రెయిన్స్, కొత్త సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి రూ.4 వేల కోట్లతో డీపీఆర్‌ను రూపొందించినట్లు చెప్పారు. డీపీఆర్‌ను ఆమోదించాలని, పనుల అనుమతికి చొరవ చూపాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు.

మెట్రో రెండో దశకు సహకరించండి

హైదరాబాద్ మెట్రో రెండో దశలో భాగంగా ఐదు కారిడార్లలో 76.4 కిలోమీటర్ల మేర డీపీఆర్‌లు పూర్తయినట్టు ఖట్టర్‌కు రేవంత్ వివరించారు. ఈ కారిడార్ల నిర్మాణానికి రూ.24,269 వ్యయం అవుతుందని అంచనా వేశామని, కేంద్రం సగం భరించాలని కోరారు. త్వరలోనే డీపీఆర్‌ను సమర్పిస్తామని చెప్పారు. ప్రాజెక్టు త్వరగా కార్యరూపం దాల్చేందుకు సహకరించాలని కోరారు.

వరద సాయం చేయండి

ఇటీవల భారీ వర్షాల వల్ల తెలంగాణకు జరిగిన నష్టాన్ని పూరించేందుకు రూ.5438 కోట్లు విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 8 వరకు భారీ వర్షాల వల్ల తెలంగాణలో జరిగిన నష్టాన్ని అమిత్‌షాకు వివరించారు. 4.15 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, రహదారులు, కల్వర్టులు, చెరువులు, కాలువలు దెబ్బ తిన్నాయని, లక్షకు పైగా పశువులు, ఇతర మూగ జీవాలు మృతి చెందాయని తెలిపారు. కేంద్ర బృందం ఇప్పటికే నష్టపరిహారాన్ని అంచనా వేసిందని, తక్షణం రూ.5438 కోట్లు విడుదల చేస్తే మౌలిక వసతుల పునరుద్ధరణ, మరమ్మతుల పనులు చేపడతామని తెలిపారు. ఎస్‌డీఆర్ఎఫ్ కింద విడుదల చేసిన రూ.416.80 కోట్ల నిధులకూ, పునరుద్ధరణ, మరమ్మతు పనులకు విడుదల చేసే నిధులకూ ముడి పెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల్లో అదిలాబాద్, మంచిర్యాల, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలను తిరిగి చేర్చాలని రేవంత్‌రెడ్డి అమిత్ షాను కోరారు. గతంలో ఈ జిల్లాలను నక్సల్స్ పీడిత జిల్లాల్లోంచి తొలగించిన విషయాన్ని గుర్తు చేశారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లు తెలంగాణ సరిహద్దుల్లో ఉన్నాయని, ఈ రాష్ట్రాల నుంచి మావోయిస్టులు తెలంగాణలో కార్యక్రమాలను విస్తరించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా చర్ల మండలం, కొండవాయి, ములుగు జిల్లా వెంకటాపురం మండలం, అలుబాక గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్, జేటీఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. స్పెషల్ పోలీస్ ఆఫీసర్స్‌కు చెల్లించాల్సిన నిధుల్లో కేంద్రం వాటా 60 శాతం నాలుగేళ్ల నుంచి పెండింగ్‌లో ఉందని, రూ.18.31 కోట్లు విడుదల చేయాల్సి ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. 1065 మందిని స్పెషల్ పోలీస్ ఆఫీసర్స్‌లో చేర్చుకోవడానికి నిబంధనలు సడలించాలని కోరారు. ములుగు జిల్లా పేరూరు, ములుగు, కన్నాయిగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల, మహాముత్తారం, కాటారం పోలీస్ స్టేషన్లను బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. కొత్తగా నియమితులైన పోలీసు సిబ్బందికి గ్రేహౌండ్స్ ద్వారా తీవ్రవాద వ్యతిరేక వ్యూహాల్లో శిక్షణ ఇప్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. 2024-25 సంవత్సరంలో ఈ శిక్షణకు రూ.25.59 కోట్ల అదనపు బడ్జెట్ అవసరమని, ఆ మొత్తాన్ని విడుదల చేయాలని కేంద్ర హోంమంత్రికి విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజనల సమస్యల పరిష్కారానికి సహకరించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. షెడ్యూలు 9 లోని ప్రభుత్వ భవనాలు, కార్పొరేషన్ల పంపిణీకి, షెడ్యూలు 10లోని సంస్థలకు సంబంధించిన వివాదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించేందుకు తోడ్పడాలని కోరారు. పునర్విభజన చట్టంలో ప్రస్తావించని ఆస్తులు, సంస్థలు తమవేనని ఏపీ చెప్పుకుంటోందని, ఈ విషయంలో తెలంగాణకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు కేటాయించాలని అడిగారు. విభజన సమయంలో కేవలం 76 మంది ఐపీఎస్‌లను కేటాయించారని గుర్తు చేశారు. ఐపీఎస్ కేడర్ సమీక్షను వెంటనే చేపట్టాలని అడిగారు. రెండు సమావేశాల్లో సీఎస్ శాంత కుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, డీజీపీ జితేందర్, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పాల్గొన్నారు.



ఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్‌తో భేటీ అయిన సీఎం రేవంత్, చిత్రంలో జితేందర్‌రెడ్డి, ఎంపీలు వంశీ, రఘువీర్, కిరణ్‌కుమార్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి

రేవంత్‌తో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భేటీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోమవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. జీవో 111 కింద గ్రామాలను సుస్థిర అభివృద్ధి జోన్‌గా ప్రకటించాలని, పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం స్వాధీన పరుచుకున్న సీతంపూర్ ఆలయ భూముల గురించి, కాళేశ్వరం గురించి కూడా చర్చించినట్లు కొండా తెలిపారు.

గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఆర్థిక భరోసా

(మొదటిపేజీ తరువాయి)

ఆరు నెలలలోపు బాధిత కుటుంబసభ్యులు జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గల్ఫ్ దేశాల్లో రాష్ట్రానికి చెందిన కార్మికులు మృతిచెందితే 5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామంటూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మార్గదర్శకాలను సోమవారం సీఎస్ శాంతికుమారి జారీచేశారు.

ఇవీ మార్గదర్శకాలు...

- ఏడు గల్ఫ్ దేశాలైన బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఒమన్, ఖతార్, సౌది అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో మృతి చెందే తెలంగాణ కార్మికులకు వర్తింపు
- మృతుల భార్య లేదా భర్త, పిల్లలు, తల్లిదండ్రులను కుటుంబసభ్యులుగా పరిగణిస్తారు. వీరికి ప్రాధాన్య క్రమంలో ఎక్స్‌గ్రేషియా అందజేస్తారు.
- దరఖాస్తుతో పాటు సదరు కార్మికుడి మరణ ధ్రువీకరణ పత్రం, రద్దు చేసిన పాస్‌పోర్టు, పై ఏడింటిలోని ఏదైనా ఒక దేశంలో పని చేస్తున్నట్లు వీసా ధ్రువీకరణ పత్రం, ఎక్స్‌గ్రేషియా పొందేవారి బ్యాంకు అకౌంటు వివరాలను సమర్పించాల్సి ఉంటుంది.
- పైన పేర్కొన్న అన్ని ధ్రువీకరణ పత్రాలతో అర్హత గల కుటుంబ సభ్యుడు తమ జిల్లా కలెక్టరుకు దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తు, ధ్రువీకరణ పత్రాలను కలెక్టర్ పరిశీలించాలి.
- దరఖాస్తు పరిశీలన అనంతరం ఎక్స్‌గ్రేషియాను మంజూరు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీ చేయాలి. వెంటనే సంబంధిత కుటుంబ సభ్యుడి బ్యాంకు అకౌంట్‌లో రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా సొమ్మును జమ చేయాలి.
- గల్ఫ్ కార్మికుడు మరణించిన నాటి నుంచి లేదా మృతదేహాన్ని కుటుంబ సభ్యులు తీసుకున్న నాటి నుంచి ఆరు నెలల్లోగా సంబంధిత జిల్లా కలెక్టర్‌కు ఎక్స్‌గ్రేషియా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు అందిన తర్వాత సాధ్యమైనంత తక్కువ సమయంలోనే ఎక్స్‌గ్రేషియాను మంజూరు చేసేలా కలెక్టర్లు జాగ్రత్త వహించాలి.

రిజిస్ట్రేషన్ల శాఖ బదిలీల్లో అక్రమాలు

- ఆదాయం వచ్చే ప్రాంతాల ఎస్ఆర్వోలు అలాంటి చోట్లకే బదిలీ
- దీని వెనుక ఓ ఉన్నతాధికారి, ఓ జిల్లా రిజిస్ట్రార్ హస్తం
- చర్యలు తీసుకోవాలని రేవంత్, పొంగులేటి,ఏసీబీ డీజీలకు లేఖ

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల శాఖలో రెండు నెలల క్రితం జరిగిన బదిలీల్లో ఇద్దరు అధికారులు అక్రమాలకు పాల్పడ్డారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి, ఏసీబీ డైరెక్టర్ జనరల్‌కు రాజగోపాల్ చారి అనే వ్యక్తి ఈనెల ఒకటో తేదీన ఫిర్యాదు చేశారు. ఓ ఉన్నతాధికారి, ఒక జిల్లా రిజిస్ట్రార్ కలిసి బదిలీల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాగా ఆదాయం ఉన్న చోట్ల పనిచేస్తున్న వారికి తిరిగి ఆదాయం ఉండే స్థానాల్లోనే మరోసారి పోస్టింగ్ వచ్చేలా బదిలీలు చేశారని ఆరోపించారు. బాధ్యులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రేడ్-1 సబ్ రిజిస్ట్రార్ల(ఎస్ఆర్వో)కు సంబంధించి మల్టీజోన్-2లో ఉప్పల్ ఎస్ఆర్వోగా ఉన్న జె.సురేందర్ అనే అధికారిని కుత్బుల్లాపూర్ ఎస్ఆర్వోగా, రంగారెడ్డి రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న ఆర్.సతీష్‌ను ఉప్పల్ ఎస్ఆర్వోగా, ఎల్బీ నగర్ ఎస్ఆర్వోగా ఉన్న బి. రాజశేఖర్ రెడ్డిని శేరిలింగంపల్లికి బదిలీ చేశారని లేఖలో వివరించారు. అలాగే గోల్కొండ సయ్యద్ సిరాజ్ అన్వర్‌ను బంజారాహిల్స్‌కు, కాప్రా ఎస్.లక్ష్మారెడ్డిని రంగారెడ్డికి, కీసర నుంచి బి.సురేష్‌ను కూకట్‌పల్లికి, శేరిలింగంపల్లిలో పనిచేస్తున్న ఎం.రవికాంత్‌ను పటాన్‌చెరుకు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే గ్రేడ్-2 సబ్ రిజిస్ట్రార్లకు సంబంధించి జోన్-5, మల్టీజోన్-2లో చౌటుప్పల్, దేవరకొండ, చండూర్, యాదగిరిగుట్ట, బీబీనగర్, మిర్యాలగూడ, కోదాడ నుంచి పలువురు ఎస్ఆర్వోలని ప్రాధాన్య ప్రాంతాలకు మార్చారని తెలిపారు. అదేవిధంగా జోన్-6, మల్టీజోన్-2 పరిధిలోని బంజారాహిల్స్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్1గా ఉన్న ఎస్ సహదేవ్‌ను బాలనగర్‌కు, మల్కాజ్‌గిరి ఎ.అరవింద్‌బాబును రాజేంద్రనగర్‌కు, బోయినపల్లి డి.జ్యోతిని ఎల్బీనగర్‌కు బదిలీ చేశారని, నారపల్లి, ఇబ్రహీంపట్నం, ఘట్‌కేసర్, సరూర్‌నగర్ నుంచి బదిలీ అయిన ఎస్ఆర్వోలు కూడా ఇదే జాబితాలోకి వస్తారని పేర్కొన్నారు.

రుణమాఫీపై సంతృప్తిగానే రైతులు

- అసంతృప్తి ఉంటే వారు ఊరుకుంటారా?
- ఈ ప్రక్రియ తర్వాత రైతు భరోసాకు నిధులు
- ఇక్కడ రుణమాఫీపై మోదీ మాట్లాడడమా
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా చేశారేమో చెప్పండి: మంత్రి తుమ్మల
- గాంధీ భవన్‌లో కార్యకర్తల నుంచి ఫిర్యాదుల స్వీకరణ



గాంధీ భవన్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న మంత్రి తుమ్మల

హైదరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): "గత పదేళ్లలో రుణమాఫీ జరిగిన తీరును చూసిన రైతులు.. మేము చేస్తున్న తీరు పట్ల సంతృప్తిగానే ఉన్నారు. మిగిలిన రుణాలను మాఫీ చేస్తామన్న నమ్మకంతో ఉన్నారు. నిజంగా అసంతృప్తి ఉంటే వారు ఊరుకుంటారా? మార్కెట్ కమిటీ ఛైర్మన్ల ప్రమాణ స్వీకారానికి వేలాది మంది రైతులు వస్తున్నారు.. మేమూ రోజూ రైతులతోనే ఉంటున్నాం.. ఏ ఒక్కరూ రుణమాఫీ గురించి అడగడం లేదు. ఈ ప్రభుత్వంపై రైతులకు ఉన్న నమ్మకం అటువంటిది" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గత ఐదేళ్లలో పంట రుణం తీసుకున్న రైతులందరికీ మాఫీ ద్వారా లబ్ధి చేకూర్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని స్పష్టం చేశారు. ఇప్పటికే రూ.2లక్షలలోపు ఉన్న రుణాలను మాఫీ చేశామని గుర్తు చేశారు. అంతకంటే ఎక్కువగా ఉన్న రుణాల మాఫీకి సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలోనే విడుదల చేస్తామని చెప్పారు. గాంధీభవన్‌లో సోమవారం నిర్వహించిన 'మంత్రితో ముఖాముఖి'లో పాల్గొన్న తుమ్మల.. పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ రుణమాఫీ అమలు చేయని ప్రధాని మోదీ.. తెలంగాణలో అమలు చేస్తున్న రుణమాఫీ గురించి మాట్లాడడమే ఆశ్చర్యమన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా అమలు చేసి ఉంటే.. అదే పద్ధతిని అనుసరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. గతంలో రాష్ట్ర ఆర్థిక మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్.. ఏ రకంగా రుణమాఫీ చేశారో అందరికీ తెలిసిందేనని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో అస్తవ్యస్తంగా మారిన ఆర్థిక వ్యవస్థను సరి చేసుకుంటూ... రైతు బంధుకు రూ.7,600 కోట్లు, రుణమాఫీకి రూ.18వేల కోట్లు విడుదల చేశామని గుర్తు చేశారు. మొదటి పంట కాలంలోనే రైతుల ఖాతాల్లో రూ.25 వేల కోట్లు జమ చేసిన ఏకైక రాష్ట్రం.. తెలంగాణ మాత్రమేనని పేర్కొన్నారు. దేశంలో ఇంకెక్కడైనా ఇంతకన్నా బాగా రుణమాఫీ జరిగి ఉంటే.. బీజేపీ, బీఆర్ఎస్ చెప్పవచ్చన్నారు. అధికారం పోయిందని ఒక పార్టీ, అధికారం కోసం మరో పార్టీ కావాలని మాట్లాడుతున్నాయన్నారు. కాగా, 'మంత్రితో ముఖాముఖి'లో భాగంగా పార్టీ కార్యకర్తలు, నేతల నుంచి దాదాపుగా 95 వినతులను తుమ్మల స్వీకరించారు. వీటిలో భూ సమస్యలు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు.. వంటి అంశాలే ఎక్కువగా వచ్చాయి. సూర్యాపేట జిల్లా నేరెడుచర్ల మండలానికి చెందిన వృద్ధురాలు యాదమ్మ... తన భూమికి సంబంధించిన సమస్యను విన్నవించగా.. అప్పటికప్పుడు ఆ జిల్లా కలెక్టర్‌కు తుమ్మల ఫోన్ చేశారు. సంబంధిత భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ గాంధీభవన్‌లో మంత్రితో ముఖాముఖి వంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషించదగ్గ విషయమన్నారు.

ర్యాంకు పెరిగినా.. కన్వీనర్ కోటా దక్కింది

ఉస్మానియా వైద్య కళాశాలలో 1.15 లక్షల ర్యాంక్‌కు సీటు.. ప్రైవేటులో జనరల్ విభాగంలో 1.95 లక్షలకు..

- పూర్తయిన రెండో విడత కన్వీనర్ కోటా కౌన్సెలింగ్

హైదరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నీట్ ర్యాంకు లక్షల్లో వచ్చినవారికి రాష్ట్రంలో ఎంబీబీఎస్ కన్వీనర్ కోటాలో సీట్లు దక్కాయి. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలు అన్నింట్లోనూ రెండో విడత కౌన్సెలింగ్‌లో ర్యాంకులు పెరిగినా సీటు లభించడం విశేషం. కన్వీనర్ కోటా రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయింపు ర్యాంకుల వివరాలను సోమవారం కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. బీసీ ఏలో గరిష్ఠంగా 3.35 లక్షల ర్యాంకు విద్యార్థికి ప్రైవేటు వైద్య కళాశాలలో సీటు లభించింది. ఇంత పెద్ద ర్యాంకుకు సీటు దక్కడం రాష్ట్ర చరిత్రలో మొదటిసారి అని వర్సిటీ వర్గాలు తెలిపాయి. ఎస్సీ విభాగంలో 3,11 లక్షల ర్యాంకు విద్యార్థికి, ఎస్టీల్లో 2.89 లక్షల ర్యాంకర్‌కు కన్వీనర్ కోటా సీట్లు వచ్చాయి. బీసీ బిలో 2.27 లక్షలు, బీసీ సిలో 3.14 లక్షలు, బీసీ డిలో 2.13 లక్షలు, బీసీ ఇలో 2.24 లక్షలు, ఓపెన్‌లో 1.95 లక్షలు, ఈడబ్ల్యూఎస్‌లో గరిష్ఠంగా 1.74 లక్షల ర్యాంకు విద్యార్థికి సీటు దక్కింది. రాష్ట్రంలో 60 ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లోని 5,653 కన్వీనర్ సీట్లను రెండు విడతల కౌన్సెలింగ్‌లో విద్యార్థులకు కేటాయిస్తూ కాళోజీ విశ్వవిద్యాలయం జాబితా విడుదల చేసింది. తొలి దశలో 4,282 మందికి సీట్లు ఇచ్చారు. అందులో చేరినవారు పోగా మిగిలిన సీట్లకు, తొలి విడత కౌన్సెలింగ్‌లో కేటాయించని దివ్యాంగులు తదితర సీట్లను రెండో విడత కౌన్సెలింగ్‌లో కేటాయించారు. కన్వీనర్ కోటా సీట్లన్నీ తెలంగాణ విద్యార్థులకే ఇస్తుండడం, 8 కొత్త వైద్య కళాశాలల్లో 400 సీట్లు రావడంతో అవకాశాలు పెరిగాయి. దీంతో పెద్ద ర్యాంకులు పొందిన విద్యార్థులకూ సీట్లు దక్కాయి. ప్రభుత్వ కళాశాలల్లో 15 శాతం అఖిల భారత కోటాకు పోగా మిగతావన్నీ, ప్రైవేటు కళాశాలల్లోని 50 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. అఖిల భారత కోటాలో రెండు విడతల కౌన్సెలింగ్ తర్వాత సీట్లు మిగిలితే వాటిని రాష్ట్రానికే ఇస్తారు. కాగా, రెండో విడత జాబితాలో సీట్లు పొందిన విద్యార్థులకు కళాశాలల్లో చేరేందుకు ఆరు రోజుల పాటు అవకాశం కల్పించారు. తొలి విడత కౌన్సెలింగ్‌తో పోల్చితే రెండో దశలో అధిక ర్యాంకులు సాధించినవారికి సీట్లు దక్కాయి. అనేక మంది ఎయిమ్స్‌లలో చేరడమే దీనికి కారణం. ఉస్మానియాలో తొలి విడత ఓపెన్ కేటగిరీలో 3,602 ర్యాంకర్‌కు సీటు రాగా, రెండో విడతలో గరిష్ఠంగా 20,797 ర్యాంకు వారికి సీటు దక్కింది. ఈ కళాశాలలోనే ఈడబ్ల్యూఎస్ కింద తొలి విడతలో 22,628 ర్యాంకుకు సీటు దక్కగా.. మలి విడతలో 41,775 ర్యాంకు వారికీ లభించింది. ఎస్సీ కేటగిరీలో ఉస్మానియా తొలి రౌండ్‌లో గరిష్ఠంగా 37,750 ర్యాంకర్‌కు.. రెండో రౌండ్‌లో 1.09 లక్షల ర్యాంకర్‌కు సీటు దక్కడం గమనార్హం. ఎస్టీల్లో ఇదే కళాశాలలో తొలి విడత 31,994 ర్యాంకర్‌కు సీటు దక్కగా.. రెండో రౌండ్‌లో 1.15 లక్షలకు సీటు వచ్చింది. గాంధీ వైద్య కళాశాలలోనూ కొంచెం అటుఇటుగా ఇలాగే సీట్లు దక్కాయి. ఓపెన్‌లో తొలి విడత కౌన్సెలింగ్‌లో అఖిల భారత ర్యాంకు 3,077కు సీటు రాగా, మలి విడతలో 11,448 ర్యాంకు విద్యార్థికి సీటు దక్కింది. ఈడబ్ల్యూఎస్‌లో తొలి రౌండ్ కౌన్సెలింగ్‌లో 13,354 ర్యాంకర్‌కు, రెండో దశలో 37,190 ర్యాంకర్‌కు సీటు వచ్చింది. ఎస్టీల్లో మొదటి విడతలో 12,473 ర్యాంకర్‌కు, రెండో విడతలో 77,168 ర్యాంకుకు సీటు వచ్చింది.

నీట్ ఎంబీబీఎస్‌లో ఎస్సీ గురుకుల విద్యార్థుల రికార్డు

ఎస్సీ గురుకులాల్లో చదువుతున్న 174 మంది విద్యార్థులకు నీట్ ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు లభించాయని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి తెలిపారు. సాయివంశీ 438 ర్యాంకుతో గాంధీలో, హేమంత్ (1791), శ్రుతి (3378) ఉస్మానియాలో సీట్లు పొందారని చెప్పారు. వివిధ కళాశాల్లో కొందరు విద్యార్థులకు సీట్లు దక్కాయన్నారు.

జేఎండీ చాంబర్ మరమ్మతులకు రూ.60 లక్షలు

- వికలాంగుల సంక్షేమ శాఖలో భారీ అవినీతి
- గత పదేళ్లలో రూ. కోట్లు దారి మళ్లించారు
- వికలాంగుల సహకార సంస్థ ఛైర్మన్ ముత్తినేని

హైదరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో వికలాంగుల సంక్షేమ శాఖ, సహకార సంస్థల్లో భారీ అవినీతి జరిగిందని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య ఆరోపించారు. గత ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్‌తో పాటు గతంలో వికలాంగుల కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించిన వాసుదేవరెడ్డి సహకారంతో అధికారులు కోట్ల రూపాయల నిధులను దారి మళ్లించడంతో పాటు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వికలాంగుల సంక్షేమానికి వినియోగించాల్సిన రూ.60.94 లక్షల నిధులను జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ చాంబర్ మరమ్మతులకు ఖర్చు చేశారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 45 వేల మంది వికలాంగులకు వివిధ పరికరాలు ఇచ్చినట్టు ఆడిట్లలో చూపించారని, కానీ ఆ లబ్ధిదారుల జాబితా మాయం అయిందన్నారు. శాఖ, కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి, అక్రమాలు, నిధులు దారి మళ్లిన ఘటనలపై సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఏసీబీ, విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.






Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **K. Srinivas.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● మంగళవారం 8 అక్టోబరు 2024
diksuchi@andhrajyothy.com

కాళోజీ అనుబంధ కళాశాలల్లో
నర్సింగ్ డిగ్రీలు

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(కేఎన్ఆర్ యూహెచ్ఎస్)- బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ నర్సింగ్ కళాశాలల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. ఈ కోటా కింద ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో మొత్తం సీట్లు; ప్రైవేట్ నర్సింగ్ కాలేజీల్లో 60 శాతం సీట్లు అలాట్ చేస్తారు.



బీఎస్సీ నర్సింగ్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; ఇంటర్ ఒకేషనల్‌తోపాటు బయాలజీ అండ్ ఫిజికల్ సైన్సెస్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏఐఎస్ఎస్‌సీఈ/ఐసీఎస్ఈ/ఎస్ఎస్‌సీఈ/హెచ్ఎస్‌సీఈ/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సైన్స్ సబ్జెక్టుల్లో జనరల్ అభ్యర్థులకు 45 శాతం; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గుర్తింపు పొందిన బోర్డు/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్ నుంచి ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణతతోపాటు జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కోర్సు పూర్తిచేసి స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ గుర్తింపు పొందినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 21 ఏళ్లు నిండి ఉండాలి. అకడమిక్ మెరిట్/జీఎన్ఎం మార్కుల ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం
- **రిజిస్ట్రేషన్ అండ్ ప్రాసెసింగ్ ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.2500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14
- **వెబ్‌సైట్:** www.knruhs.telangana.gov.in

ఎండీఐలో పీజీ డిప్లొమా



మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎండీఐ)- పీజీడీఎం, పీజీడీఎం -హెచ్ఆర్ఎం(హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్), పీజీడీఎం-ఐబీ(ఇంటర్నేషనల్ బిజినెస్), పీజీడీఎం-బీఏ(బిజినెస్ అనలిటిక్స్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. గుర్గావ్ క్యాంపస్‌లో అన్ని ప్రోగ్రామ్‌లు, ముర్షిదాబాద్ క్యాంపస్‌లో పీజీడీఎం ప్రోగ్రామ్ అందుబాటులో ఉన్నాయి. ఇవి రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్‌లు. వీటికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్(ఏఐయూ) వీటిని ఎంబీఏ డిగ్రీతో సమానంగా గుర్తించింది.

పీజీడీఎం, పీజీడీఎం-హెచ్ఆర్ఎం, పీజీడీఎం-బీఏ: ఒక్కో ప్రోగ్రామ్‌లో ఆరు టర్మ్‌లు ఉంటాయి. ఒక్కో టర్మ్ వ్యవధి మూడు నెలలు. మొదటి నాలుగు టర్మ్‌లలో కోర్ కోర్సులు ఉంటాయి. మూడో టర్మ్ తరవాత ఎనిమిది నుంచి పది వారాల ఇంటర్న్‌షిప్ ఉంటుంది. అయిదు, ఆరు టర్మ్‌లలో అభ్యర్థులు ఎలక్టివ్ సబ్జెక్టులను ఎంచుకోవాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌నకు సంబంధించి నిర్దేశిత సంఖ్యలో ఎలక్టివ్‌లను; అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, స్ట్రాటజీ, ఇన్సూరెన్స్ మేనేజ్‌మెంట్‌నుంచి కనీసం రెండు ఎలక్టివ్‌లను ఎంచుకోవాలి.

పీజీడీఎం-ఐబీ: ఇది డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్. దీనిని ఎండీఐ గుర్గావ్, ఈఎస్‌సీపీ యూరప్ ఉమ్మడిగా నిర్వహిస్తాయి. మొదటి మూడు టర్మ్‌లు గుర్గావ్ క్యాంపస్‌లో చదవాలి. తరవాత రెండు టర్మ్‌లను ఈఎస్‌సీపీ(పారిస్/బెర్లిన్/మాడ్రిడ్/ట్యూరిన్/వార్సా/లండన్) క్యాంపస్‌లో చదవాల్సి ఉంటుంది. ఇక్కడ ఇంటర్నేషనల్ మేనేజ్‌మెంట్ కోర్సులు, ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్ పూర్తిచేయాల్సి ఉంటుంది. చివరి టర్మ్‌ను గుర్గావ్ క్యాంపస్‌లో చదవాలి. నిబంధనల ప్రకారం కోర్సు పూర్తిచేసినవారికి ఈఎస్‌సీపీ యూరప్ 'మాస్టర్ ఇన్ మేనేజ్‌మెంట్ డిగ్రీని, గుర్గావ్ క్యాంపస్ పీజీడీఎం-ఐబీ డిగ్రీని ప్రదానం చేస్తాయి.

అర్హత: పదోతరగతి, ఇంటర్ స్థాయుల్లో కనీసం ద్వితీయ శ్రేణి మార్కులు ఉండాలి. క్యాట్ 2024నకు దరఖాస్తు చేసుకొని ఉండాలి. లేదా జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. పీజీడీఎం, పీజీడీఎం-హెచ్ఆర్ఎం, పీజీడీఎం-బీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని మూడేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్న వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. 2025 అక్టోబరు 31 నాటికి సర్టిఫికెట్‌లు సబ్మిట్ చేయాలి. పీజీడీఎం-ఐబీలో ప్రవేశానికి కనీసం 50 శాతం మార్కులతో నాలుగేళ్ల వ్యవధి గల డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. 2025 జనవరి 31 నాటికి కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. అప్రెంటిస్‌షిప్, ఆర్టికల్‌షిప్, ఇంటర్న్‌షిప్‌లను ప్రొఫెషనల్ అనుభవం కింద పరిగణించరు. పీజీ, సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏఐ, ఏఎంఐఈ, సీఎఫ్ఏ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ, క్యాట్ 2024 స్కోర్/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

స్కాలర్‌షిప్‌లు: గుర్గావ్ క్యాంపస్‌లో అన్ని ప్రోగ్రామ్‌లకు మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్ కింద పన్నెండుమందికి ట్యూషన్ ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తారు.
- రెండో సంవత్సరం చదువుతున్నవారికి ఓపీ జిందాల్ స్కాలర్‌షిప్ కింద రూ.1,50,000 ఇస్తారు.
- రెండో ఏడాది ప్రోగ్రామ్ చివరలో మొదటి అయిదు స్థానాల్లో నిలిచిన వారికి మెరిట్ స్కాలర్‌షిప్ కింద ఒక్కొక్కరికి రూ.10,000 ఇస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** గుర్గావ్ క్యాంపస్‌కు రూ.3,000; ముర్షిదాబాద్ క్యాంపస్‌కు రూ.1180; రెంటికీ అప్లయ్ చేసుకోవాలంటే రూ.3,590
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు జీడీ, పర్సనల్ ఇంటర్వ్యూ సెంటర్:** హైదరాబాద్
- **దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 22
- **వెబ్‌సైట్:** www.mdi.ac.in

జిప్మర్‌లో బీఎస్సీ

పుదుచ్చేరీలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్మర్)- బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ(అలైడ్ హెల్త్ సైన్సెస్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం 181 సీట్లు ఉన్నాయి. నీట్ యూజీ 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

బీఎస్సీ నర్సింగ్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులోనే 24 వారాల పెయిడ్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 94 సీట్లు ఉన్నాయి. మహిళలకు 85, పురుషులకు 9 సీట్లు ప్రత్యేకించారు.

బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్సెస్ స్పెషలైజేషన్‌లు: మెడికల్ ల్యాబొరేటరీ సైన్సెస్, అనెస్థీషియా టెక్నాలజీ, ఆప్టోమెట్రీ, కార్డియాక్ ల్యాబొరేటరీ టెక్నాలజీ, డయాలసిస్ థెరపీ టెక్నాలజీ, మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ ఇన్ బ్లడ్ బ్యాంకింగ్, మెడికల్ రేడియాలజీ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీ, న్యూరోటెక్నాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీ, పెర్ఫ్యూజన్ టెక్నాలజీ, రేడియోథెరపీ టెక్నాలజీ



సీట్లు: మెడికల్ ల్యాబొరేటరీ సైన్సెస్‌లో 37 సీట్లు, మిగిలిన వాటిలో ఒక్కోదానిలో అయిదు సీట్లు చొప్పున మొత్తం 87 సీట్లు ఉన్నాయి.
- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మెడికల్ ల్యాబొరేటరీ సైన్సెస్ స్పెషలైజేషన్‌లో అర్నెల్లు; మిగిలిన అన్ని స్పెషలైజేషన్‌లలో ఏడాది వ్యవధి గల కంపల్సరీ ఇంటర్న్‌షిప్ ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బోటనీ అండ్ జువాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 50 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం; జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 45 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థులందరూ నీట్ యూజీ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 24
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** నవంబరు 8
- **తరగతులు ప్రారంభం:** నవంబరు 25 నుంచి
- **వెబ్‌సైట్:** jipmer.edu.in

ఐసర్ తిరుపతిలో పీహెచ్‌డీ



తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)- పీహెచ్‌డీ 2025 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్సు వర్క్‌లు, టీచింగ్ అసిస్టెంట్‌షిప్‌లు ఉంటాయి.

విభాగాలు: బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మేథమెటిక్స్, ఎర్త్ అండ్ క్లైమేట్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్/ఎంపీఎస్సీ లేదా ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. ఐసర్ సంస్థల నుంచి బీఎస్-ఎంఎస్ పూర్తిచేసినవారు; ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్/నెట్/జెస్ట్/జేజీఈఈబీఐఎల్ఎస్ వ్యాలిడ్ స్కోర్ లేదా సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/యూజీసీ జేఆర్ఎఫ్/ఇన్‌స్పయిర్ ఫెలోషిప్ అర్హత ఉండాలి.
- అభ్యర్థుల వయసు ప్రోగ్రామ్ ప్రారంభం నాటికి 30 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 3
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** నవంబరు 11 నుంచి 15 వరకు
- **ఇంటర్వ్యూలు:** నవంబరు 25 నుంచి 29 వరకు
- **ఇంటర్వ్యూల ఫలితాలు విడుదల:** డిసెంబరు 9 నుంచి 15
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** 2025 జనవరి 2 నుంచి
- **వెబ్‌సైట్:** www.iisertirupati.ac.in

ఓఎన్‌జీసీలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 2236

ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్...కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

అప్రెంటిస్ ఖాళీల వివరాలు
1. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్
2. డిప్లొమా అప్రెంటిస్
3. ట్రేడ్ అప్రెంటిస్

సెక్టార్ల వారీగా ఖాళీలు
1. నార్తర్న్ సెక్టార్: 161
2. ముంబయి సెక్టార్: 310
3. వెస్ట్రన్ సెక్టార్: 547
4. ఈస్ట్రన్ సెక్టార్: 583
5. సదరన్ సెక్టార్: 335
6. సెంట్రల్ సెక్టార్: 249

అర్హత: విభాగాన్ని అనుసరించి పదో తరగతి, పన్నెండో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

ట్రేడ్/విభాగాలు: అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సెక్రటేరియల్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, సివిల్ ఎగ్జిక్యూటివ్, పెట్రోలియం ఎగ్జిక్యూటివ్, ఆఫీస్ అసిస్టెంట్, ఫైర్ సేఫ్టీ టెక్నీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, స్టోర్ కీపర్, మెషినిస్ట్, సర్వేయర్, వెల్డర్, ఫైర్ సేఫ్టీ టెక్నీషియన్, మెకానిక్ డీజిల్ తదితరాలు.

వయోపరిమితి: 2024 అక్టోబరు 25 నాటికి 18 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.

స్టయిపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000. డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8,050. ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.7,000 - రూ.8,050.

ఎంపిక ప్రక్రియ: అర్హత పరీక్షలో సాధించిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

వర్క్ సెంటర్: డెహ్రాడూన్, ఢిల్లీ, జోధ్‌పూర్, గోవా, హజీరా, ముంబయి, ఉరాన్, పన్వెల్, నవా, అహ్మదాబాద్, అంక్లేశ్వర్, వడోదర, బొకారో, కాంబే, మెహసానా, జోర్హాట్, నజీరా - శివసాగర్, సిల్చార్, చెన్నై, కాకినాడ, కారైకల్, రాజమండ్రి, అగర్తల, కోల్‌కతా

దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 25

వెబ్‌సైట్: https://ongcindia.com/

'టెక్నికల్ టీచర్స్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్'లో ఖాళీలు

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్...కింద పేర్కొన్న గ్రూప్-సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 22

గ్రూప్-సి పోస్టులు
1. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్: **1 పోస్టు**
2. టెక్నికల్ అసిస్టెంట్ గ్రేడ్-2: **2 పోస్టులు**
3. సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్: **6 పోస్టులు**
4. సీనియర్ టెక్నీషియన్: **1 పోస్టు**
5. జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్: **2 పోస్టులు**
6. టెక్నీషియన్: **1 పోస్టు**

అర్హత: పదో తరగతి, ఇంటర్మీడియట్ పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 35 ఏళ్లు మించకూడదు

ఫీజు: రూ.500. మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టులకు రూ.300.ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/మహిళ/ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.


పని ప్రదేశాలు: విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై

ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్/ఫిజికల్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 15

వెబ్‌సైట్: https://www.nitttrc.ac.in/

ఆర్మీ పబ్లిక్ స్కూళ్లలో టీచర్ పోస్టులు



దేశంలోని వివిధ కంటోన్మెంట్, మిలిటరీ స్టేషన్లలోని 139 ఆర్మీ పబ్లిక్ స్కూళ్లలో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి ఆర్మీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ దరఖాస్తులు కోరుతోంది.

తెలుగు రాష్ట్రాల్లో ఆర్మీ పబ్లిక్ స్కూళ్లున్న ప్రాంతాలు: సికింద్రాబాద్(ఆర్‌కేపీ), సికింద్రాబాద్(బొల్లారం), గోల్కొండ.

పోస్టుల వివరాలు
1. పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ)
2. ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ)
3. పీఆర్‌టీ(ప్రైమరీ టీచర్)

సబ్జెక్టులు: బయాలజీ, కంప్యూటర్ సైన్స్, ఇంగ్లీష్, జాగ్రఫీ, హిస్టరీ, హిందీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, సైకాలజీ, సంస్కృతం, ఫిజికల్ ఎడ్యుకేషన్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్, పీజీ, డీఈఎల్ఈడీ, బీఈఎల్ఈడీ, బీఈడీ, బీపీఈడీ ఉత్తీర్ణతతో పాటు, సీటెట్, టెట్ అర్హత తప్పనిసరి.

వయోపరిమితి: 2024 ఏప్రిల్ 1 నాటికి ఫ్రెషర్స్ 40 ఏళ్లలోపు, అనుభవజ్ఞులైన అభ్యర్థులు 57 ఏళ్లలోపు ఉండాలి.

ఎంపిక విధానం: ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ, టీచింగ్ స్కిల్స్, కంప్యూటర్ ప్రావీణ్యం, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 25

పరీక్ష తేదీలు: నవంబరు 23, 24

ఫలితాల వెల్లడి: డిసెంబరు 10

వెబ్‌సైట్: https://awesindia.com/

కెనరా బ్యాంకులో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

బెంగళూరులోని కెనరా బ్యాంక్, హ్యూమన్ రిసోర్సెస్ విభాగం, ప్రధాన కార్యాలయం...రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 6

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎల్ఎల్‌బీ డిగ్రీ, సీఏ/ఐసీఏడబ్ల్యూఐ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 35 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.600; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు రూ.100.

జీతం: నెలకు కంపెనీ సెక్రటరీ(ఎంఎంజీఎస్-2) పోస్టులకు రూ.93,960; కంపెనీ సెక్రటరీ(ఎంఎంజీఎస్-3) పోస్టులకు రూ.1,05,280.


ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 20

వెబ్‌సైట్: canarabank.com/

లిటిల్స్

సీతా ఫలం నేర్పిన నీతి




గౌతమీ నది తీరంలో ఆనందుడు అనే ముని కొందరు రాజ కుమారులకు విద్యా బుద్ధులు నేర్పిస్తూ ఉండేవాడు. ఒక రోజు ముని చుట్టు పక్కల గ్రామాల నుండి తన మాటలు వినడానికి వచ్చిన వారితో మాట్లాడుతూ ఉండగా, నీటిలో బాగా తడిచిపోయి ఉన్న ఒక వ్యక్తిని అతని శిష్యులు నలుగురు మోసుకుంటూ వచ్చారు. వారిని చూసిన ముని ఇలా అడిగాడు. 'ఎవరు నాయనా ఇతను? ఎందుకిలా తడిచిపోయి ఉన్నాడు? అని అడిగాడు.దానికి శిష్యులు ' ఇతను మా కళ్ల ముందే నదిలో పడిపోయాడు స్వామీ. నీటిలో పడి కొట్టుకు పోతుంటే మేము కాపాడి తీసుకువచ్చాము' అని చెప్పారు.ఆనందుడు ఆ వ్యక్తిని ఇలా అడిగాడు ' ఏం నాయనా ప్రమాదవశాత్తూ నీటిలో పడిపోయావా?అన్నాడు దానికి ఆ వ్యక్తి ' లేదు స్వామీ నాకు జీవితంలో చాలా సమస్యలు ఉన్నాయి.అవన్నీ పరిష్కరించుకునే మార్గం తెలియకనే ఆత్మ హత్య చేసుకుందాం అని నీటిలో నేనే దూకేసాను. ఈ లోగా మీ శిష్యులు నన్ను కాపాడి తీసుకువచ్చారు' అన్నాడు. అది విన్న ముని తన శిష్యులతోఈతను చాలా నీరసంగాకనిపిస్తున్నాడు. ముందుగాఆతనికి కట్టుకోవడానికి వేరే పొడి బట్టలు ఇచ్చి,తినడానికి ఏ పండో ఫలమో ఇవ్వండి' అని చెప్పాడు. శిష్యులు గురువు మాట ప్రకారమేఆ వ్యక్తికి మార్చుకోవడానికి బట్టలు ఇచ్చి, తినడానికి ఒక సీతాఫలం ఇచ్చారు. అతనుసీతాఫలం తిని గింజలన్నీ తీసిపక్కన ఉమ్మేస్తూ వచ్చాడు అతను పండు తినడం పూర్తి చేసాక ఆనందుడు అతన్ని దగ్గరకుపిలిచి ఇలా అడిగాడు ఏం నాయనా ఆ గింజలన్నీఅలా పారేసావు ఇంతకీ పండు ఎలా ఉంది? అని అడిగాడు. పండు చాలా తియ్యగా మధురంగా ఉంది స్వామీ కానీ పండు బాగుందని పండుతో పాటు గింజలు తినలేము కదా.అందుకే గింజలన్నీ తీసి అలా పారేసాను' అన్నాడు. అన్ని గింజలు ఉండి ఇబ్బంది పెడుతున్నపుడు ఆ పండును తినకుండా పారేయలేకపోయావా? అన్నాడు ఆనందుడు. దానికి అతను ఇదేం న్యాయం స్వామీ? కొన్ని గింజలు వచ్చాయని అంత తియ్యని పండును కాదు అనుకుంటామా? గింజలు పక్కకు పెట్టిపండు రుచిని ఆస్వాదించవచ్చు కదా ' అన్నాడు. ఆ మాటలు విన్న ఆనందుడు మన జీవితం కూడా ఈ సీతాఫలం లాగే నాయనా.. కొన్ని కష్టాలు, సమస్యలు వచ్చాయని ఇంత మంచి జీవితాన్నిఅంతం చేసుకుంటామా? తప్పు కదూ ' అన్నాడు ఆ మాటలలో నిజం గ్రహించిన ఆ వ్యక్తి నిజమే స్వామీ అంటూ ముని వద్ద సెలవు తీసుకుని, ఇంటికి వెళ్లిపోయాడు.


సరైన నీడ ఏది?




దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



ఎవి ఎన్ని?



డైలీ సుడోకు - 429

		6			3			8
					4			2
		8		5		9	6	1
				7				5
	8						7	
6				3				
2	3	4		8		6		
8			3					
7			5			1		

సుడోకు - 428 సమాధానం

9	7	8	4	1	2
6	2	4	5	8	3
1	3	5	7	6	9
8	9	7	6	3	4
5	1	6	9	2	7
2	4	3	1	5	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.